THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_204686
LIBRARY
UNIVERSAL

లోకోభిన్నరుచిః

భమిడిపాటి కామేశ్వరరావు

రు 1/-

పబ్లిషర్సు. అద్దేపల్లి అండ్ కో
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

అన్నిస్వామ్యాలూ
గ్రంథకర్తవి

Saraswathi Power Press, Rajahmundry
Printed and Published by
A Lakshmanaswamy Naidu
For Addepally & Co , Educational Publishers
Order No 4873/1948

విషయములు

[illegible]	ఏప్రియల్	1939
అమోఘమార్గం - అభినందనం	మే	1939
తిండివేషాలు	ఏప్రియల్	1941
లోకోభిన్నరుచిః	జూన్	1941
స్థాయిమారినా వోటేపాటు!	అక్టోబరు	1941
రేడియో - కబుర్లు I, II, III.	ఫిబ్రవరి	1941
అమోఘమార్గవిమర్శ	ఏప్రియల్	1944

బస్తీ రోడ్డు

"రోడ్డు" అనేది తెలుగువాళ్లు అప్రయత్నంగా వాడే ఇంగ్లీషుమాటల్లో ఒకటి. ఇంగ్లీషువారు మనకి పట్టిగా తెచ్చి పడేసిన పదార్థాల్లో రోడ్డుకూడా ఉంది. సాధారణంగా శకటాలు కూడా వెళ్లేడానికి వీలుండి, రంగమీరి ఉన్నప్పుడు మాత్రమే, ఏదేనా మార్గాన్ని రోడ్డు అంటాను. రోడ్డును గురించిన పుస్తకాలు తెలుగులో లేవు. ('నాకు తెలియదు' అనేకబదులు చల్లగా చెప్పడానిక 'లేవు' అనేది ఆలంకారికం.) రోడ్డులాంటి అధమ విషయంగురించి రాస్తే, కావ్యంకూడా నీచంఅయిపోవచ్చుగదా అనే ప్రతిచెప్పగల సమర్థులు దాన్ని వాదిలేస ఉంటారు కూడా, ఆసంగతి తెలియకపోడంవల్ల గావును, అన్యభాషల్లో వాళ్లు రోడ్లు గురించి వందలాదిగా పుస్తకాలు ప్రచురించారు. సామాన్యోపయోగకరంగా ఉండే వృత్తాంతాలు ఏవైనాసరే గ్రంథస్థం అయినప్పుడు పండితులు దుర్ముహూర్తంలేకుండా చూసుగుని క్షమించి పారెయ్యడం మంచిది. నేలబారురచన మాత్రం చెయ్యగల అస్మదాదులకి 'రోడ్డు' సరిపడ్డ విషయం. ఏమంటే, ఇందులో నేల విడిచి సాం అవసరం లేదు. చాలా పూర్వకాలంలోనే మనుష్యులు నడవడానికీ, గుఱ్ఱపుదళాలు వెళ్లడానికీకూడా, అనేకదేశాల్లో శాశ్వత మార్గాలు ఉండిఉన్నట్టు తెలిసినా, రోడ్డు అనేమాట పుట్టి ఆట్టేకాలం కాలేదు. ౧౮౩౬ లో

పార్లమెంటుసభకి ఓప్రభువు తనబండిమీద వెళుతూంటేగా, అప్పటి లండన్ బురదవీథుల్లో ఒకచోట ఉన్న ఊబిలో ఆయన బండీయూవత్తూ దిగబడి ఊరుకుందట. ఈ రెండువందల ఏళ్లలోనూ, ఇతరదేశాల్లో జనం రోడ్లనిగురించి చేసిన ఆలోచనా, చూపెట్టిన ఆదరణా, సాధించిన అభివృద్ధి మనికి తెలుస్తూన్నప్పుడు, అందరూ రోడ్డుని గురించి దుమ్మురేగేటట్టు ప్రచారంచేసుకుని కాంగ్రెసులు కూడా జరుపుతూన్నప్పుడు, రోడ్డు అనేవిషయాన్ని మనం కొట్టి పారెయ్యడానికి వీల్లేదు — అసలు అనుక్షణం కాళ్లకి చుట్టుకుని ఉండే విషయాన్ని పారెయ్యడం శక్యమూ కాదు, శౌర్యమూ కాదు మరొకసంగతి మానవులు కలిసిగాని జీవించలేరు ఒంటరిగా జీవించగలవాళ్ళు ఉండవచ్చు, ఉన్నారు, వాళ్ళు మానవాతీతులు పెద్దస్థలంలో కొద్దిమంది మాత్రంకలిసి పల్చపల్చగా ఉండేలాగు నివాసం అయిఉంటే దాన్ని గ్రామంఅనిన్నీ, కొద్దిస్థలంలో చాలామందికలిసి ఒత్తిడిగా నివసిస్తే దాన్ని బస్తీఅనిన్నీ అంటారు

ఒకదేశంలో ఈచివరనుంచి ఆచివరకి ఉండే ప్రతిచిన్నస్థలం కూడా కామధేనువు లాంటిదైతే, ఆదేశంలో ఉండుకున్న గ్రామాలసంఖ్య ఎక్కువగాఉంటుంది, ఇంకా గ్రామాలు పుడుతూంటాయి. కాని, ఏదేనా దేశంలో చవిటిపర్రలూ, ఉప్పుచెరువులూ, ఇసకఎడార్లూ, బోడికొండలూ, గనక విస్తారంగా ఉంటే, జనం ఎక్కడబడితే అక్కడ నివసించడం అసంభవం అయి,

కొత్తగ్రామాలు పుట్టడానికి ఆస్కారంలేక, ఉన్నగ్రామాలే బస్తీలుగా మారడానికి యత్నిస్తాయి. ఈదేశం, వైశాల్యం ధర్మ్యాలను, ఏరకంలోనేనా సరే చేగుతుంది. ఇక్కడ లేని రకం ఉండదు. విస్తారం గ్రామాలూ ఉన్నాయి, కొత్తవి పుట్టుతూనూ ఉన్నాయి కొన్ని బస్తీలుగానూ మారుతూన్నాయి. స్థూలంగా చెప్పాలంటే, జనాభా ఒక పాతిక వేలకి దగ్గిరపడినా, లేక ఎంత వంకరటింకరదైనాసరే ఒక కంకర రోడ్డు దాంట్లోకి చొరబడినా, గ్రామంఅనేది బస్తీగా ముసురు తుంది. ఒక బస్తీనుంచి ఇంకోబస్తీ చేరుకోడానికికూడా ఘంటాపథాలు ఉంటాయి. ప్రస్తుతం వాటిసంగతి కాదు. ఒకేబస్తీలో ఉండేజనం, తమతమ వ్యవహారం సందర్భాలు నూటుగోవలిసి, అవసరం వచ్చినప్పుడు ఒక గృహందగ్గిరనుంచి ఇంకో గృహానికి వెళ్ళాలి. ఈరీతిగా సోమాజనం తప్పకడం అందరూ వెంటతూంటారు. అందుచేత, ఇళ్ళమధ్య పిట్టైనంత ఖాళీస్థలం అశేషజనం ఉమ్మడిగా వాడుకోడానికి కేటాయించి ఉంటుంది. అటువంటి బస్తీవీధిరోడ్ల సంగతి కొంచెం ముచ్చటించడమే ఇప్పుడు సంకల్పం.

రోడ్డు అనేపదార్థం మాయమంత్రంవల్ల చిటికెలో తయారయే బాపతు కాదు. దానికి కష్టసుఖాన్ని రూపాంతరాలున్నాయి. వాటిని జన్మాంతరాలన్నా ప్రత్యవాయము లేదు. అసలు దుర్గమస్థలంలో మొట్టమొదట కాలు పెట్టేవాడు సాహసుడయి ఉంటాడు. వాడిఉద్దేశం వాడికే తెలిసిఉంటుంది.

ఒక్కొక్కప్పుడు వాడికీ మొదట తెలియదు. వాడు ఎక్కడికో పోతాడు, ఏదో ఒకటి అవుతాడు, గాని వాడి ధ్యాస మాత్రం మిగిలి ఉంటుంది. వాడి ఉద్దేశం ఏమిటో, వాడు ఏమయ్యాడో కనుక్కో, దానికి వాడి అడుగుజాడల్లో వెళ్ళగల్గి ఉండాలి. వేరవాళ్ళే క్రమేపీ ఘనులౌతారు. వాళ్ళు మొదటి వాడి కారణంవల్ల ప్రపంచానికి అవసరం ఉన్న ఆదారి ఖాయపరుస్తారు. గమ్యస్థలానా అసలు ప్రత్యేకతలు దొరికే మార్గం జరిగి ప్రాముఖ్యం ఆదారి నడితారు. మరి కొంతకాలానికి ఆదారి రహదారి అవుతుంది. దాన్ని ఎత్తు చేస్తారు, గట్టి వంతెల్ను స్థిరంచేస్తారు. దాన్ని అడ్డువస్తువుల్ని తీసేస్తారు, ఏళ్ళని దాటేస్తారు. ఆదారిని గట్టిపరచి నునుపు చేస్తారు. రంగుగా ఉండి ఆదారి మానవుల్ని జంతువుల్ని శకటాల్నికూడా ఆకర్షిస్తుంది. ఆరూపందాల్చినదాన్ని "రోడ్డు" అంటారు. పల్లెటూరిదిక్కుల్లో ఉండేదార్లు ఇన్ని రూపాంతరాలూ దాల్చేసరికి పుష్కరాలు ఎగిరిపోతాయి. బస్తీలో అయితే ఒకప్పుడు సంవత్సరాలుమాత్రం జరిగిపోతాయి. బస్తీలోకూడా ఇళ్ళవరసల మధ్య ఉండేస్థలం ప్రథమంలో దాని చిత్తంవచ్చినట్టు ఉంటుంది. ఎటొచ్చీ వేసంకాలంలో మేకుల్లాగి మొనలు తేరిన బెడ్డల్తో ఉంటుంది, వానాకాలం చిన్న పంటకాలవలా ఉంటుంది. పిల్లలూ పెద్దలూ ఊట లూరగా ఊరగా, అది చదునై, మట్టిపడి, లేస్తుంది. అదే కంకరవీధిఅయి, దాని రేఖ బయలుపడాలీ అంటే, అది ఇంతో

అంశలో పెట్టిపుట్టింది అయివుండాలి, అనగా, ఆవీధులో కాపురంఉండే ప్రతీద్విపదుడూ మామూలు మనిషై ఊరుకోక, చివరకి ఏఒకటైనా బస్తీపాలకసంఘంలో ఒకసభ్యుడై ఉండాలి రోడ్డులేనప్పుడు అతనికి ఉండే బాధ మర్త్యుల్లో ఎవరికీఉండకూడదుట లేకపోతే, అక్కడ కాపురంఉన్నవాళ్లల్లో ఒకడైనా ప్రభుత్వంవారి పరిచయుడైనా కావాలి, లేక ధనవంతుడైనా కావాలి, నిలువుగా చీరేవాడో, అడ్డంగా గాదేవాడో, లేక తెగతిట్టేవాడో, తెగ ఆశ్రయించేవాడో కావాలి. అదికాకపోతే, ఒక గవర్నరు గారు అతనిలాంటి గొప్పమనిషిగాని ఆ వీధివెంట వెడతాడని తెలియాలి! ఆయన ఇక ఏపోయెల్లుండో ఆ దార్ని వెడతాట్టని తెలియడంతోటే, అతని మహిమవల్ల, రాముపాదధూళి తగిలింతరవాత రాయి మనిషైనట్టు ఆయన పాదం చెప్పులో ఉండడంవల్లంచి తత్పదధూళికైనా నోచుకోనైతిని కదాఅని చెప్పి ఆదారి రాయిలా అయిపోతుంది. అది అల్లా అయిపోయేటప్పుడు ఇంతోటి విడ్డూరాన్నికేసి ఇస్త్రీబట్టలు కట్టి కుర్రజనంలాగ వెల్లవేసుకున్న మురుగుతూములు తెల్లతెల్లపోతూ చూస్తూంటాయి. అదే అదను, మళ్లీదారి కను, అవి కొన్నిదార్లు అప్పుడు కంకరకూడా అవుతాయి. పురపాలక సంఘంలో అందరూ కంకర రవాకపోవడంవల్ల, కొన్ని దార్లు ఎప్పటికీ కంకర రవనే అవవు. ఒక్కొక్కప్పుడు కంకర పైగిరా తెచ్చి, నడవడానికికూడా వీలులేకుండా ఎడాపెడా పొయ్యడం సమేతూ జరిగిపోతోంది. అప్పుడొస్తుంది ఎగే

సుగుని! ఆవీధులో ఉన్న స్థలం స్థలాలా పడి ఉండచ్చు, పై వార్ని ఎదో పేచీపెడుతుంటారుగావును. దాంతోటి వాళ్ళకి తలో మోస్తరుగానూ ఆనేలమీద కోపంవచ్చి, ఆకలకొన్న ఉన్న పళంగా వాడి లేస్తారు అయితేం! ఉన్నపళంగా ఏదీ ఉండటం, కంకరా ఉండదు కోతుల్ని కొట్టడానికీ, కాయలూ, పళ్ళూ రాలగొట్టడానికీ, పిల్లలు వాటిని వాడేస్తారు. ఒక్కొక్కప్పుడు అన్నట్టే పిచ్చివాళ్ళు అద్దాలు పగలగొట్టే మునిసిపల్ వారివనే చూస్తారు పెద్దలుకూడా కాస్త చీకటడి, మాటు మణిగింతర్వాత, కాసికాసి చొప్పునే ఆరాళ్ళని సినగపెస్తూరా రగాయించేసి, అవీనూ, డబ్బొక్కొనుక్కున్న యాజమానులయింటికి ఇటికెలు తోలుకెళుతూన్న బండివాడు దయతో దానం చేసినయిటికెలూ పెట్టి సాన్ని కార్యక్రమం సాగిస్తారు అల్లా ఆరాళ్ళన్నీ మాయం అయినా సరే ఒక్కొక్కవీధిలో నేలకి పాలకసంఘం అంటూ భయం లేదు జనం అంటే జాలిలేదు. ఇంకోసంగతి. ఈకాలంలో జనం తిన్నగా తిండేనా లేకరనిన్నీ, వెంకటిచాళ్లూ రాళ్లూ కడా తిని హాయిగా ఉంచుకునే వారనిన్నీ కొందరు ముసిలాళ్ళు కొస్తూంటారు. కాని, ఇప్పటికూడా కంకరరాళ్ళమొక్క విలవతినేసి సొమ్మునిర్మాత లున్నారని వాళ్ళతో నాదించి చెప్పి. ముసిలాళ్ళూ పిన్నలు నెగ్గచ్చు. ఏమైతేం, కొన్ని అవస్థాభేదాలు వందిదెబ్బలు, పోట్లు, చురుకులు, అంబుపులు, నొక్కులు, తిట్లువగైరా తిని తిని, చివరికి బస్తీరోడ్లు అపత

రిస్తుంగు. సాధారణంగా ముందుతవ్వి, మరీ పెద్దగోతులుంటే వాటిల్లో పెద్ద రాయొట్టి, చిన్నసైజు కోసురాయి సర్ది, ఎర్రకంకరో తెల్లకంకరో చిమ్మి, ఇసకపోసి, నీళ్లుచల్లి చేసేపద్ధతి అవలంబిస్తారు. (మహాబస్తీల విషయంలో, వాటి పాదానికట్టి పలకరాతివీ, సిమెంటువీ, తారువీ, కర్రవీ రోడ్లు వెలుస్తాయి వాటి ప్రమేయంకా దిప్పుడు.) రోజు గడవనివాళ్లూ, జీవితం గడవనివాళ్లూ వచ్చి తక్కినప్రపంచం నడిచిపోయే నిమిత్తం చెమటతో రోడ్లు వేస్తారు. కాని, ఎంతెంతోటి శ్రమలుపడి వీటిని సృష్టిచేసినా, వీటిల్లోవీటికి బొత్తిగా జాత్యభిమానంలేదు, సోదరభావం లేదు.

వీట్లయొక్క రకాలకు హద్దులేదు చాలా రకాలు మా ఊళ్ళోనే దొరుకుతాయని ప్రతీఊరి ప్రతీవాడూ విర్రవీగటమే, ఎవడిమాట నిజమో తేలకుండా. కొన్ని కేవలం గజం వన్నా రోడ్లు. తెలుగు లిపిలో తలకట్లు మూలబడడంచేత గజం అంటే ఏనుగు అనుకోగలరు. కాని ఇక్కడి అభిప్రాయం "గజం" అనగా మూడడుగులు నేల — అయినా మళ్ళీ వామనుడు కోరినంత సైజుని కాదు! కొన్నిరోడ్లు మనిషి పన్నా — ఆ మనిషైనా భారీరకం అయితే కిందకి నడిస్తేగాని అతనికి జరుగుబాటుండదు. కొన్నింటికి వక్రభావమేకాని ముక్కుకి సూటిగా పోదామని లేనేలేదు. ఈ సంగతే దొరకపుచ్చుకుని, చుట్టుప్రక్కల దొరకగల వక్రత్వం యావత్తూ తమ ఊరిరోడ్లు గుత్తకి తీసుకున్నాయనిన్నీ, అందులో మరేమీ

వాటా మిగలక పోడాన్నించి తమ ఊరి జనం అశేషం ఋజుమార్గవర్తులయి తీరవలిసొచ్చిందనీన్నీ, ఒకొక్క బస్తీ కవి బడాయి కొడుతూంటాడు. నాగరికిత ఎరగని రోజులుగనక పూర్వం 'సూత్రపట్టినట్లు' ఒక బస్తీవీథులు ఉండేవిట! ఇతర బస్తీలల్లో రోడ్లు దిక్కుమాలిన రోడ్లనీన్నీ తన ఊళ్ళోవి దిక్కున్నవనీన్నీ ఒక నగరప్రియుడు ఒకచోట ఒక పేచీ లేవదీశాడు. ఎంచేత అని అడిగేసరికి, 'దక్షిణముకు మాత్రము బండ్లుపోవాలి పడమరకు మాత్రము జంతువులు కదలాలి' అని దిక్కు తెలుపుతూండే రోడ్లు తన ఊళ్ళోగాని లేవని అనుసంధించి నెగ్గుకు పోయాడు కొందరు మనుష్యులకిమల్లే కాకుండా, కొన్ని రోడ్లు ఉచ్ఛనీచాలు గల ఘటాలు. అందుకని వాట్లమీదికి ఏ బండీ వచ్చినప్పుడు, ఆరోడ్లు అంబోతుల్లాగ కోరమూపులు చూపి ఒడుపు కనిపెట్టి, ఆ బండీని బోల్తాకొట్టిస్తాయి ఒకవేళ ఏనుగుపాటుగా నడుస్తూండే మనుష్యులు గనక వచ్చారా, వాళ్ళ కాళ్ళూ చేతులూ అధమం నడుమూ విరిచేస్తాయి కొన్ని ఋజు నిర్మొహమాటపు రోడ్లు మరీ హెచ్చుతగ్గుగా వ్యవహరించడం వల్ల ఒళ్ళల్లో జనం కొయ్యయిపోతూంటారు. 'అచేతనంబులు చేతనరీతి దనర, చేతనంబులచేతనభాతి నొనర' వీణ వాయింపు ఉన్నదని, ఒకకవి అన్నాడు. నేడుకూడా చాలా పాటకచేరీలూ, కొన్ని రోడ్లమీద ప్రయాణాలూ అంతటివీ ఉన్నాయని మనం గర్వపడవచ్చును. కొన్నిరోడ్లుగల వీథుల్లో

కాపరంచేస్తే, ఎండాకాల వానకాలాల తేడాలు తెలియకుండా పోతాయనిన్నీ, రోడ్లే కాలవలుగా మారడంచేత, 'ఓడలు బండ్లవచ్చు బండ్లోడలవచ్చు' అనే మాటల్లో ఉండే సంశయత్వం పోతుందనిన్నీ కొందరన్నారు. కొన్నిరోడ్లమీద, మధ్యగా, మురుగు పోయేనిమిత్తం, ఒక్కగాడి ఉంటుంది. రోడ్డు దేవుగారి పాపిడిలాగుగదా అన్నట్టుగా మందు వేసవిలోకూడా రోడ్డు మధ్యగా ప్రవహించే శక్తిగల మురుగుకాలవన్ని ధరించిన రోడ్లున్నాయి. వీటిని చూచినప్పుడు, పర్వతాల్లో పుట్టి మంచుకరగడంవల్ల వేసవిలో ఎక్కువ నీటితో ప్రవహించే నదులు జ్ఞాపకంవస్తాయి ఎటో ట్టి, నీటిలో నీరు ఘనీభవించిన కొళ్ళల్లో సముద్రాలుగా మారిపోకుండా ఉండి 'తృష్ణ' స్మరణ చేయిస్తుంది ఒకొక్క స్త్రీలో ఉన్నకాల్లు ఈ లుపురంగులోనే కాకుండా అసలైన కంపులోకూడా అద్వైతీయమైన ఒప్పేటటువంటి కొన్నికొన్ని పైరుకాలవలకి విహారాది విషయాల్లో సక్రమమైన ట్రైనింగు ఇచ్చి, వాటిల్లోఉండే నీటిమహాత్మ్యం అనుభవించకపోడంచేత పౌరులు చెడిపోతారేమో అనే బెంగ చొప్పున, అవి మరోచోటికీ మరోచోటికీ తమ యిష్టంవచ్చినట్లు లేచిపోకుండా, తమ ఆజ్ఞానుసారం, చేరుతనున్న మంచినీటికాలవల్లో కలిసేలాగచేసి, జనం శ్రమించి అట్టే దూరాభారం వెళ్ళక్కర్లేకుండానే ఆ 'గంగాయమునా సంగమపుణ్యదర్శనఫలం' జనానికి పన్నులేకుండానే మంజూరు చేసి, ఆజనం అల్లాంటి పుణ్యాన్నిపొంది జీవన్ముక్తులవడానికి

నానాతిప్పలూ పడుతూంటారు. కొన్నిరోడ్లు తమాషాగా కనిపించి, కొత్తవాణ్ణి బెదిరిస్తాయి. దాంతోటి ఆకొత్తవాడు అనుమానిస్తూ నడుస్తాడు. అవి వాణ్ణి తిప్పి తిప్పి చివరకి ఎవరియింట్లోకేనా లాక్కుపోతాయో, లేక పీథులో పడేస్తాయో వాడికి తెలియదు.

బస్తీరోడ్లయొక్క ప్రత్యేక విశేషం అయిన దుమ్ము గురించినది పెద్దఘట్టం. దుమ్ము నిరంతరంగా బస్తీలో విజృంభిస్తూ ఉంటుంది. బస్తీపాలకులు దాంతో యుద్ధంచేస్తూంటారు. వారు ఇతరవిషయం ఏదేనాసరే దుమ్మురేగకొట్టగలుగాని విషయమే దుమ్ము. అదే రేగిపోయే దయినప్పుడు, ఏమీ చెయ్యలేక పోతూంటారు. అసలు దుమ్ము లేకుండా చేస్తే సరి, ఇహా నెల్లా రేగుతుంది దాని మొహం! అని, కొందరు సలహా ఇస్తారు. అందుకని, కొన్నిచోట్ల బస్తీరోడ్లు ఇళ్లూ వాకిళ్లూ తుడిచినట్లుగానే చీపుళ్ళతో గంటలో తుడిచేస్తారు. దానిఫలితం ఏమిటి అంటే ఇరవైనాలుగు గంటల్లో చుట్టుప్రక్కల గృహవృక్షాదులమీద మలామా చెయించినట్లు సర్దుకునేదుమ్ము ఒకగంటలోనే గబగబా సర్దుకుంటుంది. ఈ పద్ధతిలో పథికులకింకంటె సమీప గృహస్థులకే ఎక్కువవాటా దుమ్ము కిట్టుతుంది. కొన్నిచోట్ల రోడ్లు కూలిలచేతా, కొన్నిచోట్ల కార్లచేతా, తడిపిస్తారు. మొదటి పద్ధతి చాలమంది బీదవాళ్ళకి పని చెబుతుంది గనక, అంతమందికి జలక్రీడోద్యోగం ఇవ్వడం ఏమిటని చాలా బస్తీల్లో అది మానేశారు. ఒక్క

యంత్రప్రధానంవల్ల వెయ్యిమంది పనివాళ్ళు మూలపడతారు. అంచేత గావును బస్తీలో నీళ్ళకారు! దానికి చెయ్యబడిఉండే ఏర్పాటు మూలాన్ని జొతుఖానాలోంచిలాగ నీరు ఇటూ అటూ చటుక్కున చిమ్మచ్చు, చటుక్కున ఆపచ్చు. ఆ అధికారం సాధారణంగా డ్రైవరు చేతిలో ఉంటుంది. కాని, ఆయంత్రం అతణ్ణికూడా దగాచేసి, తనఖులాసా చొప్పున పోతూండడం కూడా కద్దు. డ్రైవరు ఉద్యోగానిక కారకుత్రైనవా ?ఎవరైనా పక్కనించి పోతూంటే, అది చటుక్కున ఆగిపోతుంది కాని, ఇతరబస్తీజనుడుగాని, ఇతర గ్రామస్థుడుగాని, స్త్రీలుగాని అయితే, పెద్ద-పిన్న ముసలి-పడుచు తారతమ్యం గమనించకుండా నీరు చిమ్మేస్తుంది అందుకని, ఏకొద్దిమందోతప్ప తక్కినవారు నీటికారు ఎప్పుడు తననీటిజుళ్లు విప్పుతుందో - ఏదుబందిలాగ - అని భయం చొప్పున దూరాన్నించే జాగ్రత్త పడతారు రోడ్డు తడపడం దుమ్ముని అణచడానికి. అప్పట్లో ఆపని నెరవేరినట్లు కనిపిస్తుంది కాని, తడిసిన దుమ్ముమీంచ శకటాదులు వెళ్లడం వల్ల తొక్కిడిగి వస్త్రక్షాళితం చేసినట్లు మరీ కాటిగలా అయి, ఎండకొచ్చి ఎడి యిగిరింతరవాత, పూర్వం తాడిప్రమాణాన్ని లేచే, ఆ సాయంత్రానికి తారాజువ్వలా లేచి, తలపెట్టిన ఉద్దేశానికి విరుద్ధం ఫలించేటట్టు చేస్తుంది ఇదిగాక, అలవాటుగా నీళ్ళు పోసేసరికి, రోడ్డుమీంది మెరకపల్లాలు ఖాయపడి, సంవత్సరంలో బయల్దేరే కతకలు నెలలోనే సిద్ధిస్తాయి.

'అయినాసరే, ఒప్పుకోడానికి, ఈ భాగ్యం అన్నింటికీ అబ్బదు.

కొన్ని బస్తీలలో వానకాలం గంభీరంగా ఉంటుంది. ఇళ్ళు ద్వీపాలు రోడ్లు కాలవలు మనుష్యులు పడవలు! కొన్నిరోడ్లమీది మొత్తటిసరుకు కొట్టుకుపోయి, శిలాస్త్రాల లాంటి కోసురాళ్ళుమాత్రము ఆరితేరి పొడిచేలాగ చూస్తూ ఉంటాయి మైసూరుకాలువలు, పరాయిగా పరాయిగా కొట్టుకొచ్చిన మట్టితో పూడి కలిసి, రోడ్డుతో సమంగా అవుతాయి అలాంటప్పుడు ఎక్కడ దిగినా వానికి బాధ్యము. కొంతదూరాన మోటారుమార్గాన పద్యం ఇవ్వగానే, ఎక్కడివాళ్ళక్కడ నిల్చుంటారా, మనుష్యుడికి దూరంగా ఉండమన్నాడు' అనుకుంటూ ఎవరిజాగ్రత్త మీద వాళ్ళుంటారు మోటార్లు వేగాన్ని తగ్గిస్తాను, గొడుగులు అడ్డంగా ఒగ్గేవారు, అరుగులమీది కెక్కి ఖరాఖా యించేవారు, కట్టుకొచ్చిన చాకలిట్రౌజర్సు ఎవంతం కొట్టుకొగా, 'సత్యనారాయణ! కళ్ళుకనిపించవ్!' అని తిట్టుకుంటూ డ్రెస్సుకేసి చూసి గుర్తించేవారు, — ఇలా రకరకాలుగా ఉంటాయి జారడం, గుస్తులకీ కాళ్ళకీ డామేజీ తెచ్చుకోడం డా మామూలుదృశ్యాలే కొంచెం తేగడిమట్టిపాలు ఎక్కువగాఉన్న రోడ్డుమీద నడిచేటప్పుడు జుర్రుబాములు వెళ్ళసంపల్లించి ఈజెల్లాగ లేచి కంట్లో పడుతూండడం కూడా కద్దు. మామూలు చెప్పులవాళ్ళకేగాని, ఆరు చెప్పులవాళ్ళకి సీలమండలగాయతు సద్దిదాకా

వెనక వేపున రోడ్డుబురద చిలకరింపు సంక్రమిస్తుంది. కేవలం స్లిప్పర్స్ తొడుక్కొని రప్పు రప్పున నడిచేవాళ్ళకి, బాడీ చింపులు బాగా చిమ్మబడి రవ్వల్లాగ లేచి నెత్తిదాకా వ్యాపించి యజమానికిచ్చే శక్తినే అందరికీ కనిపిస్తూంటాయి. కాని రోడ్డుమీద మొత్తేసరికి, కాటుకలాంటి అడుసులా తయారై, జనంకాళ్ళకి పట్టుకోడంలో, స్త్రీలో ఉండే స్త్రీ పురుషాంగాలు స్త్రీపారాణి రాయించుకొని (పిలవని!) పేరంటానికి నడుస్తూన్నట్టు తెలుస్తుంది. ఒక్కొక్కచోట, ఇళ్ళల్లోంచి ఇవతలకి, ఇవతలనుంచి ఇంట్లోకీ వెళ్ళిపడడం అనేది క్రతువులాంటిపని అయిపోతూండడంచేత, అక్కడి యజమానులు తప్పనిసరి అయినప్పుడు తప్ప కొంపలోనే పడుండి, యథాశక్తి దేశాభిమానం అని చెప్పదగిన గృహాభిమానం నేర్పుకుంటూంటారు.

బస్తీరోడ్ల వల్ల ప్రయోజనాలు ఒకటి మాటు చూసి పట్టయ్యే వచ్చు. రాత్రిభాగంలో కొందరు వయస్సొచ్చిన స్త్రీ పురుషులు తమయింటి ఎదరకాని రోడ్డుని బాహ్యానికి ఉపయోగించి ఆపని నెరవేర్చి రావడంలో తమరు ప్రకటించగలిగిన ధైర్య సాహసాలకీ తెలివితేటలకీ అభినందించుకునే వాళ్ళూ, తమ యింట్లో ఉండేజనంచేత మన్ననలూ స్తోత్రాలూ పొందే వాళ్ళూ ఉన్నారు. కొందరికి ఇంటి ఎదటిరోడ్డే తమకున్న ఖాళీస్థలం అవడంచేత స్నానాలూ తలంట్లూ రోడ్డుమీదే. భోజనాలకి, కజ్జాలకి, పురుళ్ళకి, పూణ్యాలకి, ఓకొమిటి సమస్తానికీ

కొందరిపట్ల రోడ్డే ఆధారం. ఎండపెట్టుకోడాలన్నీ రోడ్డుమీదే. కొందరు పశువుల్ని పెంచడం, కట్టెయ్యడం — అంతా రోడ్డుమీదే. కొందరు తనయింటి ఎదటిరోడ్డుమీద తమహక్కు స్థాపించుకోడానికే తమసొంతరోడ్డుమీద కళ్లాపు చల్లి ముగ్గెయ్యడం ఇతరులెవరూ దొంగతనంగానేనా పట్టుకెళ్ళరుగదా అనేధైర్యం కలిగించే వస్తువులన్నీ కొందరు రోడ్డుమీదే దాచుకోడం కొన్నిరోడ్లమీద రాత్రిళ్ళు ఎడాపెడా పడే వేసంకాలపు మంచాలమధ్య కుక్కలుండీ, దారెంట వెళ్లవలసినవాళ్లు కాలెట్టడానికి అవకాశం ఉండదు. చాలా బస్తీరోడ్లమీద ఇటీవల బయల్దేరిన సోడాకొట్లవల్ల దారి మూసుకుపోతోంది — నాసిక తగాయిలాగ. ఈ కొట్లు దేవదారువీ, కర్రవీ, క్రమేపీ ఇనపవీకూడా అవుతున్నాయి. రోడ్డు ఎంత యిరుకుదైనాసరే, రథంలాంటి సోడాకొట్టు, పాలకసంఘానికి ఫీజు కట్టేసి, అక్కడే సెనూ ఇరుకుతుంది. ఒకటి పుట్టేసరికి దినా దినాభివృద్ధిగా పిల్లల్ని పెడుతుంది. వీటిల్లో వంటకీ, భోజనానికీ, పడకకీ, విశ్రాంతికీ — అంతస్తులూ, బిలాలూ రహస్యమార్గాలూ అన్నీ దుర్గానికి ఉన్నట్టు ఉంటాయి. వీటికి కిందచక్రాలు పెట్టేస్తున్నారు కొందరు, కొండలకిరెక్కలు పురమాయించినట్టు. ఈదెబ్బతో బస్తీకి రథాలులేని అపకీర్తిపోయేట్టు కనిపిస్తుంది.

అయితే, రోడ్డుగురించి ప్రథమసూత్రం ఏమిటంటే, గమనం గలిగిన జంతువులే కాకుండా చలనంగలిగిన పదార్థాలుకూడా

గోష్ఠని వాడుకోడానికి హక్కుగలవే, అని. కాని, ఎవరైనా సరే, వీలైనంత త్వరలో వాడుకొని ఇతరుల వాడకానికి దానిని వదిలేస్తూండాలి. అందుకనే, ఎంత తక్కువ కాలంలో దానిని వాడుకొని వదిలెయ్యగలవాడైతే, అంత వెంకరాత్రే అదివాడుకోడానికి వాడికి మొదటిహక్కు ఏర్పడుతుంది. ఆ మొదటిహక్కులో ఉండేనయినం గమనించి పేచీలు రాకుండా గమనాలు నడిపించడం నిమిత్తమే కూడలి వీధుల దగ్గిరా, మలుపులదగ్గిరా, పోలీసుసోదరులు ఖణాయించి చేతులు — (అవి మీసాలుసర్దుకోడంలాంటి ఇతరపన్లో లేనప్పుడు) — తిప్పుతూండడం. ఈహక్కు పుణ్యమాఅనే, ప్రపంచపు గొప్ప నగరాలలో ప్రమాదాలు జరిగి రోజుకి సగటున నలుగురు మొదలు [illegible] మనుష్యులు ఖచ్చుపడుతూ ఉండడం. పోనీ, హక్కుమాట సరేగాని మరి బాధ్యత ఎవరిదీ? అంటే, ఆమాట అంటునే చాలమందికి కోపం! పైగా అది వేరే సంగతి!!

అయోమార్గం - అభినందనం

రైలుయొక్క మార్గం అయోమార్గం అయినా, దాని యొక్క వ్యాపారంలో కొంత స్తబ్ధత్వం, కొంత హడావిడిగుణం, కొంత కర్రపెడితనం ఉన్నా, అది అస్పృష్టపదార్థోపేతం అయిన గానాభినయంలాగ, శుద్ధఅయోమయం కాదు. దాని సంగతి ఏకొంతో అందరికీ తెలుసు ఆవిరి, విద్యుత్తు, అయస్కాంతం వగైరాల శక్తులవల్ల దానికి గమనం సిద్ధిస్తుందనీ, దాన్లో భూమిని పట్టుకుపాకేరకం - భూగర్భం చొచ్చుకుపోయేట్టు నిర్మించబడ్డ గొట్టాలలో చరించేరకం - భూమికి కొంత ఎత్తున స్తంభాలమీద వెళ్ళేరకం - ఒకేపట్టామీద పోగలరకం - పట్టాలున్నా వాటిని తాకకుండా నడవగలరకం - వగైరా ఉన్నాయనీ, దానిశాఖలు కొన్ని ప్రభుత్వాల క్రిందా, కొన్ని రాష్ట్రాల అధీనంలోనూ - కొన్ని పెద్దసంస్థలైన కంపెనీల చేతుల్లోనూ - ఉన్నాయనీ, ఎరుగున్నవిషయాలే! గమనానికి పట్టాలుండడం ప్రతిబంధకం అని కొందరు భావిస్తారు. స్థిరమార్గం నిర్ణీతం అయిఉండడం అనేది వేగాంతరసిద్ధికి దోహదకరం అని కొందరు నమ్ముతారు. మొట్టమొదట్లో రైలుపట్టాలు భూమండలంమీద పడి ఇప్పటికి నూరేళ్ళు నిండ పుష్కరం దాటింది. ఆ భాగ్యం పొందిన పుణ్యస్థలం సీమదేశమే. ఆ స్థలంలో రైల్వేశతాబ్దోత్సవం జయప్రదంగా జరపాలని (వార్తాపత్రికారచనలో జయప్రదంకాని సంభవమే ఉండదు!) ప్రయ

త్నాలు చేశారని చెప్తుంటారు. ఇండియాలో రైల్వేసహా ప్రమాణోత్సవం పెట్టించాలని చాలాముందే తంటాలు పడ్డట్టు తెలుస్తోంది. దరీఅంచూ తెలియని మహాకాలంలో సంస్థల గొప్ప పర్వోత్సవాలు జరపడంలో తిథివారనక్షత్రాలతో సహా అసలుదినం గమనించక్కర్లేదనే విశాల భావంతో కొందరు, వీలునిబట్టి వాటిని పెట్టించడాలు ఎరుగుదుం. మంచి ముహూర్త సందర్భం సంఘటించినప్పుడు దాన్ని దాట పెట్టుకోడంలో ఉండే బాధనిబట్టీ, గొప్పవ్యక్తి తనంతట తనే వచ్చి సన్మానం ఖర్చులేకుండా అతణ్ణి అధ్యక్షుణ్ణి చేసుకోడంలో ఉండే సదవకాశాన్ని బట్టీ, ఒక్కొక్క వ్యక్తి తను కార్యకర్తగా ఉండగా వీలైనంత గొప్పతనంగల సమావేశం జరగాలిగాని కిడం స్వహాయాంలో కాకూడదనే పట్టుదలలనిబట్టీ, సంస్థల ఉత్సవదినాలు ముందుకీ వెనక్కీ జరుగుతూంటాయి. రైల్వే విషయంలో మరీ వీళ్ళున్నాయి. పైచెప్పిన రెండు ఉత్సవాలలోనూ ఏ ఒకటీకూడా లోగడ జరిగి ఉండకపోయినప్పటికీ — వాటిల్లో ఏదో ఒకటి, ఏదో దేశంలో ఇకముందు ఎప్పుడో అప్పుడు ఎవరో కొందరు జరిగించినా బాధ లేదంటున్నారు. ఎందుకంటే, ముందు ఒకగొప్ప ఉత్సవం రాసిచ్చేసి తదుపరి వెనక్కి తిరిగి లెక్కచూసినా, ఆదినం రైల్వే సంస్థకి చెందిన ఒక గొప్పవిషయం ఒక గొప్పదేశంలో జరిగిన పర్వదినం అయి ఉండి తీరుతుంది. ఇది గాక, అయోమార్గం యావద్భూతలానికీ చెందినదే గనక, భూప్రజలంతా కలసి దానితాలూకు

పర్వోత్సవం చెయ్యడం సమంజసం గాని, ప్రత్యేకస్వాయం పాకాలవల్ల డబ్బు ఖర్చవడం గౌరవం పోవడం మట్టుకే అని ఆర్యులు చెబుతున్నారు. ఈ ఉత్సవంయొక్క సంపూర్ణ బాధ్యత వహించడానికి ఒక ప్రత్యేక సంఘం ఏర్పర్చాలని ఇదవుతున్నారు. అది అఖిల భూగోళ ఖండఖండాంతర స్థాపిత వివిధార్యో మార్గ సంబంధజన, శక్తి సంఘ, సంస్థాపకాభాచరిత మహాకృత్యాంగి సంపన్నీ సమాజం ఆ సేనాపతేమీకుంటే సర్వసంగ నిర్వహించాలని పలువురు ఊహిస్తున్నారు. ఏతత్ప్రయత్నంలో, ప్రత్యేక ప్రాంతాలలో తాత్కాలిక సంఘాలు లేచి, యథాశక్తి కార్యదక్షతని ఎన్నుకుని, వారికి సాధ్యతాపూర్వమైన సకల హక్కులూగా ఇచ్చి, కృషిచేయించడం శ్లాఘనీయం అని కూడా నాగాబంది తాత్పర్యం

ఆమహాభూతల వైశ్య పర్వోత్సవం నాటి కార్యక్రమంయొక్క తబిశీళ్ళు ఆహ్వాన సంఘంవారు తెల్పాలి. అప్పుడు జరగబోయే బహిరంగసభకి అధ్యక్షత వహించడానికి భూసుర దేవుడూ పరికిరాడనీన్నీ, అఖిల అంగారకగ్రహ వైశ్యసంఘాధ్యక్షుణ్ణి పిలుస్తారనీన్నీ, అతని ప్రయాణపుఖర్చు నిస్తంత్రీలో పంపుతారనీన్నీ, అతగాడికి ఏమాత్రం కుదరక శక్తివశాత్ రావడానికి వీలు లభించని పక్షంలో అతను రేడియోలో అధ్యక్షత వహిస్తాడనీన్నీ, ఒక ప్రాంతపు కార్యకర్త అంటున్నాడు వైనాద్యా అంగారకుడులో కూడా (అసలు అది యుద్ధగ్రహంగనక!) రోమురాడీశ్వరుడులాంటి

వాడుగాని, బ్లెన్లిస్ జులుందారువంటివాడుగాని నియంత ఒకడు వున్నట్టాయినా, అతణ్ణే అధ్యక్షపదవికి ఆహ్వానిస్తే తీరిపోతుందని సలహా యిస్తున్నారు కాని అలాంటివాణ్ణి యీభూమిమీద అడుగుపెట్టనిస్తే, అతడు తన్నో, తిట్టో, బెదిరించో లాగేసి యీ భూమి మావత్తూ చివర తనదే అనడంగాని లేక తనవాళ్ళంకి యిక్కడ ఉద్యోగాలకి సిఫార్సు చెయ్యడంగాని మొదలు పెడతాడేమో, అని కొందరు బాధపడుతున్నారు అంగారక గ్రహంలోంచి కాకుండా మరో గ్రహం దేన్లోంచేనా అధ్యక్షుణ్ణి ఎలిస్తే ౧౯౬౧ లో "గగారిన్" అనే ఆమోఘ వాగ్దత్తం చెయ్యాడి నేటి వరకూ ఎవరిచేతా పొందబడకుండా నిల్చిపోయి ఉన్న వెయ్యి పౌనుల బహుమతీకూడా, దఖలుపడుతుంది కదా అని కొందరు అంటున్నారు ఏమయినా మహాసభాధ్యక్షుడు - ఆహ్వాన సంఘాధ్యక్షుడు - అన్నట్టు, జాగేస్థాం వివరాలు ముందుముందు స్థిరపడవలసిఉన్నా, ప్రస్తుతం తెలుగుదేశపు వివిధ కార్యకర్తలకి కాబోయే సభనిమిత్తం జనంచేత యథావిధిగా పంపబడ్డ చిత్తు అభినందనతీర్మానాలు కొన్ని తెలిసిరావడంవల్ల, అవి ఏరీతిగా ఉండగలవో చూడడానికి వీలు దొరికింది. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి:

నరాలవల్ల శరీరంలో వ్యాపించిఉన్నట్టు, ఇప్పటికే ప్రతీ దేశంలోనూ రైలుపట్టాలు వ్యాపించి ఉన్నా, ఇప్పటికీ "మొయిలు వెళ్ళి పోయింది గావును, నేను చూడా లనుకున్న

ప్లాటుఫారంగార్ని చూణ్ణేలేదు!", "నల్లటి మొఖ్ఖకి గంటలు కట్టి రైళ్ళు లాగిస్తారు" "ఒక్కొక్క బూత్సుబండికి రొండేసి తలకాయ లుంటాయి!" "మావూరికి పిక్కంటిమ్మంటే ఎక్కడికో సెప్పమంటాడేటి? నావూరు సీడికెంటుకన్నాను!", "ఏడూరికి టిక్కట్టిమ్మన్నా, ఒకేదగ్గిర దాన్ని నొక్కి టిక్కుమనిపిస్తాడే!" అని అంటూండే జనంగురించి ఈ సభవారు చాలా దుఃఖిస్తూ వీళ్లు ఒకప్రత్యేక తీర్మానగౌరవం పొందడానికి అనర్హులని నిర్ధరించి, జాలిపడుతున్నారు. —

ఏకో దేశానికి చెంది, కోటీశ్వరులై, ప్రభుత్వబలం యొక్క ఆసరా చూసుకుని స్వాధీన దేశాల్లో ఉండే గృహారామక్షేత్రాదులు బలత్కారంగా కొని, వాటిని శూన్యస్థలాలుగా చేసి, ఇనపకట్టాల సంకెళ్ళతో ఆస్థలాన్ని కట్టేసి తద్వారా రసయోగం తెలియకుండానే తమ ఇనుముని బంగారంగా మార్చుకో గలిగిన రైల్వేసంఘాల్ని ఈసభవారు కొనియాడుతున్నారు. —

ఒక్కొక్క వ్యక్తిచేతుల్లో రూపాయిపడిందంటే బొగ్గుగా మారిపోడం మామూలు గనక, జనబాహుళ్యం విడివ్యక్తులలో నమ్మకం ఉంచరని గ్రహించి, సంఘాన్ని నమ్మించడానికి సంఘమే ఉండాలని తెలుసుకుని సంఘాలుగా ఏర్పడి, బొగ్గుని రూపాయిలుగా మార్చుకో గలిగిన రైల్వేబుద్ధిమంతుల్ని ఈ సభవారు మెచ్చుకుంటున్నారు. —

పెట్టుబడులకీ ధరలకీ సంబంధం ఏమిటో జనానికి తెలియ

రాకుండా అట్టేపెట్టి, రుచి కలిగేవరకూ ధరలు తక్కువగా ఉంచి, అలవాటు స్థిరపడడంతోటే ధరలు క్రమక్రమంగా పెంచేస్తూ, పోటీకోసం సబబులేని తగ్గింపులు చేస్తూ, లాభాలు పుచ్చుకునే వాళ్లు ఎక్కడుంటారో కనబడకుండా వ్యాపారం చేయిస్తూ ఉన్న రైల్వేప్రజ్ఞావంతుల్ని ఈసభవారు పొగుడుతున్నారు. —

అయోమార్గాలు మామూలుగా జనోపయోగ నిమిత్తం అని పైకికనపడ్డా యుద్ధంలాంటి అవసరం వచ్చినపుడు స్వలాభం కోసమే అని ఎరిగుండి వ్యవహరించే రైల్వేపెద్దలికి ఈసభ వారు నమస్కరిస్తున్నారు. —

వర్ణాశ్రమ ధర్మాలవంటి తారతమ్యాలు మనుష్యుల్లో పోకునా, రక్తాల్లో భేదాలుంటాయి గనకనా, అంతా ఒకటే అనేటంత సర్వసమత్వం తెలిసిన జాతికి చెందినప్పటికీ, అయోమార్గంలో మొదటక్లాసు, రెండోక్లాసు, మూడోక్లాసు అంటూ తరతమభావం పెట్టిన రైల్వేసంఘాలవారి వివేచనా శక్తికి ఈసభవారు ముక్కుమీద వేలేసుకుంటున్నారు. —

పెద్దబస్తీలలో, ముందు ఊరవతల ఒకస్టేషనూ తరవాత నాలిక కరుచుకుని ఊళ్లో ఒకస్టేషనూ వేసి, ఊళ్లోదానివల్ల వచ్చే డబ్బు పట్టగెల్లి ఊరవతలదాన్ని పెంచి, ఊళ్లోదాన్ని వీలైనంత ఇరుకుగానూ ఏహ్యాంగానూ ఉంచినందుకు, ఈసభ వారు రైల్వేఅధికారుల్ని ఏమనాలో తెలియకుండా ఉన్నారు. -

నాలుగేసి వందలమంది ఒక్కొక్కరైలుకి ఎక్కే స్టేషన్లలో

జనం విశ్రాంతి తీసుకోడానికి నాయుగ్గైను బెంచీలు సప్లయిచేసి యథాశక్తి ఏర్పాట్లు చేసిన రైల్వే అధికారుల్ని ఈసభవారు శ్లాఘిస్తున్నారు. —

ప్రతీ ప్రయాణీకులబండీ బయలుదేరడానికి రెండుగంటల పూర్వమే టిక్కెట్లకిటికీ తెరిచి ఉంచుతున్నాం అనే రాతతో కిటికీకంతు పెద్దబల్ల కట్టి అక్కడ పేర్కొనబడ్డ గంట ఒకటికి నిమిషాలు రెండుమాత్రమే అనే పదా రాయడం మరిచి పోయిన రైల్వే అధికారుల్ని ఈసభవారు వహావ్వా అంటున్నారు —

రైల్వే ఉద్యోగాలకి జీతాలు తక్కువ అయినప్పటికీ కొన్ని వందల చేతిసొమ్ము అయినాసరే రవంత ఉద్యోగం రైల్వేలో దొరికితే చాలు అనేటంత ఆదాయం ప్రతీ రైల్వే ఉద్యోగస్థుడికీ ఉంటుంది అనేభావం - భ్రమ ! — జనంలో కలిగించిన రైల్వే యజమాన్లకి ఈసభవారు హారతి యిస్తున్నారు. —

క్రింది రైల్వే అల్పోద్యోగిలగాయితు పైమెట్టు ఉద్యోగి వరకూ అధికార్లిచ్చేజీతం తాఖీదుప్రకారం పుచ్చుకుంటూ, అందుకు అదనంగా, జనం — తమపన్లు అర్జెంటుగా లాభకరంగా నెరవేరినందుకు — సంతోషించి యిచ్చే ధన కనక వస్తువాహనాలు తప్ప, తక్కిన మరి ఏయితరమైన లంచాలూ కానుకలూ స్వీకరించకుండా కట్టుదిట్టాలు చేసిన రైల్వే కారకుల్ని, ఈసభవారు ఘనత పరుస్తున్నారు. —

రైల్వే పాలకులు తమపరిపాలనలో, ధనాధికార పైత్యవిశే

పాలు గాని, వాగ్ధాటిగాని, కూరగాయలు - వస్తువులు – ముడిసరుకులు వగైరాల్లో వర్తకంగాని, గలవాళ్లని, – ఎందుకేనా ఎప్పటికేనా మంచిదని చెప్పి – శాస్త్ర చట్లని చూపు చూపి, తక్కినవాళ్ళమీద కూలు ప్రకారం కాగాలూ మియాలూ నూరడంలో కనపరిచే నిష్పక్షపాతబుద్ధికి ఈసభవారు ఆశ్చర్యపడకుండా కూచున్నారు –

తమ రైలుబైసుకి ఒకజాము ముందువెళ్ళి, దాన్ని గురించి తెపెస్తూ, ఇంకా అది ఎంతసేపటికి వస్తుందని – తమకు ఫలానా అప్పుడూ అని తెలిసుండీకుడా – కనుక్కుంటూ, కనుక్కోడంలో చివాట్లు తింటూ ప్రయాణాలు చేసేవాళ్ళకీ, రిష్టువాచీ చూసుగుంటూ అంచీలమీద ప్లేస్లోపడి కటాకటీగా రైలుదాటి పెట్టుగునే వాళ్ళకీ, ఈసభవారు దణ్ణాలు పెట్టి, చెరిసహం చొప్పున పై రెండు తరహాలవాళ్ళూ ఆదణ్ణాలు పంచుకోవలసిందిగా కోరుతున్నారు. –

కుష్ఠులు, బధిరులు, పంగులు, అంధులు, భిక్షులు, – లాంటివాళ్ల అవస్థ దుర్భరంగనక, వాళ్ళు రైల్లో ముష్టెత్తుగోడానికి వాళ్ళని ఊరికే రైలెక్కనిచ్చి, తద్వారా యథాశక్తిదానం చేసుగుంటూ పుణ్యం ఆర్జించుకోడానికి ప్రయాణీకులకి తరుణంయిచ్చి, మరొకళ్ళఖర్చుమీద రైల్వే మేష్టర్లు కనపరుస్తూండే దాక్షిణ్యానికి ఈసభవారు వారిని చాలా కీర్తిస్తున్నారు. –

టిక్కెట్లుకొనుక్కునేటప్పుడు: ఒకపక్కనించి వెడితే ఆలస్యం

అవుతుందేమో, తనకి టిక్కెట్టు అందక తనకు మిగిలి పోవలిసివస్తుందేమో, పెద్ద రాత్రే కొనుక్కున్నవాడు ముందెళ్లి పోతాడేమో అనేబాధ చొప్పున అదివరకే అక్కడ నిలబడి ఉన్నవాళ్ళని తోసుకుంటూ, వాళ్లమీద తనచుట్ట ఉమ్మి అభిషేకించి తన 'టముకు' పెట్టె మొనతో వాళ్ళనిగుచ్చి, టిక్కెట్లు కిటికీమీదికి ఎగబడే ప్రయాణీకులు బతుకు తెరువు తెలిసినవాళ్లు గనక, వారి అంగబలం ఔన్నత్యానికి ఈసభవారు, వారిని నెత్తిమీద పెట్టుకోవాలని చూస్తున్నారు. –

తనయిష్టం వచ్చినచోట తనకు నిలబడి తన ఎదురుగుండా ఏపెట్టె కనబడితే ఆపెట్టెలోకే ఎక్కి, అందులో ఎంతమంది ఉన్నాసరే వాళ్ళని 'తప్పదు గనక సర్దుకోవాలి' అంటూ, 'ఎంతసేపు - కొంచెం' అంటూ వాళ్ళకి వేదాంతంబోధించుతూ బాధించుతూ ఉండే జ్ఞానులకి ఈసభవారు వందనాలు అర్పిస్తున్నారు. –

"టిక్కట్టు" అంటే రైల్వేకంపెనీవారు అది కొనుక్కున్నవాడి శరీరాన్ని - దైవకృప ఉంటే - దానిమీద రాసిఉన్న ఊరికి తీసికెళ్ళి వదిలిపెడతాం అని టిక్కట్టు కొనుక్కున్నవాడితో పడ్డ పూచీమాటలుగల అట్టముక్క అనేసంగతి గమనించక, టిక్కట్టు అంటే తాము తమపక్క కూచున్న వాడిమీద చలాయించడానిక ఏదైన అధికారానికి చిహ్నమని భ్రమించి వింతరకపు జంతువులుగా తయారయ్యే ఘనుల్ని చూసి ఈసభవారు హడిలిపోతున్నారు. –

ఖాళీగా ఉన్న పెట్టె వెతికి తనూ తన సామానూ అందులో పడేసుకుని తోటీ ఫెడీమని తలుపువేసి, ఆ కాల ఎక్కబోయే వాళ్ళ వేళ్లు పచ్చడైనాసరే చూడక, 'ఖాళీ లేదు పక్క పెట్టెకి వెళ్ళండి' అనే మాదిరి అమూల్యమైన సలహాలు ఇచ్చే మహానుభావుల్ని తగినంత మెచ్చలేక ఈ సభవారు దాకెత్తిపోతున్నారు. —

డబ్బోసి టిక్కెట్టు కొనుక్కున్న జనం, ఒక్కొక్క పెట్టెలో, నియమితసంఖ్య దాటింది, — ఎవర్ని ఏమి నడ గాలో నోరులేక అడగగలిగినా పని కొందరవల్ల తీరికలేక — పశువుల్లా పేకాలాగ నిలబడి ఉన్నా, అందులోకే, లోగడ ఆర్జించిన సొమ్ము వడ్డీకేసుకుని కష్టో గుడ్డికో మూ కలిగిఉండడం వల్ల రాంకీసుమో వేదాంతమో పాడుకుంటూ, పెట్టె ల్లోకి జొరబడి, నలుగురి ఎదుటా దమ్మిడీయో రోలియో దానంచేసి కొంతవరకు దానకర్త అని పేరు పొందాలనుకునే ఉబలాటల్ని హృదయం కరిగించే మాటలు చెబుతూ, ఈ లోపుగా తమరి శరీరానికిగల వ్యాధీ, కుష్ఠూ, ధూళీ, మురికీ ఈ మూలనుంచి ఆ మూలకి కూచునే జనానికి రుద్ది, వ్యవహ రించే బుష్టివాళ్లనన్ని, కంపెనీల వెల్లడిచిమ్మత్తం చౌకగా సాంపిల్ ముందులు అమ్మడానికి ఉపన్యసించే ఏజెంట్లనన్ని, ఏమూలను వో వచ్చి మేజిక్‌లు చేసేవాళ్ళనన్ని, మంచిగొంతుకతో పాడి నాటకంవారి పాటలపుస్తకం అమ్మవాళ్ళనన్ని, వస్తువులు అమ్మేవాళ్ళనన్ని, మాపాయిఖరీదు చెప్పి చివరికి అయిదుకాన్లకి

చేరంచెయ్యడానికి పైనైన పుస్తకాలు వంటిమీద ధరించి, వార్తాకారాలూ, సాహిత్య ప్రయోగాలూ గురించి ముచ్చటించే వారిన్నీ, క్రైస్తవ బోధకుల పుస్తకాలు తెచ్చి సాకుగా వేషం ధరించి సాంకేతిక వ్యవహారించే వారిన్నీ, "జోబిదాంగం" కత్తిరింపులు తిన్నవారిన్నీ, సూటుకేసులు మారుగిళ్ళు అయినవారిన్నీ, ఈ సభవారు చాలా స్తోత్రం చేస్తున్నారు. —

రైలుపెట్టె ఎంతకాలం అయినా రైల్లో పాకీదొడ్డి ఎప్పుడు ఎల్లా ఉపయోగించాలో తెలుసుకోలేని పెద్దమనుషులని ఈ సభవారు నాగరికులని ద్రోహులంటున్నారు —

రైల్లో ఎక్కగానే ఆ సమూహం ఏర్పడ్డా, (అధ్యక్షుడంటూ, ఎగిరి ఎక్కే చోటు గాక, వీలు లేక) జనానికి అవస్థలుండేటల్లు సినీ అవసరం లేకపోయినా, కిటికీల్లోకి తొంగిచూస్తుండేవాళ్ళు కొందరు తాము హృదయశూన్యులై తమ పక్క తమంటికి మనస్సే ఇష్టాయిష్టాలుగల సజీవవ్యక్తులు కూర్చోడం తెలుసు మరిచిపోవచ్చుని అనుకోవచ్చేసినా "పాగంది" అనే మాట రైలుకి ఎక్కడ సాధ్యం కాకుండా పోతుందో అని పక్క బెంచు కట్టి ఉండడంచేసినా, ఎదో చయ్యెంతం ఊరికే కూర్చోడం కష్టం అనుకొని, రైల్లో చుట్టలు కాలుస్తూ గాలివాటం చూసుకుండా కాండా ఉమ్మేసి అన్నీ నిప్పు నెరుసులన్నా పక్కవారి మీద పడుతుండడం చూసికూడా దాయల్లా ఊరుకునే ధీరులకి, ఈ సభవారు కైవారం

చేస్తున్నారు —

మగసాయం లేకుండా, ఆడవాళ్ళ పెట్టెలో కూచోకుండా ప్రయాణంచేసే స్త్రీలున్నపెట్టి చూసుకుని ఎక్కే నాజూకు వేషధారుల్ని వారి పతివ్రతా వాత్సల్యానికిన్నీ, సుందరమైన [illegible]లుగల స్త్రీలున్నచోటే మాత్రమే ఎక్కే వాళ్ళని వారి మాతృభక్తికిన్నీ ఈ సభవారు ప్రస్తుతిస్తున్నారు. —

డబ్బుండీ, రైలుతొందరలో కాఫీహోటల్లో అమదుం [illegible] పానీయాసనుకు నిలువుకాళ్ళమీద పరాము [illegible], [illegible] పడి, జేబులలోనూ జుట్టులోనూ [illegible] వెదులకక్కుతూ, చదవడం తెలిసినా నూతనవార్తా ప్రవాహ్నం ఉన్నా, చూసిచూసి అర్థంకాపెట్టె స్వంతానికి పత్రిక కొనుక్కోక పక్కవాణ్ణి "మీరు పేపరు చదివారా?" "మీ పేపరు ఓసారి ఇస్తారా?", "మీపత్రికలో ఒకషీటు విడగొట్టి ఇల్లా ఇస్తురూ" అని ఎరగనివాడి దగ్గిరకూడా యాచించేవో, [illegible] తనపేరు తను మాసుగుంటూ [illegible] మీద [illegible] లొడుల్తూ దగ్గిరకొచ్చి తనూ చదువుకుంటూనో, లేక [illegible] తను కొనుక్కున్న పత్రిక అక్కడ పెట్టి ఏ స్నేహితుడితోటో కబుర్లు చెప్పాగోడంలో ఉండేగా వాణ్ణి అడక్కుండా తీసేసుకునో, ఇల్లా చెయ్యడంలో తనయొక్క గడుసు దనానికి లోపల తనే ఆనందించుకుంటూ, పులిస్తరాకులమీద జంతువులు ఎగడ్డట్టు, పరాయివాడి పత్రికమీద విరుచుకుపడి, తను దిగేవరకూ ఆ ఎంగిలిపత్రిక ఇదిగో అని యజమానుడికేనా

యివ్వకుండా, చదువుతూండే ధనికులయొక్క ధనత్వం, ధర్మత్వం, సరసత్వం గురించి ఈసభవారు బెంగెట్టుకుపోయి హోరున, ఆనందిస్తున్నారు. —

గంటలకి గంటలు ప్రయాణం ఉన్నా, ఏమీ చెయ్యకుండా కిటికీకి దగ్గిర స్థలం సంపాదించుకుని, తమ తాలూకా మూట పైన పెట్టుకుని, బయటికి చూస్తూ కిమ్మనకుండా గడిపే ఆలోచనపరుల్ని ఈసభవారు హెచ్చరిస్తున్నారు. —

సూటుకేసులు, పరుపులు, పీటలు వగైరాలు కిటికీల్లోంచి లోపలికి గిరవటేసి రైలు ఇక వదలబోతోందీ అన్నప్పుడు ఎక్కి, అదివరకే ఆక్రమించేశ లోపల కూచున్న వీళ్ళెవరి ముందికి ముసుగులు విరగ్గొట్టేవాళ్ళ అహింసాభావానికిన్నీ, వేగానికిన్నీ ఈసభవారు వారిని మర్యాద చేస్తున్నారు. —

నిద్దర, జబ్బు, నోరు, జబర్దస్తీ, బిచాణావగైరాలు ఉపయోగించి నియమితస్థలం తమరు ఆక్రమించుకుని, అదే తమ ఆధిక్యత అని గర్వించే మహాత్ములని ఈసభవారు ఆరాధిస్తున్నారు. —

పరాయివాడిచేత కిరాయిపెట్టించిగాని, బల్ల కింద దూరిగాని, పాకీదొడ్లో నక్కిగాని, సమయానికి అవతలివేపు దిగిగాని, ఇతరత్రా దగాచేసిగాని, సన్యాసులైగాని, కావలసినవారైగాని, సేవకులైగాని, నెత్తిమీద వాళ్లైగాని, తత్సంబంధం కలవారైగాని, ఎల్లాగో అల్లాగ టికెట్టు స్వంతంగా కొనకుండా ఉచితప్రయాణంచేసే అదృష్టవంతుల్ని

ఈసభవారు ప్రశ్నార్థం పడుతున్నారు. –

అతిజవంతో రైలు పోతూన్నప్పుడు అందులో కూచుని బయటికి చూస్తే దగ్గరవని మనం అనుకునే వస్తువులు మన్ని విడిచిపెట్టి దూరంగావడమున్నూ, దూరానివే మన కూడా రావడమున్నూ ప్రతి నిత్యమూ గమనిస్తూండే కూడా, ఆ ప్రయాణంలో మహామహులిన్ని ఈసభవారు ఊరేగించి గౌరవిస్తున్నారు. –

తను ఎంతో వేగంగా పోతున్నా ననుకుంటూ, రాత్రిప్పుడు, నక్షత్రాలకేసి చూస్తేనూ, తన వాహానం, తన లోకం - వీటి ఉనికీ ఘూర్ణనమూ మాకేం తెలుసును అన్నట్లు ఆ నక్షత్రాలు నిర్నిమిత్తంగా ప్రకాశిస్తూండడం గమనించి మానవుణ్ణి అల్పుడుగా కట్టివార్ని ఈ సభవారు నిరసిస్తున్నారు –

శాంతంగా ఆలోచిస్తే రైలుప్రయాణం అనేది చిన్న ప్రమాణంలో జీవితప్రయాణం లాంటిదే అనిన్నీ, మానవ స్వభావాలు బయటపెట్టడానికి మానవుణ్ని తయారు చెయ్యడానికీ, అది చాలుననిన్నీ అనేవారిభావం శుద్ధ పేలవం అయినప్పటికీ వారు అట్లాంటివి ప్రకటింప సాహసించినందుకు ఈసభవారు వారిమీద కొంచెం కోపం దాల్చడానికి ముహూర్తం వెతుకుతున్నారు. –

తిండి విశేషాలు

[12 - 11 - 1939 తేదీన రాజమండ్రీమొట్టుపేట్లు ఒక వనంలో సంతర్పణ జరిగింది. ఆ తేదీనే చాలా జరిగేఉంటాయి గాని, వాటిల్లో ఇది ఒకటి. అందునిమిత్తం గ్రామాంతరాల్నించి సాధ్యమైన ఆంధ్రఉద్యోగులు విరివిగా రావడానికి ఏర్పాట్లు కావడం, అట్లానే చాలామంది రావడం కూడా జరిగింది. గొప్ప అవనం ఏమిటంటే, సంతర్పణానంతరం — పోనీ, సంతర్పణకి తప్పనిసరి సహితంగా ఉండే క్షుద్రనిద్రానంతరం, అనగా మూడు గంటలికి ప్రారంభించి — ఒక మహాప్రదర్శనంకూడా జరుగుతుందని కరపత్రాలు అచ్చుపడ్డాయి. అధ్యక్షులు ఫలానా, వక్తలు ఫలానాఅంటూ కార్యక్రమం వాటిల్లో ఉంది. లోగడ కార్యదర్శిగారు నన్ను గౌరవించి ఆసందర్భంలో నన్ను ఒక వక్తగా ఉండకోరారు. నేను ఆయనకి ఎదా ముఖాన్నే అనడంచేత "కాదు' అననూ లేక, అయినా వెంటనే ఒప్పుగోనూ ఒప్పుకోక, "ఎంత చదువుకున్న వాళ్ళయినా ఎంత 'అర్థం' చేసుకోగలవాళ్ళయినా, ఉగాత్తంగా భోజనంచేసిన తక్షణం ఏ ఫలాహారంఅంటేదో పుచ్చుకోగల్రుగాని, ఉపన్యాసాల వంటివి బొత్తిగా స్వీకరించలేరేమో, ఆరకం పదార్థాలు ఆసమయంలో హిమించవచ్చునుమండీ!" అంటూ నసగడం మొదలెట్టినా, ఆయన తన ఉత్సాహంలో "వల్లకాదు, మీరు ఒప్పుగునితీరాలి!" అని, నాచేత "సరే లెండి" అని పించి, వక్తల జాబితాలో నన్నుకూడా అచ్చుకొట్టేశారు.

అక్కణ్ణించి, నేనూ కొంచెం బుగ్గగులిపి, పేల్చడానికి వీలైన సామగ్రి కొంత సిద్ధం చెయ్యవలసొచ్చింది. ఒకో విషయం మరో విషయం అయితే అప్పట్లో మరిపించి పోతుందేమో అని భయం పట్టుకోవడంవల్ల, జ్వరం అందరూ అంతకి పూర్వమే ఆచరణవల్ల గ్రహించిఉంటారుగనక భోజనప్రమేయమే ఎత్తుకుని కొన్ని సంగతులు వడ్డించుదాం అన్నీ, ఏఘట్టంలో ఏ దార్థం మిక్కుటం అయిపోయి వెళ్లిపోయేలా కనిపిస్తుందో అక్కడికి రకరకాల ఆగిపోయి జీవక్షోభ కలుగకుండా జాగ్రత్త పడదాం అని అయత్నం చేసుకున్నాను. అయితేం! మన ఖర్మ! సంతర్పణ అయింది, రిమార్కులు అయినాయి, నిక్కచ్చిగా దంతపుపని చేసినవాళ్ల ఆపసోపాలు అయినాయి, ఇటూ అటూ దొర్లుతూ కునుకులాగడాలు అయినాయి, కొంచెం గానా జానా అయింది, ఏళ్లనో తంటాలు పడి, దాని మొహం ఈడ్చి, సాయంత్రం అయిదుగంటలు కూడా అయింది. తక్షణం కొందరు బ్యాంకు ఉద్యోగులు, "కొంపతప్పి కరపత్రాల్లో నిరూపించి ఉన్నప్రకారం, ఆలస్యం అయితే అయిందని, మీటింగూ దానితాలూకు ఉపన్యాసాలూకూడా ఎక్కడగుద్దేస్తారో కదా, ఇవన్నీ భరించడం ఎల్లాగా భగవంతుడా!" అని బెంగెట్టుకున్నట్టు బిక్క మొహాలు వేశారు. దాతలలో ముఖ్యస్నేహితులు వొకాయన, "మరి ఆలస్యం చెయ్యకే మీటింగు కానిస్తాం, పిల్లలు సర్దండి" అనే సంగతి చకచకా నిష్కర్షగా మంచినీళ్ల ప్రవాహంగా

ఆంగ్లంలో అనేశాడు "సభంతపనీ జరిగిపోయిం దన్నమా టేరా దేవుడా" అని కొందరు ఉద్యోగులు నిస్పృహాలో పడిపోయారు. ఏవాడు చేసుగున్నదో మరి అనుభవించాలి గావును అనుకోడంవల్ల గావును, కొందరికి మొఖాన్ని కత్తి వాటువేస్తే నెత్తురురేను కాని కొందరు గడసర్లు ధైర్యం అవలంబించారు "అన్నట్టు, ఫోటోతీయింపుగోవాలి గావు నుగా! అదిచాలా సుఖ్యం వెలుగుండగానే ఇల్లుచక్క-బెట్టుగోమన్నాడు ఫోటో చిక్కబెట్టుగోమన్నాడు. ముందు ఫోటోయే! తరవాత తతిమ్మాని" అని మాట్లాడుతూనే, వాళ్లు, బల్లలూ, కుర్చీలూ అవీ ఉన్నచోటినించి ఓ ఫర్లాంగు దూరం ఈడ్చేశారు సూర్యాస్తమయంవరకూ వాళ్లు నిమ్మ నిమ్మళంగా ఫొటోగ్రాఫు దిగుతూనే ఉండిపోయారు. మెట్టుకి ఒక్కడూ వక్తలున్నవైపైనా రాలేదు. కార్యదర్శిగారు చాలా నొచ్చుగుని, వక్తల్ని క్షమాపణ కోరుకున్నారు. వానప్రస్థంరోజునే ఉపన్యాససన్యాసం కూడా సిద్ధించి శ్రమ లేకుండా రెండాశ్రమాలు లభించడం జన్మకి చాలుగదా అని వక్తలన్నారు. కార్యదర్శి ఆ ఫొటోగ్రాఫు చెట్టుదగ్గిరకి మళ్లీ వెళ్లి చూసొచ్చి, కొందరు కుర్చీలకి అంటిల్లా అయిపోయా రనిన్నీ, కొందరు మహావ్రతంలో పడ్డట్టు చెప్పారనిన్నీ, తక్కినవాళ్లు పంచరంగాళం అయిపోయారనిన్నీ చెప్పారు. "అయ్యా! ఇప్పుడొచ్చిన ప్రమాదంఏమీలేదు. శూన్యోప న్యాసాలకే, అర్థం చేసుకోగలవాళ్లు కూడా హడిలిపోవడం

వేళావిశేషం! మీరుచేసింది పదార్థాలసంతర్పణ, మాదిపదాల సంతర్పణ అదీ ఇప్పుడు కేవలం తర్పణ అయిపోయింది మాపదాలు మేం నోటితోనూ అనచ్చు, లేకపోతే ఆనోటి మొంగినికూడా తగలనీయకుండా, పత్రాలమీదకూడా పెట్టచ్చు. అల్లానే కానిస్తాను అసలు నేచెప్పదలిచిన దాన్లో కొన్ని లెఖ్ఖలూ, అంకెలూ వచ్చేట్లు ఉండటంవల్ల అది లిఖితంచేసుకునే వచ్చాను, రచనకి కారకులుగనక మీకు ప్రత్యక్ష నమస్కారం వద్దు మొర్రో అంటూ ఉన్న తమ సమక్షంలో చదవటానికుండా తప్పిపోడం అనే ఘన్యం నా రచనకి పుట్టగానే కట్టబెట్టిన తక్కినవారికందరికీ లోపాయి కారీగా నమస్కారం. సెలవు'' అని నేనన్నాను. అయి పోయింది. నిష్క్రమించి మేం వచ్చేశాం రచన అల్లానే ఉండేసింది

ఇంతలో 17 – 2 – 1940 తేదీని రాజమండ్రి ఆర్ట్సుకాలేజీ పూర్వవిద్యార్థి వార్షికోత్సవం తాలూకు సమావేశం వచ్చింది. నేను అక్కడ పూర్వవిద్యార్థినై ఉండడంవల్లా, ఆంధ్రదేశపు విద్యాధిక సమావేశాల్లో ఆ సందర్భపు సమావేశం ఒకటి అవడంవల్లా, విద్యాసక్తిగల స్త్రీ బాల వృద్ధులతో నిండిన సభ మొదట నిలబడి ముఖాముఖిగా మాట్లాడవలసిన అవసరం వచ్చినప్పుడు వక్త గమనింపవలసిన సార్వజనీనతా, మార్దవం, వైవిధ్యం, మోతాదూ గురించి అనేకంగా నేను నేర్చు కోడానికి అదే తరుణం అవడంవల్లా, ఆ సందర్భపు ప్రణాళికలో

నేనూ పడ్డాను కాని, ఆరోజున ఇతరవిషయాల్లో చాలా ముఖ్యమైనవి ఉండడంచేత, నాకు ఇచ్చిన వ్యవధి చాలక, నాకు కొంచెం — అనగా చాలా — ఉక్కిరిబిక్కిరి అయింది. ఏదేనా సమగ్రంగా చెప్పడానికీ వీలులేకుండా, పోనీ మానడానికీ వీలులేకుండా వచ్చింది. నేను సరాసరా ఉపోద్ఘాతం కానిచ్చుకుని, "అబద్ధం ఆడడం" గురించి ఒక పరిచ్ఛేదం చదివి, విషయం మారుస్తున్నా నని చెప్పి, ఈక్రిందరచనలో తిండిపోటీలున్న ఘట్టంలో కొంతమాత్రం తిరగేశాను. ఆవాక్యాలలో పేర్లూ, స్థలాలూ, అంకెలూ, లెఖ్ఖలూ, తేదీలూ ఉంటూండడంచేత వాటి యాథార్థ్యం నేను నమ్మే చదివాను. కాని, వాటిల్లో, చెప్పులుతినడపు పందెంసంగతి నేను చదువుతూన్నక్షణంలో, చీమకేనా సందులేకుండా ఉన్న ఆ మహాసభలోంచి ఒక పురుషుడు (— శ్రీ శ్రీ సర్ కె వి. రెడ్డి నాయుడుగారు అధ్యక్షత వహించిన అంత సభలో ఉన్న అంతమందినీ నేన అసత్యాలు చెప్పి మోసగిస్తూన్నసంగతి తను ఒఖ్ఖడే హఠాత్తుగా పరిశోధించినట్టు — నేను అబద్ధం ఆడడం గురించి అంతకీపూర్వమే ముచ్చటించిఉన్న వాణ్ణవడంచేత ఆతరవాత నేను ప్రసంగించేది ప్రతీదీ మంచి అబద్ధం అయి ఉండకపోతుందా అనే అఖండానుమానం తన్ని పీడించుతూన్నట్టు —) లోకకల్యాణం నిమిత్తం నావాక్యం కేవలం కోత అని బుజువుచెయ్యడానికిట, "కొంగ్ కొయ్" అనే శంకారావం చేసి, తను రెండు కోతలు కోశాడు.

నావి ఆత్మస్తుతిగల వాక్యాలైఉంటే వాటిని రెండు కాదు మూడుకోతల దువ్వెన్నలాగ కొయ్యొచ్చు. కాని, స్థితివేరు! వారు అవస్థావశంచేత గౌతమీస్నానం నిమిత్తం రాజమండ్రీ వేంచేసిన తైర్థికులై ఉండవచ్చునని నా రాజమండ్రీత్వానికి తోచి, నేను ఆధ్వని వచ్చినవేపు తిరిగి, "అయ్యా! నావాక్యాలకి లిఖితమైన సమ్మతిగ్గ ప్రమాణాలు నాదగ్గిర ఉందండి! ప్రస్తుతం క్షమించండి" అనేసి, అప్పట్లో వ్యవధిలేని స్థితిలో ఉండడంవల్ల ఊరుకున్నాను. కాని, ఇప్పుడేనా సప్రమాణంగా ఉంటే ఆనాటి మహాసభకి హాజరైఉండి ఆవేళ కమామీషు జ్ఞాపకంఉండి, ఈ రచనచూడ తటస్థించే రాజమండ్రీవాళ్ళైనా నన్ను శంకించకుండా ఉంటారుగదా అనే ధైర్యంచొప్పున అటువంటి వాక్యాలచివర జగత్ప్రసిద్ధిగల ఒకానొక వారపత్రిక యొక్క సంచికనెంబరూ, మరి దానితరవాత ఆ సంచికలో ఆయా పోటీసంగతి అచ్చుపడ్డ పేజీ సంఖ్యా ఇచ్చాను. అన్నివేల సంచికలు కోతలతో భూమిమీద చెలరేగడం కష్టం. అయినా సరే, ఆపత్రికమాత్రం కొండమీంచి ఊడిపడిందా అంటే, మరి నమస్కారం!! పేర్లూ, అంకెలూ, లెఖ్ఖలూ ఉన్నాయిగా! హృదయం, బుర్రా, ఓపికా, పట్టుదలా ఉంటే బుజువుచేసి చూసుగోడానికి వీలున్న సంగతులుకూడా చెవికి ఇల్లా తగిలాయోలేదో ఆపళంగా కొయ్‌కొయ్ మని గర్జించి తెయ్ తెయ్ మని ఆడేసేకంటె, తణిఖీచేసి యథార్థం తేల్చుగునేదాకానేనా ఆగడం ధర్మం. విద్యావంతుడు వినగానే తను

విన్నది ప్రతీ సమ్మె చెయ్యగూడదనిమాట నిజమే కాని, క్షణానికి ఒకటిచొప్పున మహాద్భుతాలు అని వెనక అనుకుంటూండబడేవి సుసాధ్యాలూ, సాధారణాలూ అయిపోతూన్న ఈ యుగంలో వెలివిపడ్డ ప్రతీసంగతీ, ఒకవేళ దాఖలాలయ్యే బాపతేమో అనికూడా ఆగకుండా, బేసమయం అయినాసరే, మూకలో నక్క నికి విలువున్నంతమాత్రాన్ని, ఇతరుల ఖర్చు మీద శ్రమలేకుండా నుంచున్నపాట్న నీచప్రకృతి పల్లకుగా నోల్లుకుని ఖాయంగా ఉంచేసుగోవాలనే కక్కుర్తి తొందరలో 'అర్ధం, అయథార్థం' అని కేకలెట్టి, తద్వారా రసాభాసం కల్పించి, ఆక్షణంలో విజయం తనదే అనుకుని గర్వంకూడా వహించి, తనకంటె చిన్నసైజు మైరావణులైన లోకువస్నేహితుల దగ్గర అపవిత్ర స్థలాల్లో పచ్చిడచ్చీలు కొట్టుగోడం విద్యార్థిగాడియొక్క లక్షణంలా కనిపించదు, - అసలులో మళ్ళీ ఇంగ్లీషు విద్యార్థిగాడియొక్క లక్షణంలా అసలు కనిపించదు. అయినా చెప్పలేం! స్వాతంత్ర్యపురోజులు! "మరి ప్రకృతం—"]

భోజన సందర్భాల్లో ప్రసంగాలు మనలో వాళ్ళీ ఉన్నట్టు తోచదు. భోజనకాలంలో గోవిందనామ స్మరణతోనే ఆర్యులు — అనార్యులూ అంతే అయివుండదు — తృప్తిపొందుతారుగాని, ఐహికస్మరణ చెయ్యరు దేవుణ్ణి తల్చుకునేటప్పుడు జోరుగా సమూహంగా అరవడంవల్ల కూడా గొంతిగ సాఫీపడి భుజించడానికి ఎక్కువ అనువుపడుతుందని కొందరిఊహ. అయినా ఈ (మిథ్యా) వనభోజనసందర్భంలో ఏదైనా మామూలు ప్రసంగం

చెయ్యవలసిందని నిర్వాహకులు నన్ను కోరడంవల్ల భయపడు తూనే నేను అంగీకరించడమైంది. సభ్యుల్లో పరిచితులు విశేషంగా లేనప్పుడు చనువుగా మాట్లాడ్డానికి కొంచెం బెదురుగా ఉంటుంది. కాని, మానవ వ్యక్తుల స్వభావనిర్ణయంతో జోక్యంలేని మాటలుకొన్ని చెబుతున్నాను గనక అపరిచితులైనా ఏమీ మరోలాగ ఎంచవద్దని ప్రార్థన.

ప్రాణరక్షణకోసం తినేది తిండిఅంటారు. అందుకోసమే కాకుండా విలాసంకోసం కూడా భుజించే సందర్భాన్ని, అవకాశాన్ని, పదార్థాల్ని భోజనం అంటారు. ఏదేనా సందర్భంలో, భోక్తా పదార్థమూ ఉంటేగాని భోజనంఉండదు. సందర్భంఅంటే: తిండితినడం, అయిందనిపించడం, ఎంగిలిపడడం, మూతితుడుచుకోడం, మెతుకు కొరకడం, మంచిమాట చెసుకోడం, వాలాయితు తీర్చుకోడం, పథ్యంతినడం, పోగు చెల్లించడం, విందారగించడం, మనుగుడుపులు, దేవతార్చన, సాపాటు, పార్వణం, అశనం, పిండం — ఇల్లాగ్గా మిక్కిలి ఉన్నాయి భోక్తల్లో రకాలు చెప్పడానికే ఇదిసమయంకాదు. ఏమంటే, వాళ్లవయస్సులూ, ఆశ్రమాలూ, స్వభావాలూ, స్థితులూ, పరిస్థితులూ, అవస్థలూ — ఈ రీతిగా బోలెడు చూడాలి. కాని, ప్రతీభోక్తకీ ఒకశరీరం ఉండితీరాలి. స్థూలంగా చెప్పాలంటే, 200 ఎముకలూ, 500 కండరాలూ, రోజుకి లక్షసార్లుకొట్టుకొనే గుండె, చదరపు అంగుళానికి 3000 రంధ్రాలుగల చర్మమూ మొదలైనవి ఉండి తీరతాయి. ఇల్లాంటి

శరీరంయొక్క రక్షణకై సగటున రోజు 1 కి అయిదున్నర పౌన్ల ఆహారం - అనగా దామాషాయీని సంవత్సరానికి ఒకటన్ను బరువు తినుబండ ద్రాగుబండాలు మానవుడు లోపలికి పుచ్చుకో వలసి ఉంటుంది అని శాస్త్రజ్ఞులు లెక్కవేశారు. (నెం. 2972 పే. 5.)

ఆహారపదార్థం ఏదికావచ్చును అనేది ప్రశ్న. దీనికి సమాధానం చాలావిశాలం. ప్రాణంగాని ప్రాణాన్ని పోషించలేదు. అందుకని పెద్దప్రాణం చిన్నప్రాణాన్ని మింగేసి నప్పుడుగాని నిలబడదు అందుచేత మానవుడు ఇతరప్రాణుల్ని తినేస్తాడు. మనుష్యుల్ని తినేసే మనుష్యులు ఇప్పుడుకూడా అక్కడక్కడ —పోనీ ఎక్కడో అక్కడ - ఉంటారని కొందరు చెబుతారు. ఉండవచ్చును! మనలో ఒకొక్కడికి ఇంకోడిమీద తీవ్రకోపం వచ్చినప్పుడు వాణ్ణి తినేసేటట్టు చూస్తాడు, గాని తినేసెయ్యడు. సాధారణంగా మానవుడు జంతువుల్ని పుచ్చుకుంటాడు. తననే తినేస్తాయేమో అనేభయముండున్న క్రూరజంతువుల్ని మానవుడు వదిలేస్తాడు. కడంవాటినే కానిస్తాడు. అటువంటివి తిన్నకొద్దీ పుడుతూంటాయి, పుట్టినకొద్దీ తినబడుతూంటాయి పళ్ళగట్టీ, నాలికవాడీ, ముక్కుడళసరీ గల మానవులు పచ్చి జంతువుల్నే కొరుక్కొని తినేస్తారు. కాని, నాజూకుమనుష్యులు తమ నేర్పువల్ల కొన్నిభాగాలు స్వీకరించి, కొన్నింటిని విసర్జించి, ఇతర ఘనద్రవ పదార్థాలతో కలిపి, అగ్నిమిత్రసాహాయ్యం పొంది, కొత్తసమాసాలు సృష్టించుకుని పుచ్చుకుంటారు, అల్లానే గాల్లో పక్షుల్ని, నీళ్లలో చేపల్ని స్వీకరిస్తారు. ఆపైని

మానవులు వృక్షాల్ని మూలం లగాయితు చిగురు వరకూ తమ ప్రజ్ఞవల్ల చేర్చి నూతనమిశ్రణాలు కల్పించుగుని తింటారు. మూలానికి నాశనం రానీకుండా చెట్లు ఇచ్చే ఫలంగాని, జంతువులిచ్చే రసంగాని పుచ్చుగోడం కొందరి మతం, చెట్టు యొక్క ఫలం కోసుగునేటప్పుడు కూడా దాని ప్రాణానికి హాని కలుగుతుంది గనక, చెట్టునుంచి వాటంతట అవే రాలిపోయిన ఫలాలే తినాలని కొందరి బాధ. వానకి ముల్చి గాలికి పెరిగే నీవారం తినాలని కొందరి తంటాలు. దూడ వెళ్ళి ఆవుదగ్గర పాలు తాగేటప్పుడు రేగే నురగ రేణువులు దూరాన్ని ఉండి ఆరగించాడు ఒకాయన అన్నారు. పరిశుభ్రమైన జలం తాగి వాయువు పీల్చి జనం జీవించాలి అంటారు కొందరు. వీళ్ళందరికీ ఉద్దేశం ఏమిటంటే, ప్రాణం నిలిపే మూలకణాలు గల పదార్థాలు కొన్ని ప్రాణం తీసేసే కణాలు గలవి కొన్ని ఉన్నా యనిన్నీ, ప్రాణం నిలిపేవే పుచ్చుగోవాలనిన్నీ, అవయినా మోతాదు చూసుగుని, వేళపట్టున, తత్వాన్ని బట్టి, కాలానుగుణ్యంగా, అందుకొటు ఆలోచించి, మొహమాట పడుతూపుచ్చుగోవలసి వుంటుంది అనిన్నీ.

కాని, ప్రపంచంలో జరుగుతూండే తిండిపోటీలు గమనిస్తే చాలా ఆశ్చర్యంవేసి, ప్రాణాపాయం అయినవస్తువులు అసలే లేవా అనిపిస్తుంది; తిండికి హద్దులేదా అనిపిస్తుంది. చూడండి: స్టాట్ఫోర్డులో జె. కొండార్ అనే అతడు నాలుగు పౌన్లబరువు గలచేపల్ని ఒకగంటలో తినలేడు - అని ఒకడు పందెం వేశాట్ట.

అయితే, అతడు అన్నిచేపలూ 20 నిమిషాల్లో తినేసి ఊరుకోక పైపెచ్చు ఏడుపైంట్ల 'బీరు' పీల్చేసి పందెంనెగ్గి రాయల్లా ఉన్నాడు [2880-4]. లాస్ యాంజెలిస్‌లో కోడిపెట్టలు తినడం పోటీ జరుగుతూంటుందిట. 1936-వ సంవత్సరపు పోటీలో మూడేసి పౌన్ల బరువుగల 10 కోడిపెట్టల్ని — 15 పౌన్ల బరువు మసాలాతో సహా — తినేసి ఎడ్నాపాటర్ అనే అదృష్టవంతురాలు నెగ్గిందట [2887-12]. పెద్దరకం అరటిపళ్ళు తినడం పోటీలో ఆల్బర్టా నగరానికి చెందిన ముక్‌గీ అనే దొర ఒకటి మాత్రమే ఎక్కువగా మెక్కి పందెం నెగ్గాడట. అవతలపోటీదారు 42 మాత్రమే పుచ్చుకోగలిగాడట, ఇతడు 43 ఊదేశాడు [2911-5]. ఏడేసి అంగుళాల వెడల్పు గల పెద్దపెద్ద బిందిరొట్టెలు 36 మాత్రం 61 నిమిషాల్లో నమిలేసి ఒక అమెరికా దేశస్థుడు యునైటెడ్ స్టేట్సులో రొట్టెల మహా సమ్రాట్ అనే బిరుదం పుచ్చుకున్నాడట [2894-4]. యూగో స్లావియాలో ఒకముష్టివాడు పచ్చికప్పల్ని, చేపల్ని, ఎలకల్ని, పాముల్ని జనంఎదట భక్షించి యాచనవల్ల జీవయాత్ర చేసేవాడున్నాడు [2917-4]. టర్కీలో సెమీర్ డ్రీలో ఒక రయితు మామూలు కూర తరిగినట్టు తన రెండు చెప్పులూ తరిగి, ఇంతవెన్న ఆ చెప్పుముక్కలికి పామి ఒక్కఅరగంట వాటిని పెనంమీద వేయించి, దింపి, లగాయించేసి పందెంనెగ్గి బహుమతీ నవరసు విలువా పుచ్చుకున్నాడట [2968-3]. నోర్థాంప్క్షియాలో ఒకబాలుడు ఒకకత్తిరేకూ, ఒక ఎల

క్రిస్ బల్బ్బా తినేశాడట. ఇంకొక మనిషి ఇనపతీగెలూ, తీగెచుట్టలూ తినేస్తున్నాడు అని తెలిసి, వాణ్ణి తీసికెళ్లి గ్లాస్గో కారాగృహంలో పెట్టగా, వాడికి బుద్ధిరాక, వాడు ఇనప గడియాలూ, ఊచలూకూడా తినెయ్యడం మొదలెట్టాడట. డబ్లింగ్‌లో రోగుల స్నేహం సంపాదించిన ఒక ఐరిష్‌వాడు ఒకేసారి 150 మేకులూ, 700 గ్రామఫోన్ సూదులూ తినేశాడట, చావలేదు. వీరందర్నీ మించినవాడు ఒక జర్మన్ సామంతుడు. ఆయన 150 మేకులూ, 102 ఇత్తడి సూదులూ 150 గాజుముక్కలూ, 7 గుర్రపుగాడపు మేకులూ, 6 నాణెపు కాసులూ, 3 కళ్ళెపుముక్కలూ, సీసపుగుద్దా, 20 ఇతర సామానులూ తినేసి చావడంలేదు డిబ్బా లేదు, 'బోయిలర్' లాగ బ్బాగానే ఉన్నాడట [2014-6] విషద్రావకాలు తాగి చావకుండా నిల్చినవార్ని ఎరుగుదుం. విషం పెట్టగా తెలియక తినేసి చావకుండా నిల్చిన శాండో రామమూర్తిని ఎరుగుదుం. మనదేశంలో పోటీలు, ప్రాణాపాయం కావు అని అందరూ ఎరుగున్న పదార్థాలతోటే గనక విస్తారం అవసరం లేదు. అవసరమైన పాదరసంతో ఆహారం కల్పించుగుని, అది బుగ్గనో కంఠంలోనో ధరించి, మరి ఏళ్ళతరబడి ఆకలి దప్పులుగాని విసర్జనగాని లేకుండా విహరించగల మనుష్యులు హిమాలయ గుహల్లో ఉన్నట్లు స్నేహితులు చెబుతారు.

దేనివల్లా ప్రాణాపాయం రాకపోవచ్చునని పైవాట్లవల్ల తెలుస్తూంటే, ప్రాణరక్షణకి ఏదైనా చాలని చెప్పడానికి

కొన్ని నిదర్శనా లున్నాయి మేబిల్ యాష్వర్త్ అనే ఆమె 11 ఏళ్ళనించి పాలుమాత్రం తాగి ఉంటోందట. పంచదార మట్టుకు జాస్తిగా వేసిన 'టీ' మాత్రం తాగి ఇ. హార్ అనే ఆమె 18 ఏళ్ళనించి ఉందట పిల్లిడ్డగూ ఇంగ్లండునాల్లే. ఇండియాలో, బంకూరాలో ఉప్పుకలిపిన నీళ్ళుమాత్రం తాగి, 56 ఏళ్ళనించి జీవిస్తున్న గిరిబాలాదేవి ఉంది [2920-4]. యుద్ధసమయంలో ఒక స్త్రీకి దొరతనం వారు దినవెచ్చం ఇయ్య సంకల్పించగా ఆమె తనకు అది అవసరం లేదనిన్నీ, తాను క్రితం 12 ఏళ్ళనించీ ఆహారపానీయాలు లేకుండానే జీవించుకొస్తూన్నాననిన్నీ చెప్పిందట [ఇది ఆవారపత్రిక 3043 నెంబరు 6-వ పేజీలో 24-2-1940 తేదీగల సంచికలో ప్రచురం అయిన సంగతి గనక, సంతర్పణనాటికి గాని, సభనాటికి గాని, నేను ఇది తెలుసుగునీ ఉండలేదు. 'కొయ్య' నూ లేదు]

ఇక, భోజనపదార్థాలవల్ల కలిగే ఆరురసాల్లోనూ ఉల్బణ, అనుల్బణ, ఉల్బణానుల్బణ అనే 'ముయ్యాగు, భేదాల్లోకీ ఇప్పుడు వెళ్లను. అదీకాక, పదార్థం, రుచి, పాకం, రసం అనే మాటలు భోజనంలోనే కాక, కవిత్వంలోకూడా ఉన్నప్పటికీ అందులోకికూడా ఇప్పుడు ప్రవేశించను ప్రవేశిస్తే మోతాదు ఎక్కువ అవుతుంది. ప్రాణాపాయం అనుకున్నవన్నీ ప్రాణం తీయవు, సరిగదా, ఒకఅవస్థలో ప్రాణాన్ని రక్షిస్తాయి. కాని, ప్రాణాధారం అని మనం అనుకునే అన్నమే మోతాదు మీరి విషం అవుతుంది. మాటలకూడా అంతేగా ! ఆగుతాను !

"ప్రాణాః ప్రాణభృతా మన్నం,
త దయుక్త్యా నిహన్త్యసూన్" } అనిగదా మాధవుడు !

లోకో భిన్నరుచిః

'లోకో భిన్నరుచిః' అనేది అంతా ఒప్పుగునే సంగతే, పైకి చిన్న వాక్యమే కాని, ఇందులో లోకం, భిన్నం, రుచి అనే మూడు మాట లున్నాయి. వీటిలోకల్లా భిన్నం అనే పదం ఒకటే సుళువు. ఏమంటే, జనం అంతా యథావసరంగా భిన్నం అవుతూండడం, యథాశక్తిగా భిన్నం చేస్తూండడం పరిపాటి. లోకం అనేది ఊహాతీతం. "లోకమంటే ఏమిటి, గంజగుంట అనుకున్నారా?" అంటాడు గిరీశం. అయినా, ఆ మాటకి ఎంత పెద్ద అర్థం ఉన్నా, అది మిక్కిలి సంకుచితంగా పుచ్చుకుంటేగాని బుర్ర ఆడదు. "ఏకాంశేన స్థితో జగత్." అదేనా ఎన్ని కోట్ల అంశాల మొత్తంలోనో! రుచిగురించిన ఆలోచనకి పధ్నాలుగు లోకాలూ అంటూ తలబద్దలు చేసుకొని అతలాకుతలం కాలేంగదా! అగోచరాల్ని మొదటే మినహాయించాలి. ఆ గోచరించే వాటల్లో అదృశ్యాల్ని తగ్గించెయ్యాలి. ఆ కనపడే వాటిల్లో అగమ్యాల్ని వదులుకోవాలి. అనగా నక్షత్రలోకాల్ని దూరవీక్షణంమాత్రం చెయ్యాలి గాని గత్యంతరం లేదు. ఇక గ్రహాలోకాల్ని గురించి కూడా, రుచివిషయంలో, ఆలోచన కట్టేసుగోవాలి కాని, శుక్ర, అంగారక, చంద్రగ్రహాలలోకి మానవులు త్వరలోనే విహారించేటట్టు కనబడుతుంది. చంద్రుడిలోకి రేడియం సాయం

వల్ల రెండురోజుల్లో వెడతానన్నాడు ఒకాయన. బ్రిటన్‌లో బెన్నెవిస్ మీాంచి ఒక వెండి స్తంభం చంద్రుడిలోకి గిరవటెయ్యడానికీ, గిరవటేసిన వారంవాటికి అది అందులో పడడానికీ ఏర్పాట్లుచేశారనిన్నీ, యుద్ధంమూలాన్ని ఆగిపోయారనిన్నీ తెలుస్తుంది. ఆలాగ్గా చంద్ర శుక్ర అంగారకుల్లోకి పాశ్చాత్యులూ, పాతాళవాసులూ వలసనిమిత్తం వెళ్లి వర్తక సామ్రాజ్యాలు స్థాపించగల సూచన్లు ఉన్నా, మన పని మామూలుకి లోటుండ కూడదు గనక వాటిని కూడా ప్రస్తుత ఆలోచనలో వదిలేద్దాం. ఇక భూలోకం. ఇందులో, స్థావరాలు వదిలేసి, జంగమాలలో భూజల వాయువుల్లో ఉండే క్రిమి పక్షి మృగపశులోకాలు వదిలేసి (వాటికి రుచులు లేవనికాదు, అవి ఫలానా అని చెప్పగోలేవుగనక !) మనుష్య లోకాన్ని మాత్రం విచారించాలి వీళ్ళు, పోనీ, రెండువందలకోట్లు అందాం. వీళ్ళల్లో పసిప్రాయుల్నీ. అతిశైశవృద్ధుల్నీ, అతీతుల్నీ, అపస్మారకుల్నీ, పిచ్చివాళ్ళని గీకెట్టి, తక్కినవాళ్ళనే రుచినిమిత్తం లెఖ్ఖకట్టుగోవాలి. పోనీ, అంతా ప్రమాణజనులే అని ఒప్పుకుందాం. ఇక తక్కినమాట 'రుచి.' ఒకానొక వస్తువుగాని, విషయంగాని ఒక ప్రమాణ మనుష్యుడి యొక్క నాలికవంటి గ్రహణేంద్రియంమీాద పడినప్పుడు, ఆ మానవుడు ఆ వస్తువుని గాని, విషయాన్ని గాన్ని ఏకాంతో హరాయించుగోడం వల్ల వాడియొక్క చైతన్యంలో వచ్చే పరివర్తనమే రుచి.

కాబట్టి రుచి అనేది కలగడానికి వచ్చేపడే వస్తువు రసవద్వస్తువుగా, రసదాయకవస్తువుగా కావాలి, నాలికకి తడి వుండాలి. నాలికమీద పెట్టుగున్న వస్తువుకి నాలికతడిలో కరిగేగుణం ఉంటేగాని రుచి అనేదే జనించదు. బెడ్డముక్క, ఇనపముక్క, గాజు, రాయి — వీట్ల విషయంలో రుచి కనిపెట్టడం మామూలునాలికవల్ల కాదు. అల్లాగే, ఆకలిమీద ఉన్నవాడికి రుచికనిపెట్టడానికి సావకాశమే లేకపోవట్టే వాడికి అంతా రుచే. ప్రాణాధార వస్తువులలో రుచులు ఎన్నడం మామూలుగా ఉండదు. కాని పరిస్థితి మారినప్పుడు, "అబ్బ! ఈ వేసంకాలంలో మంచినీళ్ళ కున్న రుచి మరిదేనికలేదు" అనడం వినిపిస్తూంటుంది. మాధుకరం ఎత్తుగున్నవాళ్ళు అన్నంయొక్క రుచి వర్ణించగా వింటాం. దారిద్ర్యంలో వస్తువుల్ని వదులుకోడమే కాకుండా "రుచులు దోసంబంచుం బోనాడ" వలసిన అవస్థవస్తుంది. ఏదేనా వస్తువుయొక్క నిరంతర స్వీకరణంవల్ల రుచి తెలియదు అయితే, ఒక సాధారణ మానవుడు ఒకవస్తువు తన నాలికమీంద వేసుగున్నప్పుడు, ఫలిత రుచులు ఎన్నెన్ని విధాలుగా ఉండవచ్చును. అంటే 'చాలా' అని ఊరుకోడమే కాకుండా కొద్దిగా లెఖ్ఖకూడా కట్టచ్చు. అందులో ఆ భోక్తయొక్క, ఆ వండినవాడియొక్క, ఆ వడ్డించినవాడియొక్క స్వభావ సంప్రదాయ వయోవస్థా సమయ సందర్భాలూ, తరవాత వస్తువుయొక్క వ్యష్టి సమష్టిభావాలే

కాక, మత్స్య మాంస ఫల ధాన్య శాక మూలాదిభేదాలలో ఘన ద్రవ ధూమాది ఉష్ణశీతల మిశ్రణాలు మొదలైనవీ వీటైనంత వరకు గమనించి ప్రస్తరించితే ఫలితరుచుల సంఖ్య కోటాన కోట్లమీద ఉండవచ్చునని బోధపడుతుంది. అందువల్ల ఒకే మనిషికి ఒకే వస్తువుపరిస్థితులబట్టి లక్ష వేర్వేరురుచులు ఇవ్వడానికి వీల్లున్నప్పుడు, లోకం భిన్నరుచులు కలిగి ఉండేది అనిచెప్పడంలో ప్రమాదంలేదు, ఆశ్చర్యం లేదు.

[పై లెఖ్ఖ యీాపత్తూ కడితే కొంచెం విసుగుగాఉంటుంది. కిట్టకుండా వదిలేస్తే 'ఏముటో' అనిచప్పరించ బుద్ధేస్తుంది. అందుకని ఆశ్వికల్లో నాలుగైదు మచ్చు చూస్తే ఈక్రింది మోస్తరుగా ఉంటాయి భోక్తయొక్క నిత్యావస్థ — ఒంటరా, సంఘజీవా - బంధుసమేతుడా, అహితావృతుడా - శ్రమ జీవా, లంచగొండా - దరిద్రుడా, ధనికుడా - ఉత్సాహ యుతుడా, నిరుత్సాహపూరితుడా - నిర్బంధితుడా, స్వతం త్రుడా - లజ్జాన్వితుడా, మదాంధుడా - భయస్థుడా, సర్వా ధికారా - కోపిష్టివాడా, శాంతుడా - తొందరవాడా, నిబ్బ రస్థుడా అనేదాన్నిబట్టి రుచి వుంటుంది. ఆలాగే పదార్థ స్థితి ఆలోచించినప్పుడు — ఘనమైతే కఠిన, మృదుల, స్థూల, చూర్ణ, భస్మ, స్ఫటిక, రేణు, రజ మొదలైన రూపాలూ, ద్రవమైతే జల, తైల, రస, మధు, పానక మొదలైన భేదాలూ వగైరాలనిబట్టి రుచి వుంటుంది. వస్తువు సంక్రమించిన రీతి గమనిస్తే, అది పిత్రార్జితమా స్వార్జితమా, పాతు ధోరి

కిందా సవ్యంగా వచ్చిందా, కష్టార్జితమూ బలవంతంగా లాక్కొచ్చిందా, చోరీబాపతా దత్తమూ, యాచితమూ విక్రీతమూ, బహూకృతమూ అనేదాన్ని బట్టి రుచి ఉంటుంది. అగీకార వస్తువు పచిత - అపచిత, పక్వ - అపక్వ, ఉష్ణ - శీతల, తప్త - ఆర్ద్ర, పూర్వ - ప్రస్తుత, మిత - అమిత, ప్రత్యేక - సాకల్య, వాయుహత - వాయురహిత, అవస్థల్ని బట్టి రుచి ఉంటుంది చివరకి, అన్నదాత ఉద్దేశం హృదయపూర్వకమూ, వ్యాజపూర్వకమూ, ఇతరలాభం ఉద్దేశించా, పితృప్రీత్యర్థమూ, మిత్రప్రీత్యర్థమూ, అధికారిప్రీత్యర్థమూ, యశోవాంఛతోనా, ప్రాణపోషణ నిమిత్తమూ, ప్రతిఫలం ఆశించా, పాపపరిహారం చేసుకోవచ్చుననా—అనేదాన్ని బట్టి కూడా రుచి వుంటుంది ఈ శీర్షికల క్రింద ప్రమేయాలు ఎక్కువగా ఆలోచించి రకాలసంఖ్య వేసినకొద్దీ ఫలితరుచుల సంఖ్య గుణకలితంగా పెరిగిపోతుంది.]

ఇన్నిన్ని షరతులమీద ఆధారపడి ఉండడంవల్ల ఏ వ్యక్తి యొక్క రుచి ఆ వ్యక్తిది. ఇద్దరు వ్యక్తులరుచులు ఏలేశమో భేదించి ఉండడం సహజం అచ్చంగా ఒకటే అయేట్టు ఏకీభవించడం మిక్కిలి అపరూపంగాఉండే ఆశ్చర్యం! "మూడు మూర్తులా ఒకే పోలిక మొహాలు గలవాళ్ళు ఇద్దరు దొరకవచ్చుగాని, ఒకేరుచి గలవాళ్లు దొరకరు" ఒకరి రుచి ఉన్నరీతిగా ఎందుకని ఉంటుందో చెప్పడం కష్టం, అడగడం వ్యర్థం. దండనవల్ల ఆకస్మికంగా అన్యరుచి కలిగించడంగాని, ఉన్న

రుచి లేకుండా చెయ్యడం గాని అసంభవం. అల్లా అని ఆగి పోవలసిందేనా ? జిహ్వాకంటె దానియొక్క రుచి సంపదకి ప్రమాణం అంటూ ఏదేనా ఉంటుందా అనేది ప్రశ్న. అంతే, నీతిమాటేమిటి ? దానికి ఓ ప్రమాణం అంటూ లేదూ? ఎవరి నీతి వారిదే అయితే సంఘం నడుస్తుందా ? ఒక వీథిలో ఒకాయన దెబ్బలాట ప్రారంభించి, ఏమిటని అడిగితే "నాయిష్టం" అన్నాడు. ఇంకోఆయన "నీయిష్టం నీయింటిదగ్గిర, పోవోయ్!" అన్నాడు. అప్పుడు మొదటాయన, "నాయింటిదగ్గిర నా యిష్టం నాకు తెలుసు గనక దెబ్బలాడతాను, నాయిష్టం ఇది వీధి గనక పబ్లిగ్గా దెబ్బలాడతాను, నా యిష్టం!" అని యింకా దెబ్బలుతిన్నాడు ఏమయితేం గనక, ఎక్కడపడితే అక్కడ ఎవడియిష్టం వాడిదేనా, ప్రతీవాడియిష్టం ఒప్పేనా ? ఒక అంఖడమైన సంతర్పణ జరుగుతూండగా, పోపుల ఘుమా యింపు వీధివీధీ వ్యాపించగా, బారులు తీర్చి కూచుని జనం ఆరగిస్తూండగా, ఒకవ్యక్తి "ఏముంది ఇందులో ! ఈభోజనం నాకు రుచించలేదు నాయిష్టం, నారాజ్యం. నేను మన స్సాక్షిగానే చెబుతున్నాను ఏడిసినట్టుంది. నాకు అల్లా అని పిస్తోంది. నాకు అల్లా అనిపించకూడదు అని ఏమన్నారూల్సా ?" అంటా డనుకోండి. ఆతగాడి త్రికరణశుద్ధి రుజువు చెయ్యడం అసాధ్యమే కాని, వాడి రుచిప్రమాణం చాలా హెచ్చుతగ్గుగా ఉందని మాత్రం అనచ్చు. వాడు సుస్తీ మనిషిగాని, కాయిలా మనిషిగాని, దీర్ఘరోగి గాని, అసూయాపరుడుగాని,

దాంభికుడుగాని, అన్యాపేక్షగలవాడుగాని, అప్పుడే మొక్క-వచ్చినవాడు గాని, తిండికి వేళవాళలు లేనివాడుగాని, ఆ పదార్థాలు జీవితంలో తెలియనివాడుగాని, స్థితప్రజ్ఞుడు గాని అయిఉండాలి. నాకు రుచించని ఒకవస్తువు ఇతరులకి రుచించి తీరాలని ప్రయత్నించడం మూర్ఖత్వం. ఇతరులకి కూడా ఎందుకు రుచించకూడదు — అని అనుకోడం దురాశ. ఇతరులకి కూడా రుచించదు గదా అనుకోడం బుద్ధి తక్కువ. ఏమంటే, అది ఇతరుల్లో కొందరికి మిక్కిలి రుచి కరమైనదే అయిఉండవచ్చు, లేదా సకలజనులూ కూడా అస హ్యించుకునేదై ఉండవచ్చు మొదటిసందర్భంలో ఆ వస్తువు మీద నేను ద్వేషం పెంచుకోరాదు ఎన్నెన్నిమాట్లో రొట్టలువేస్తూ, ఎంతో రుచికరం అని మెచ్చుకుంటూ, ఇతరులు ఒకవస్తువుని ఆరగించేటప్పుడు, పక్కన నేను వైరాయించి, అది నాకు రుచించకపోయిన కారణంవల్ల, తింటూన్నవాళ్ళ సమక్షంలో, నాకు హక్కుండదుగదా అని చెప్పేసి నేను డోక్కోడం ప్రారంభించడం ధర్మంలా కనబడదు. తినాతినక, తినాలియ్యక కంగాళీ చెయ్యడం మానవేతరమైన లక్షణం. కాని, అంతమంది తినేస్తూన్నది మేడిపండు గదా అనే సంగతి వాళ్ళల్లో ఏ ఒకడికి తెలియక, నా ఒక్కడికి మాత్రమే తెలిసి ఉండడం సంభవిస్తే, అనేక ప్రాణరక్షణకోసం నేను అడ్డుపడ వలసినమాటే ! అంత అహంభావత్వానికి అవసరం నాకు ఉందని తోస్తే అల్లా చెయ్యనూవచ్చు ! ఏమైతేం, అదృష్టవశం

పైగా ప్రాణాపాయకరం అయినవస్తువులు రుచికరం కాక ప్రేమ, కాని, గత్యంతరంలేకో కూడా కూడిఉండడంవల్ల, ప్రతీ మానవుడూ తను తినేవస్తువుల్లో ఏదోరుచి ప్రమాణం ఏర్పరుచుకునే వ్యవహరించడానికి వీల్లున్నాయి, వ్యవహరిస్తూ ఉంటాడు వాసనఅంటే జ్ఞాపకంవచ్చింది. రుచులన్నీకూడా వాసనమీదే ఆధారపడి ఉన్నాయని ఒకవాదంఉంది నమ్మవచ్చు. ఎవరికేనానమ్మకం లేకపోతే, మిక్కిలిరుచికరం అని తమరు నమ్మేవస్తువులు తమరు తినేటప్పుడు కాస్సేపు తమరు ముక్కు మూసుకుంటే పైవాదం బోధపడుతుంది ఎవరికేనా నూతనపదార్థం తినడానికి ఇచ్చినప్పుడు వాడుముందు వాసనచూసి తరవాతే నోట్లో వేసుకోడం అందుకనే! మొత్తంమీద, భౌతికరుచులుగల వాళ్లల్లో, వంకాయకూర ఫస్టూ, ధప్పళం బెస్టూ, పులావ్ నెంబర్ వన్ అంటూ వేర్వేరుగా మెచ్చుకున్నా వాళ్లందర్నీ ఒకతరహాలోనూ, కుళ్లు అన్నం ఫస్టూ, బూజు ఊరగాయబెస్టూ, ఉచ్ఛిష్టం నెంబర్ వన్ అనేవాళ్లందర్నీ మరోతరహాలోనూ కట్టతీరాలి.

ఇక్కడ నిదానించి రెండుసంగతులు గమనించాలి. లోకం అంటే (రుచినిమిత్తం) మనుష్యులే అన్నాం మనిషికి శరీరమే కాకుండా మనస్సూ, ఆత్మాకూడా ఉండాలి, జిహ్వాకాకుండాముక్కూ, కళ్లూ, చెవులూకూడా ఉంటాయి ముక్కు పొడుంపీల్చడానికి మాత్రమే అనిన్నీ, కళ్లు ఎందుకంటే మూసేసుకుని భోంచెయ్యడానికనిన్నీ,

చెవులు ఎందుకంటే భోజనానికి రమ్మంటున్నారేమో అనే సంగతి వినడానికనిన్నీ అపసమర్థించి పారెయ్యడం మానుషం కాదు ఉల్లిపాయ, ఇంగువ, సంపెగ, పనసవంటివాట్ల విడి సుగంధాలు బ్రహ్మాండంమీద కనిపెట్టేవాళ్లు చాలామంది ఉన్నారు రాతిముక్కులు కలిగి ఏబాధాలేనివాళ్లున్నారు. బస్తీవాసనకి మరిగినవాళ్లుకొందరు గ్రహించగల సువాసనలు ద్వివచనంలోకూడా ఉండేటట్లుతోచదు కాని ఘ్రాణేంద్రియానికి సంబంధించిన అభిరుచులు గలవాళ్ళు జపానులో విస్తారంగా ఉన్నారనిన్నీ, సుగంధమిశ్రణాలు చెయ్యడం జపానులో ఒక గొప్ప నాసికాకళ అనిన్నీ తెలుస్తుంది జపానీయులలో కొందరు గంధరుచిలో ఆరితేరినవాళ్లు రెండుమూడు వందల మిశ్రణ సుగంధాలు పోల్చగలరట — గానరుచి గలవాళ్లు రెండుమూడు వందల రాగాలు పోల్చుగున్నట్టు ఆలాగే నేత్రాలవల్ల వర్ణ రూప చిత్ర శిల్ప నిర్మాణాల సంగతి గ్రహించేరుచి మానవుడికి ఉండాలి, చిన్నప్పుడు రంగుబొమ్మలంటే శిశువుకివుండే ఆసక్తే దానికి ప్రాతిపదిక. బొమ్మరిల్లు కట్టి ఆడినప్పటినించీ శిల్పం అంటే మానవుడికిరుచి మెత్తని గూడు కట్టుకోగల పక్షులకే ఆప్రజ్ఞేసహజంగావుంది. మానవుడు ప్రకృతిలో దృశ్యాలూ, మానవకల్పిత చిత్రాలూచూసి ఆనందించగల రుచి పెంచుకోవాలి అది రంగులతో సంబంధించిన కళగనక దాన్నిగురించి మాటలు ఎన్ని చెప్పీ లాభంలేదు జీవకళ లేని బొమ్మల్నీ, సంకరజాతిచిత్రాల్నీ, పచ్చిబోడి కళ్లురకం

పటాన్ని, పెంటకొండన్ని, మురుగుప్రవాహాన్ని చూడడంలో ఎవడికేనా అభిరుచిఉంటే అది కేవలం నాసిరకం అభిరుచి అని చెప్పడం తప్పుకాదు

ఇక్కడ ఒక ఉపవిషయం! ధర్మ అర్థ కామ మోక్షాలు అనే పురుషార్థాలయందు అభిరుచి ఉండడంన్యాయంగదా అని పెద్ద లంటారు, పిన్నలు వింటారు, 'పోదురూ' అంటారు. (ధర్మం అనేమాటకి సంస్కృతంలో ఉండే అర్థం తెలుగులో సాధ్యార్థంకాదు. ధర్మం అంటే శాస్త్రాచార విహితమైనదాన్ని ఒట్టి మానవుడు ప్రపంచంసాగడం నిమిత్తం చెయ్యవలసిన పని, ఆపనియొక్క నిర్ణయవాక్యం అవి సంస్కృతంలో. దానం అని తెలుగులో. తెలుగులోకదిగిన సంస్కృతపు మాటల గురించిన నిఘంటువుల్లోకూడా తెలుగులో ఆమాటలకుండే సాధ్యార్థాలు ఇచ్చిఉండకపోవడం అధర్మం). ప్రస్తుతకాలంలో చాలామందికి అర్థకామాల్లో మాత్రం అభిరుచిఉన్నట్టు తెలిసిపోతుంది. అవి రెండూ భౌతికమే. అవిగాక నాగరికతయొక్క మహాత్మ్యంవల్ల ఆకస్మిక గౌరవాభిరుచి, అధికారాభిరుచి, పోషణాభిరుచి, ప్రచారాభిరుచి, సౌకర్యాభిరుచి, సద్యఃఫలితాభిరుచి, ఆశ్రయత్వాభిరుచి, పరభృతత్వాభిరుచి, సగౌరవ తస్కరణాభిరుచి, సవినయదంభాభిరుచి, మరి యింకా ఇటువంటివి ఎన్నెన్నో పుట్టించుగుని, బలవంతంగా లాక్కుని తెచ్చి పెట్టుగుని, పెంచుగుని, పోషించుగుని అవన్నీ కాంతా

కనకాలనిమిత్తమే అని జనసామాన్యానికి బోధపడకుండా నక్కవినయాలూ, సమయానుకూలనటనలూ చేస్తూ, కేవల మోక్షార్థులై ధర్మాచరణకి ఉద్యుక్తులైనట్టు కనిపించే మానవులు తక్కువగా ఉన్నారని భయపడవలసిన అవసరం లేదు. దేవుడు పెట్టే బుద్ధిపారవశ్యంలో తమకి మానవజన్మ ఇవ్వడం అధమం ఒకటి అని దేవుడి సమక్షంలోనే రుజువు చెయ్యదల్చుకుంటూ, ఇటువంటి బుద్ధిమంతులే అని చెబుతారు మరి!

శ్రవణేంద్రియానికి సంబంధించిన శబ్దాలతోనే ఉండే శాస్త్రాలయందు అభిరుచి ప్రశంసనీయం. ఆ అభిరుచి కలగడానికి బుద్ధి శ్రద్ధ, అభ్యాసం అబ్బగనక అది అందరికీ అలవడదు. కాని, హృదయం ఉంటే సరిపోయే గాన కవిత్వాలనుగురించిన అభిరుచి సర్వజనసాధ్యం. అభిరుచి అంటే ప్రజ్ఞ కాదు. ఒక విషయంలో ప్రజ్ఞ అందరికీ లేకపోవచ్చునుగాని అభిరుచి అందరికీ ఉండవచ్చు. గానంలో జంత్రగాత్రాలు, కర్ణాట, గవాయి, హిందూస్థానీలు, శాస్త్రీకట్టు, గాలిపాట, డ్రామా స్టయిలులు, శ్రుతి లయ రాగ తాళ కీర్తనలు విరివిగా పెంచి గమనిస్తే అభిరుచులు వేనవేలని తేలగలదు. వాటిలో వీణాదివాద్యాలు చెయ్యబడ్డప్పుడు, భజనతత్వ కీర్తనలవంటివి సార్థకంగా గానం చెయ్యబడేటప్పుడూ వినాలనే అభిరుచి ఉత్కృష్టం, దివ్యం! కాని, పశుశృంగారపు వర్ణనలతో ఉండే పచ్చి జావళీలు వినాలనేది భౌతిక అభిరుచి.

ఇక కవిత్వంగురించిన అభిరుచులూ మిక్కుటమే.

తటస్థ - నీతిబోధక, శ్రోత్రియ - సాంసారిక, శాశ్వత - తాత్కాలిక, స్వీయ - పర, సనాతన - ఆధునిక, గ్రాంధిక - వ్యావహారిక, ముద్రిత - లిఖిత (స్వ - పర), జనప్రియ - అపరూప, సచిత్ర - చిత్రరహిత, గ్రంధస్థ - పత్రస్థ స్థితుల్లో స్వ - పర భాషలలో ఉండే పద్యగద్యాభిరుచులు. పద్యవిషయంలో పురాణ ప్రబంధ శతక దండక చంపూ కావ్య గేయ చాటు ఆశు మొదలైన రకాలలో ఛందోభేదాలతో ఉండే నాద పద అర్థ భావ అలంకార సందర్భాల గురించిన రుచులు గద్య విషయంలో మనన కథన వర్ణన భాషణ రూపాలలో లేఖ వ్యాస చరిత్ర నవల విమర్శ మొదలైన భేదాలలో ఉండగల రుచులు. ఆపైని, కర్త, గ్రంథం, గ్రంథభాగం మొదలైనవాటినిగురించి చదివేవాడు విద్యార్థి, పాఠకుడు, పారాయణ చేసేవాడు, కాలక్షేపం చెయ్యదల్చినవాడు మొదలైనవాటిని పురస్కరించుకుని రుచులు ఎక్కువగా ఉండగలవని చెప్పవచ్చు. ఇటువంటి రుచులన్నీ సమంజసములే, సదభిరుచులే, గొప్పవే అన్ని రచనలమీదా అందరికీ అభిరుచి ఉండదు, ఉండడం సహజంకాదు ఇద్దరి అభిరుచులు వేర్వేరు అయినప్పుడు ఆశ్చర్యపడకూడదు, ఒకర్ని ఒకరు తేలికగా చూసుగో నక్కర్లేదు సరిగదా, ఏకీభవించినప్పుడు చాలా అద్భుతపడి ఆనందించుకోవచ్చు. కాని, హృదయంమీదగాని, బుర్రలో గాని వేసుగో కుండానే రుచి లేదనో ఉందనో చెప్పేవాడూ, పిండినా, పిండి

పెండి అయినా తడికక్కని పాషాణరచనని చప్పరించకుండానే మింగేసి మహారుచిగా ఉందనేవాడూ, గతించినవాడి కవిత్వంగనక 'రుచివంతం' అనేవాడూ, వీలునుబట్టి తన కుటుంబ, తన శాఖ, తనవర్ణ, తనజాతి, తన భాష తన దేశ రచనకాబట్టి "రుచిగానే ఉందిస్మీ" అనేవాడూ, వేడి వేడిరచన ప్రతీదీ రుచివంతం అనేవాడూ (అసలుఅప్పట్లో రుచే తెలియదు నిజానికి!) తన శత్రువురుచి కనుక్కుని దానికి భిన్నంగా ఉండేదే తన రుచి అనే వాడూ - వీళ్ళంతా సుస్తీగా ఉండే రుచులు గలవాళ్ళే. అల్లాంటి దగాలకే పడిపోయినవాళ్ళని కాలం తిన్నపరుస్తుంది. వాళ్ళు నిమ్మళంగా అన్యాలు కనిపెట్టకుండా అభిరుచిమార్చుగోవలి సొస్తుంది. మార్చుగుంటారు. అందుకని ఏగొడవాలేకుండా కాలంచేత మన్నింపబడ్డ తెలుగుమహాకవుల రచనలంకో అభిరుచి కలిగించుగోడం సాధారణ తెలుగు మానవుడి ధర్మం. ఆరీతిగా మానసిక ఆనందం గలిగించే ఉత్కృష్ట అభిరుచులు లేని మానవజన్మ వ్యర్థం, ఉసూరుమనే రకం, దివాలా సరుకు! ఇది కాక, జీవుడూ, జీవితరహస్యమూ గురించిన అభిరుచి కూడా ఆత్మానందం ఇచ్చేదిగనక మానవజీవితానికి ముఖ్యాతిముఖ్యం. వీటి అన్నింటిలోనూ కూడా, అవతల రచయిత ప్రసాదించేగరి రసపద్యస్తువు కావలసిన అవసరం ఎల్లాగైతే ఉందో, అల్లానే పాఠిక తడిగలది అయినట్టుగా హృదయం తడిగలదైఉండాలి. అప్పుడుగాని రుచీ ఉండదు, రచీ

ఉండదు. ఇతరసుగుణాలలాగే సదభిరుచులు పెట్టిపుట్టాలి. అవి సన్మార్గంలో అభివృద్ధిచేసుకోనూవచ్చు ధనం, కాలం స్వల్పంగా అందునిమిత్తం త్యాగంచేసి దీక్షగా అభ్యసించడం చాలు. ఏకొంచెమో ఏదో త్యాగంచేసి సంపాదించుకుంటేగాని ఏదీ రుచించదు. అభిలాషతో, ఆసక్తితో ఆ ఆచరణలో ఉండి, ఆగాలే పిలుస్తూ త్రికరణశుద్ధితో ప్రయత్నించి తన భాషలో అన్ని వేలరకాలలో ఏబాపతో ఒక బాపతు కవిత్వం అంటే అభిరుచి ప్రతివాడూ పెంచుకోవచ్చును! అటు వంటి ప్రతివానికీ కేవల భౌతికరుచులేకాక, మానసిక ఆత్మిక అభిరుచులు ఉంటాయి గనకనే, పూర్వమహాగ్రంథాల్లో చిన్న చిన్న ఘట్టాల చివరా, ఉపాఖ్యానాల చివరా "ఈ కథ, ఈ ఉపాఖ్యానం, ఈ సంవాదం ఎవడేనా శ్రద్ధతో విన్నా, తనకోసం చదువుకున్నా, ఇతరుల కోసం పఠించినా, వ్రాసుకున్నా, వ్రాసిపెట్టినా మోక్షం ఉంటుంది" అనే మాస్తరుగా చెప్పి ఉంటుంది. ఆ ముక్కలు మానవుడికి ఉండగల మహత్తమఅభిరుచిని మెచ్చుగునేవిగనక, శిలాక్షరాలు. ఇంకా ఏమంటే, ఆమనిషికి కేవల సరవం కానటువంటి ఉత్కృష్ట అభిరుచి కలుగుతుంది గనక ! ఏమిటీ ఆ అభిరుచి ఫలం ? సచ్ఛీలమే, అది పురుషార్థం కావచ్చు గదా ! ఒక మహామహుడు చెప్పిన సందేశం ఇది.

"అభిరుచి ఒడ్డ, మోటు, సున్నితం అవడాన్ని ఒట్టి జీవితం అసారం, పాశవం, దివ్యం అవుతుంది. ఒక

సామ్రాజ్యానికి మొద్దుస్వాభావపురాజుగా పుట్టేకంటే దరిద్రుడైనా సదభిరుచులు కలవాడుగా పుట్టడం వెయ్యివేలు. దేవప్రసాదమైన ఈ అభిరుచి వరంలేకపోతే, ఎంత అదృష్టవంతుడట కానీ, సౌఖ్యం ఎక్కడ?"

స్థాయి మారినా వోటే పాట!

వోటుకి కొత్త అర్థాలు వస్తూనే ఉన్నాయి. వోటంటే నిలబడ్డవాడు పడిపోకుండా ఉండడానికి ఇతరులు పెడుతూండే 'బోటు' అని ఒక 'నబయోరభేదః' గారు అన్నారని తెలిసింది. వోటంటే భూమిమీద ఏస్థలంలోనైనా నరే ఒకే తూనిక కలిగి ప్రత్యేక మానవవ్యక్త్యభీష్టాన్ని సూచించే నిర్గుణబ్రహ్మం అని మరొకరి అభిప్రాయం. జంతువుల గురించిన వోట్లున్నా వాటి మీద లాభం మానవులే సాధించుకుంటారు. రాజకీయ సంబంధపు ఎన్నికల్లో హిరణ్యం, రజతం, తామ్రం, లోహం, భూమి, లవణం, ద్రవ్యం, రసం మొదలైనవి వోటు దానానికి నిమిత్త కారణాలు అవుతూంటాయి. విద్యావిషయిక మైన ఎన్నికలలో గౌరవాధికార పరిచయ బాంధవ్యాలతో కూడిన భాషాసాధనాలు చాలామట్టుకి మొహమాటం లేకుండా పనిచేస్తాయి. వోటువ్యాపారం రెండు దృక్పథాల్నించి చూడాలి ఒకటి – అభ్యర్థి అనబడే వోటర్థి గమనించేది. రెండు – వోటు దానం చెయ్యగల వోటరు అనుకునేది. ఒక వోటర్థి అనుభవానికి నమోనా ఇది.

* * * *

"ఎప్పుడు ఎన్నికలు పెట్టినా ఎవరో ఒకరు నెగ్గుతూంటారు. అల్లానే కొందరు నెగ్గారు. వాళ్ళలో ఒకాయనభార్య మా ఆవిడతో మాట్లాడ్డంలో మాఆవిడకి చాలాచిన్నతనంగా ఉండే

టట్టు తనభర్తయొక్క విజయవైభవం వర్ణించుకోడం మొదలెట్టిందట! నాకున్న సుగుణ సంపత్తికి శిఖరంగా ఎన్నికల్లో విజయంకూడా ఉంటేగాని తీరని లోటు కనిపిస్తూనే ఉంటుందని నాకు మొదట్లో సవిచారంగా ఉపదేశించింది మాఆవిడే. తరవాత నా ఆంతర్య స్నేహితుడొచ్చి నాకుగల మహాత్యంతో నిష్కామంగా మానవసేవ చెయ్యడానికి నేను నడుంకట్టినట్టు తక్షణం ప్రకటించక పోడం అనేది ఆంధ్రదేశానికి అరిష్టహేతు వన్నాడు. ఇంతలో మా యింట్లోవాళ్ళూ, స్నేహితులూ, నాకళ్లాకూడా నాఅంతవాడికి ఓగొప్పపదవి ఉంటేగాని రాణింపే ఉండదన్నారు. దాంతో, నాకు, బాధ్యతలేని ఆ గౌరవస్థానం ఎప్పుడు ఆక్రమిస్తానో గదా అనే ఆరంభస్పృహ కలిగింది.

అభ్యర్థిని నేనొక్కణ్ణే అయితే తీరిపోదూ? తప్పకుండా నాకోరిక సిద్ధించేదిగా! కాని యింతమాత్రము ఆలోచనేనా లేక, దుర్మార్గుల సలహాలకి లొంగిపోయి మరో అయిదు గురు — మాంచి రాళ్ళంటివాళ్ళు — ఆపదవికే, నామీద పోటీచేస్తూ నిల్చారు. ఎంత కక్కుర్తో చూడండి. నేను వాళ్ల మీద చెయ్యవలిసొచ్చిన ప్రచారంలో ఉండే రసికతా, నామీద ఆ వోటర్థులు వొట్టిపుణ్యాన్ని సాగించుతోచ్చిన దుష్ప్రచారంలో ఇమిడిఉన్న కుళ్లూ నేను జనానికి బోధపరుచుగు రావడంలో కొంత నవ్వులాట బయల్దేరింది. పైకి చేసే ప్రచారంబట్టే (అనగా, చెవులు చిల్లులుపడేటట్టు వాయించుతూండే రుంజాల్ని

బట్టి) జనబాహుళ్యం నమ్ముతుంది, ఆ ప్రచారమే నేర్పుగా చేసుకోవలసింది అని నా ఆంతర్యస్నేహితుడు నాకు కిటుకు చెప్పనే ఉంచాడు. అల్లాగే బోధించేవాళ్ళు వాళ్ళకి ఉంటూ చ్చారు గావును. ప్రచారవిషయంలో ఓడి కోడు తీసిపోయివాడు మాలో లేనే లేడు. ఓం ప్రథమం నేను అరువుసామ్రాగ్రా తెర సామ్రాగ్రా పెట్టి ఎన్నికల్లోకి దిగానని ఓ అభ్యర్థి నన్ను ఏకడం ప్రారంభించాడు. దానికి జవాబుగా వాడికి అల్లాంటి సామగ్రి లేనా దొరకేమాత్రపు పరపతేనా లేదనిన్నీ, వాడు తిరిగి ఉన్న కాస్త ఆ స్త్రీకూడా అక్రమంగా వేసేసుకున్న దనిన్నీ నేను యథార్థం చెప్పెయ్యవలసి వచ్చింది. మరో అభ్యర్థి నాకు పలుకుబడి లేదని ఆక్షేపించాడు. వాడికి పలుకుబడి కాదు రాబడికాని, అసలు ఏబడిగాని లేదని నేనుఅనేసి వాడికి వాగ్బంధం చేసేశాను. జాతిమతాభిమానాలు అల్లా ఉండగా శాఖాంతరాభిమానాలు తప్పి పైకిత్రోడి, (ఏ అంతశ్శాఖకి ఎవరు చెందుతారో తెలిసేది ఎన్నికల్లోనే) వాటిబలంతో నేను జనాన్ని నావైపు తిప్పుకుంటున్నానని ఇంకోడు దండోరా సాగించాడు. ఆ మాత్రం శాఖాభిమానంకూడా ఉండకూడ దనేవాడు తనశాఖని మట్టుకి ఏమంత ఉద్ధరిస్తాడూ, వీడు వోర్తి డాబుల్రాయుడూ, వీణ్ణి నమ్మొరుగనకా — అంటూ వాడి శాఖవాళ్ళల్లో ప్రచారం నేను చేసి, వాళ్ళు నాకు అనుకూలించకపోయినా వాడికి ప్రతికూలించేలాగ చేసేశాను. మరో పోటీదారు నాకు తెలివితేటలు సున్నా అనిన్నీ, నేనే

గనక పదవిలోకి వెడితే అక్కడ మట్టి విగ్రహంలా కూచో వాలిగాని మరోపని చెయ్యడానికి చాలరనిన్నీ అన్నాడని నాకు సూఛీవార్త తెలిసింది. ఒకరి తెలివితేటలమీద ఇంకోరు రిమార్కు చెయ్యగానే ద్వేషం అంకురిస్తుంది, వెనకే ద్వేషం ఉంటే అది ఘనీభవించి ఛాయపడుతుంది. అసలు నాఅంత తెలివిగలవాడిమీద అవతలవాడి తెలివి తక్కువ విసుర్లు! నాకు చిరునవ్వు చక్కా వచ్చింది. ఆమర్నాడు, అవతల అబ్బి అక్కడక్కడ తన తెలివి కుమ్మరిస్తున్నాడట, ఓటంథజనమా! మోసపోవద్దూ, ఆ అభ్యర్థి ప్రవర్తన హేయం, వారి శీలం దుర్భరం, వారి వాలకం రాక్షసం, వారిని ఆ పదవిలోనికి రానిస్తే దేశానికి కీడు మూడిందన్నమాటేనూ! - అంటూ ఎంతో బాధపడుతూ, తప్పనిసరివల్ల నేను రహస్య ప్రచారం చేయించవలిసొచ్చింది. వేరే ఒక పోటీదారు నామీద ప్రతికూలప్రచారం చేస్తూ నేను ఈసరకే విజయానికి ఆశవదులుకున్నాననిన్నీ, నాకు విజయంకంటే అపజయం అంటేనే ఎక్కువ మక్కువ అనిన్నీ స్వాపజయంవల్ల జవితసమస్యా, మానవ స్వభావమూ గ్రహించవల్చుగున్నాననిన్నీ, ఈమాటలు పబ్లికలో చెప్పేశానననిన్నీ ఉపన్యసించి జనాన్ని నావేపునుంచి లాగేస్తున్నాడని తెలిసింది. అవన్నీ బాలసతత్వంవాళ్ళ ఊహలనిన్నీ, నేను (ఒకవేళ) ఆయినపొమ్మర్క్, నశించిన ఆస్తికీ, ఉడిగిన శక్తికీ, పడ్డ శ్రమకీ, తగులడ్డ కాలానికీ ఆశవదలు

కున్నా విజయంగురించి ఆశపడలుకోననిన్నీ, అల్లా నేను
పైకికూడా అశేశా ననడం మానసికతత్వంయొక్క అజ్ఞా
నానికి సరియైన ఉదాహరణ అనిన్నీ ఝూడించేసి వాడి
ప్రచారాన్నీ వాణ్ణీ కట్టేశాను.

నేను నాలుగైదు సార్లసించి నిలబడి చూస్తున్నాననిన్నీ,
అంశస్టుదలా ఓపికా ప్రత్యక్షంగా కనపరిచినా వోటర్లు
నన్ను ఎన్నుకోజాలకపోడం అనేది దేశదౌర్భాగ్యం అనిన్నీ
రాస్తూ, ఆ రచనలో ఎక్కడోఓటములా అస్తమానం ఒకే
ఫలానావ్యక్తి నెగ్గాలని ఎక్కడేనా ఉందా, పదవికి ఒక డంటూ
పుస్తెకట్టేనా డుంటాడా, అందుకని పాడిందే పాడరా
అన్నట్టు వెనకటవాళ్ళనే ఎన్నుకని తరుణం తగలేసుగో
కండి, రకం పెరాయిస్తూండడంలో సబబుందని ప్రకృతి
చెబుతుంది, పాతరకాలు పోవడంలో శ్రేయస్సుంది అంటూ
ఒక ప్రకటనలో దంచాను దాంతో ఒకపోటీదారు చెల
రేగిపోయి, నాకు సమాధానం చాలా ఏడిసినట్టు రాస్తూ
"అస్తమానమూ తెలివి నీకే ఎందుకూ, ఇంకోడికి బదలా
యించు! ఎల్లప్పుడూ డబ్బు నీకుటుంబానికే ఎందుకూ, తక్షణం
మరోడికి ముట్టచెప్పు! ఎల్లకాలమూ పాండిత్యం నీలోనే
ఎందుకూ ఇతరుడికి ఇంజెక్షన్ ఇచ్చేయ్! ఏళ్లతరబడి
సౌందర్యం నీలోనే ఎందుకూ, మరోడికి దఖలుపణ్ణే!"
అంటూ రాసి, నామీద అతనికి ఉండే ఈర్ష్య యావత్తూ
కక్కిపోసుగున్నాడు. అధికారరీత్యా ఒకపోటీదారు ఒత్తుకు

చేసి నా బంధువుల్ని కొందర్ని గుండకొడుతున్నాడని నేను ప్రచారంచేశాను. ఆమీదట నాబంధువులు వోటు ఎవరికి వేశారో నాకు తెలియదు చెప్పలేనుగాని, వాళ్ల ఉద్యోగాలు లేచిపోయాయి. కొందరు వోటర్లని తాగించి మతిలేకుండా చూసి ఆ మతిలేని వోట్లు నేను ఆర్జించుగున్నానని మరో వోటర్థి మొదలెట్టాడు సరి ఆ అభ్యర్థి అసలే మతిలేనివాళ్లనీ, మతిగురించి సందేహమే లేనివాళ్లనీ, చచ్చిపోయినవాళ్లనీ, మిథ్యాజనాన్ని పడగొట్టించి తనపక్షం పలికింపించుగున్నాడని నేను బయటపెట్టేశాను.

ఈకోలాహలం బహిరంగంగానే జరిగిపోతూండేది. కాని ఒంటరిగా ఉన్నప్పుడు రాత్రిళ్లు కన్ను మూతపడేదికాదు. అన్నం సయించేదికాదు, అన్నానికి వేళే తెలిసేదికాదు. ఒక్కొక్కప్పుడు చిమ్మే సొమ్మూ, పడే మాసికలూ, చేసే ఏర్పాట్లూ, బనాయించే ఉత్తరాలూ, పట్టుగునే కాళ్లూ, ఖర్చుపెట్టే స్తోత్రాలూ, ఇచ్చే వాగ్దానాలూ, కప్పెట్టుగునే లోట్లూ, అభినయించే వినయమూ జ్ఞప్తికివచ్చి, "అయ్యో! ఎందుకో గదా ఈ హోమం! నేను వెళ్లి ఎక్కడ ఆహుతి అయిపోతానో గదా! స్వంతపనిమాని సంతలోజేరి నేను చెయ్యగల లోకపరివర్తన ఏముట్టో గదా! అవిచ్ఛిన్నంగా ఒకానొక అజ్ఞాతకర్మ గురించి నాజీవితం ధారాదత్తం చెయ్యడానికి నా ప్రస్తుతపు సంసారబాధలు ఎల్లా దిద్దుకోగలనో గదా! ఈ నడమంత్రపు గౌరవం నిమిత్తం, ఈ అవాస్తవ

అధికారం నిమిత్తం ఈమాయాదారి పడుగు నా కెందుకొచ్చిందీ! అధమం ఈసొమ్ము ఏ బీదసాదలకేనా పాత్రత చూసి దానంచేస్తే తీరిపోయేది!" అనిపించి, నేను బావురుమని ఏడుస్తానా అన్నంత విచారంకలిగి, నేను పైకికూడా అట్లా కనిపిస్తే నాపక్షం శ్రమపడే కాసినిమందికూడా ఎక్కడ మాయం అవుతారో అనే భయంచొప్పున ఆ శోకం లోపల లోపలే కాలిమ్చుగుని, ఒంటరిగా ఉన్నప్పుడే పూర్తిగకూడా చేసుగుని, ప్రజల్లో పడుతూండేవాణ్ణి

అంతలో శకం మారినట్టు అనిపించేది. ప్రతీ ఇతరఅభ్యర్థీ నన్ను చిన్నపరచడమూ! అల్లానా తను పెద్దరికం దాఖలా పరుచుగోడం? నేనేం తక్కువతిన్నానా, తక్కువ తూగుతానా! మనిషైనప్పుడు లక్ష లోట్లుండవచ్చు, ఉంటాయి. ఉంటే? చూసేవాళ్లు లేరాగాని ఈ యితర అభ్యర్థుల్లందర్నీ చుట్టబెట్టినా నాకు సమంకాగలరా? నావైఖరి గాని, రీతిగాని, చివరికి రోషంగాని ఏ ఒకడికి ఉందీ! నాసిరకాల్ని పైకి లేవనెత్తి నెత్తిన ధరించి, పాలించమని వాళ్లని హయాంలో పెడితే అన్యాయంగా దేశం తగులడిపోతూంటే చూసి చూసి ఊరుకోలేక, రోషపౌరుషాలు అనాదినించీ ఉంటూన్న వంశంలో ఉద్భవించిన మణిపూస వంటివాణ్ణి గనక నేను ఇందులో ప్రవేశించానుగాని, లేకపోతే నాకేం పట్టిందీ? నా నిలువెత్తున ధనంపోస్తేమాత్రం ఇందులోకి జొరబడతానా? అసలు నాలిక తెంపుగుంటే మాత్రం దర్శనం

ఇస్తానా? అంతరోషాన్ని హాలాహలాన్నిలాగ దిగమింగి, అభాగ్యులూ, అజ్ఞానులూ, అనామకులూ, అనర్థులూ అయిన జనందగ్గిరికి వెళ్లి వాళ్లని మన్నించి వాళ్లని దేహి అని వోటుభిక్ష నోరువిప్పిఅడిగి, వాళ్లలో కొందరికి ఉత్త రాలు రాయించి, జ్ఞాపకంచెయించి తంటాలుపడడం ఎందు కంటారు? "రోషంగల వ్యక్తినయ్యా! నన్ను అసలు మీరు కాళ్లు పట్టుగుని బతిమాలు కోవలసిన మాట. అది మీకు తెలియకపోబట్టి ముందే నేను చేసిచూపిస్తు న్నాను. దేశంకోసం ఎంతరోషమేనా చంపుగోవాలి" అని జనానికి తెలియడానికి

ఏజెంట్ల దగ్గిర్నుంచి వచ్చేటపా చూసినప్పుడు నాకు చాలా ఉషార్‌గానే ఉంటుంది "ఈడూళ్లో మనపని మాంచి నిమ్మ కాయవాటంగా ఉంది ఇక్కడమీకు వోట్లు దొంగలదోపిడిగా వర్షిస్తున్నాయి. సరిగ్గా లెఖ్ఖ తేల్చుగునేసరికి నాకుతాడు తెగిపోతోంది. మందేవిజయం! కడమ అభ్యర్థులు గోలా ఏడు పూనూ! మన పెళపెళ వినేసరికి కొందరికి గుండెజబ్బూ, కొందరికి రక్తపోటూ పట్టుగున్నాయిట. మళ్లీరాస్తాను" — "ఇక్కడ అంతా నమ్మకస్థులే. మీపేరు ఇక్కడ మంత్రంలా పనిచేస్తోంది. సొమ్ముఎవమ్మైనా సరే జంకవద్దని తమరుఅన్నారు. దుమ్మెమ్మైనానరే అనినేను చిమ్మేస్తున్నాను. విజయం మనకేసే చూస్తోంది. ఈవేళ గాకపోతే రేపాయిది మనదగ్గిరికి వచ్చి కాళ్లమీదపడుతుంది. మీరు కాళ్లురెడీగా ఉంచాలని హెచ్చ

రిస్తున్నాను" — "ఈఊళ్లో పెద్దల్ని దర్శించాను. మీరు నిలుస్తున్నారని వారు తెగసంతోషపడి ముందున్న ఊరే గించారు. వారందరూ మనిషితప్ప మరోమనిషికి ఒక్కవోటు కాదు వోటులో ఒక్కతోనేనా ఇవ్వంగాక ఇవ్వంఅని ఘోర ప్రతిజ్ఞలు ఎచటంలో చేశారు. కొందరు వద్దు మొర్రో అంటూన్నా వినక పెద్ద పెద్ద ఒట్లుకూడా పెట్టుగున్నారు సుఖం నెగ్గితీరతాం నాశ్రమ తమరు మరవకండి" — "ఇక్కడ చాలామంది తమవోటుపత్రాలు పంపడంఖర్చు కలిసిరావడానికనే కాక ఆప్యాయంకొద్దీ కూడా నాచేతికిచ్చేశారు మనం అనుకున్న వాటికంటె ఎక్కువే చేతికొచ్చాయి చేతికి అందొచ్చిన సంతానంవాడికి విజయం దక్కక ఎక్కడికి పోతుంది?" — "ఈ ఊళ్లో మనం అంటే ఉండే ఉత్సాహానికి మేరలేదు చాలామంది నిద్రాహారాలు విసర్జించారు. మనం మనదెబ్బ వాడేశాం అన్నమాటే! కడంపోటీదార్లు గొడ్డుచ్చుగుని శంకరగిరి మాన్యాలు అంటేశారన్నమాటే! మన దిగ్విజయం చేపడానికి ఏర్పాట్లు మీరు చేసెయ్యాలన్న మాటే! ఇప్పుడే చెయ్యండి, తరవాత సామ్ముకి ఇబ్బందేమో!"

అయినా, పైకి పటాటోపంగా నేను మాట్లాడి వ్యవహరిస్తూ ఉంటొచ్చినా, హృదయంలో నాకు చచ్చేభయం వేస్తూంటుంది. పోటీదార్లల్లో కొందరిదగ్గిర నాజూకుతనం బొత్తిగాలేదు. రౌడీల్ని కూలికిపెట్టి ఎన్నికలకిగాని, అసలుగాని

నేనునిలవడానికి వీల్లేకుండా కాళ్లువిరగ్గొట్టేస్తారేమో అని నాకు ఒక్కరవ్వ భీతి లేకపోలేదు కొందరు తుపాకులు తెప్పించి లైసెన్సు పొందారు పోటీలోంచి తప్పుకోకపోతే నాయిల్లు నున్నగా దోచేస్తాం అని కొందరు ప్రైవేటులో చెప్పించారు. ఇల్లాంటివి నేను లక్ష్యపెట్టను. ఒకవేళ ఏదేనా గ్రహం వక్రించి మనం ఓడిపోతే ఏందారిరా భగవంతుడా అని భయం వేస్తూంటుంది. ఆమాట తల్చుకుంటే నోరెండి పోతుంది, గుండె కొట్టుకుని దూకడం మొదలెడుతుంది, శ్వాస ఆడదు అయినా అదీ భరించవచ్చు నాకంటె సర్వవిషయాలా పరమచవటలని దేశంలో ప్రసిద్ధిపొందిన మరో పోటీదారు ఎవడైనా నెగ్గిపోతాడేమో అనే భయంనన్ను మరీ పీల్చి పిప్పిచేస్తోంది. ఆ సంగతి స్పృహలోకివస్తే నాగుండె ఆగిపోతుంది. అల్లాఆగిపోయినట్టు నామనస్సునాతో చెబుతూండడం నాకు స్పష్టంగా వినిపిస్తుంది, నాకు ప్రపంచం అంధకారం అనిపిస్తుంది, ఈ ఘోరాన్యాయం జరిగేటప్పుడు దేవుడనేవాడుంటే ఇతరపనులు మానుకుని రాడా అనిపిస్తుంది, ప్రజలు నన్ను గ్రహించలేక తమ అఘాతంలోంచి తేలినేలమీద పడి వృద్ధిపొందడం ఎంతకాలానికో గదా అనితోచి వాళ్ళకి రాబోయే దుస్థితి స్ఫురించి, నాకు చాలా హడలువేస్తుంది. కాని నేను ఏంజెయ్యను? నాచేతుల్లోపనా ఏమన్నానా? జనానికి దురవస్థ రానీకుండా కాయడంకోసం నేను నెగ్గడానికి యత్నిస్తూంటే వాళ్లు కలిసిరాకపోతే వాళ్లకి అంతేశాస్తి !

వాళ్ల సిద్ధాన్నంవాళ్లే తన్నుకుంటున్నారు? ఎవరు భయపడి ఏంలాభం!

సరే, జనాన్ని అల్లా అఘోరించనీండి, వాళ్లకే తెలుస్తుంది అనుభవించిన తరువాత! ఈపోటీవాళ్లల్లో ఎంతెంత నీచత్వానికి దిగేవాళ్లున్నారని తమఊహ! కడంవాళ్లంతా నాఅంత క్షేమేదాగా పోటీ చెయ్యకపోతారా అనుకోడం పామరత్వం రామరామ, నాపోలిక వాళ్లకొస్తే ఇహనేం కావాలండీ! అసహ్యం వేస్తుందండీ బాబూ, వాళ్లధములండీ! అధమాధముడిదగ్గిర వోటుంటేవాడికి గ్లాసు అందివ్వడం, వాణ్ణిశృంగారించడం — ఛీ, దిక్కుమాలినపన్లు! ఒకడు సైడుకాలవలో స్పృహలేకుండా పడుకునిఉంటే వాడివోటులాగి కడిగేసి పట్టిగ్రాహు ఒక పోటీదారు! అంతకంటే అసహ్యం ఉంటుందా? ఒకపోటీదారు వోటరింటిమీద కశ్మలం వేయించి, వోటులాగి క్షుభించి అంతటితో వాణ్ణే వొదిలిపెట్టాడు. ఎంత రోతో గమనించండి. ఎగ్గి నే చెయించానేమో చూడండి అల్లాంటిపన్లూ! చెయించలేకే! చెయిస్తే ఆగుతారూ వీళ్లూ! పోనీ, నాజాతకంగ్రహించి ఆయుర్దాయం గురించి ఒకపోటీదారు వాకబులో ఉన్నాట్ట ఆపని ఎంత హేయంచూడండి. నాయేజెంటు రైయ్యిమనికార్లో పోతూంటే ఒకపోటీదారు తనకార్లో ఎదురై మాకార్ని పిల్లిమంత్రాలు వెయించి మాయేజంటు రక్తప్రవాహాలై స్మారకం తప్పి పడిపోగా, హిహిహి అని నవ్వేట్ట! వాడిమనస్సుయొక్క రకం తల్చుగుంటే పేగులు

బద్ధలై పైకొస్తాయో రావో చూడండి రాత్రివేళ ఒక పోటీదారు వెళ్లి కొందర్ని తనపక్షం తిప్పుకుందాం అని ప్రయత్నించేటప్పుడు ఒక శత్రుపక్షంవాడెళ్లి వాడిమీద ఓగొంగళీ గిరవ శేసి కట్టేసి తీసిగెళ్లి కాష్టాల్లో పడుకోబెట్టాడట, ఎముకలు గుచ్చుకుని నిద్రాభంగం అవుతుందనేనా చూడకుండా. అది ఎంత పాశవమో గమనించండి! సరి, ఒక పోటీదారు నగవోట్లనిమిత్తం ఆడఏజెంట్లని నియమించాడట, ఏకాడికొచ్చిందో చిత్తగించండి! అబ్బే, తల్చుగుంటే డోకొస్తుందండే!

మళ్లీ నాహంగుదార్లలో ఒకొక్కడే వచ్చి జరిగిన సంగతుల గురించి చెబుతూంటే ఆశ్చర్యం వేసిపోతుంది. ఒకాయన సుస్తీలోఉంటూ నాఅభ్యర్థిత్వం విని, టపీమని లేచి కూచుని, ఆనందించి ఆసుస్తీపోతే అనుకోండి, మూటకట్టి పదిలంగా మాహంగుదారు చేతుల్లోఉంచాట్ట! ఎంతచిత్రమో చూడండి! కొందరు పెద్దచదువులు చదువుకున్నవాళ్లు "నావోటు మీదే. తిరగక్కర్లేదు కడుంవి చూసుగోండి, నావోటు మీకోసం మీదుకట్టేశాను" అంటూ తమ దగ్గిరి కొచ్చిన ప్రతీవాడికీ వోటీ అని, కాళ్లరిగేటట్టు తిరిగిన వాళ్లల్లో, ఎవడికీ తమవోటురాల్చక మూలకూచున్న మూగాడి కెవరికో వేశారట, ఎంతవిరుద్ధమో చూడండి! ఒక వోటరు నాహంగుదార్ని ఆహ్వానించి తీసిగెళ్లి భోయినంపెట్టి సత్కరించి వోటిచ్చుగుని పంపేశాడట! అల్లాంటి విపరీతపు

మనుష్యులు ఇటువంటి కాలంలో కూడా ఉండడమనేది అపూర్వ విషయం. ఓ వోటరు నాహంగుదారు ఎదట సన్నుతెగ తిట్టి (వాడు నావాడని ఎరక్క) తరవాత వాడు నావాడే అని తెలుసుకుని నొచ్చుకుని, ఆ సంగతి నాతో చెప్పడానికి బతిమాలుకుంటూ లంచంగా తనవోటు మార్కు పారేశాట్ట! వెధవతిట్లు తింటే తిన్నాంగాని క్రూరమైన వోటుని వశం చేసుకున్నాం అదే చాలు లేస్తుహూ అన్నాడు నాహంగుదారు! ఒక వోటరు దంపతుల్లో మొగుడు తనపెళ్ళాం తను అన్నప్రకారం వోటు వెయ్యకపోవడంవల్ల విడాకులకోసం యత్నించడం, విడాకుల ఖరీదు మగజాస్తీ అవడంవల్ల అతడు తమలపాకులే కొనేసుకుని ఇంటికి రావడం జరిగిందట! ఎంత యిదిగా వస్తోందో చూస్తుండండి! ఏదేనా నియమాన్ని ఒక అభ్యర్థి స్వవిషయంకోసం భగ్నంచేస్తూ ఆనియమాన్నే మరో అభ్యర్థి పాటించకపోడంలో నేరంచేశాడని ప్రచారం చేసుకోవలిసొచ్చే ఎన్నికలకి జనం ఎందుకయ్యా ఎగడతారూ అంటే ఫలానాఅని తెలియనక్కర్లేకపోడంవల్లే! ఇది అద్భుతమే మరీ!

ఆ దీక్షాదినాల్లో తప్ప నేను, తరవాత, మాట చాలా తగ్గించేశాను. మౌనం వహించానన్నా తప్పులేదు. ఫలితం ఇటవుతుందా అటవుతుందా అంటూ నేను గుణకారాలు వెయ్యనే లేదు. అయిపోయిందేదో అయిపోయింది, దాన్ని గురించి బాధపడడం మానుకున్నాను. తిరగడంలో రోడ్డుబాడి పడి, గుడ్డలు ఎర్రపడ్డప్పణ్ణుంచీ కాషాయిబట్టలమీది

కెళ్ళింది మనస్సు, అవి ధరించేవాణ్ణి దొడ్లో చెట్టుకింద స్థలం బాగుచెయించి, రోజూ సాయంత్రం అక్కడ ఒక ఆసనం వేయించి దానిమీద కూచోడం ప్రారంభించాను. శూన్యభావంతో కూచోడంకంటె ఏదైనా నిర్మలభావంతో కూచుని తదేకంగా స్మరించడం మంచిదని నాకు తోచింది సద్యఃఫలితం లేకపోయినా ఉపాసనవల్లా, పునశ్చరణవల్లా ఫలం ఉండితీరుతుంది గనక మరో మంత్రం మరో మంత్రం అయితే అధికార అన్వయ ఆచరణల్లో తేడా లొచ్చి బెడిసి కొట్టి తుడిచేస్తుందేమో అనే భయం చొప్పున, వోటేమంత్రం అనుకుని యథాశక్తి జపం నిష్కామంగా సాగించాను. నామనస్సు ప్రశాంతం అయిపోయింది. నెగ్గినా నెగ్గకపోయినా నాకు సమానమే అనిపించింది. ఓడిపోయినా నామనస్సు ఎంతమాత్రమూ బేజారుపడదు చూస్కోండి అని జనానికి దాఖలా యివ్వడానికి నేను ఓడిపోయినా బాగుండును అనిపించింది. నేను తీరా నెగ్గేస్తానేమో గదా అని భయం వెయ్యడం మొదలెట్టింది. అల్లాంటి భయాన్ని కూడా పారదోలాను. చివరికి అనుకున్న మోస్తరుగానే జరిగింది. ఒక నస్మరంతి అభ్యర్థి విజయం పొందాడన్నారు ధర్మానికి రోజులు కావనుకుని నేను సమర్థించుకున్నాను.

* * * *

వోటరు వోటివ్వడానికి కారణాలు అప్రత్యక్షంగా ఉండే రకంవి వోటర్లువల్లే తెలుస్తూంటాయి. అనేకసందర్భాల్లో

అనేకులు చెప్పగా వినబడ్డ కారణాలు కొన్ని యీక్రింద ఉన్నాయి. నాజ్ఞాతి లగాయతు రాష్ట్రాంతరవాసివరకూ ఉండే జనంలో బాంధవ్యంయొక్క చేరుపునిబట్టి ఇచ్చాను — వాడు చాలా చేశాడు — అతడు గట్టివాడు — లక్ష కోశాడు మరి, చేసి చేస్తూండే చెయ్యాబోయ్యేవాటిని గురించి ఉత్తరంరాశాడు — నాకు స్వంతదస్తూరీలో రాశాడు — పాపం నాయింటికొచ్చి నన్ను చూశాడు — నన్నొచ్చి చూసిన వాళ్ళల్లో మొదటివాడు — నన్ను బతిమాలుకున్నాడు — నా కాళ్ళట్టుకున్నాడు — వోటిస్తేగాని అభోజనం పడుకుంటా నన్నాడు — నాకడుపున పుడతా నన్నాడు — తన పిల్లాడికి నాపేరు పెడతా నన్నాడు — నన్ను చంపుకుతిన్నాడు — అనే కులద్వారా నన్ను ఊదరకొట్టి వేపించేశాడు — నాదగ్గర కొచ్చి కాకిగోల — నేను ఆయన్ని ఎరగనుగాని మావాడు రాశాడు — ఆయన మాఅల్లుడిచేతే రాయించాడు — మా అధికారి దగ్గిర్నించి ఆజ్ఞాపత్రం వచ్చింది గనక నేను ఫలనావారికి వోటు చెయ్యకపోతే నాఉద్యోగం కాస్తా ఊరేగిపోయి చిప్ప చేతి కొస్తుంది, ఫరవాలేదని ఇప్పుడు సలహా ఇచ్చేవాళ్లు తరవాత కనిపించరు — నేను ఒకాయనికి (ఆయన పేరేవరో మరచిపోయాను!) తీరా వాగ్దానం ఇచ్చానండి, ఇప్పుడు మాట తిరిగి పోతే బాగుంటుందా చెప్పండి, 'తిరుగన్నేరదు నాదుజిహ్వా' అన్నాడు తెలుగుబలి, (అనగా తను సాధారణంగా అన్నమాటప్రకారం పోయే మనిషనిన్నీ, అధమం

వోట్లసందర్భంలోనేనా అన్నమాట జరపగల అపర హరి శ్చంద్రుడు తనే అనిన్నీ, కలియుగంలో సత్యహరిశ్చంద్రుడు లేని లోటు ఏకొంతవరకేనా తాను తొలగించాలని అనుకుంటూన్న సంగతి జనానికి తెలియాలనిన్నీ చాలామంది అభిలాష.) ఆయన మెల్లానూ నెగ్గుతాడు, అందుకని ఇష్టం లేకపోయినా ఇచ్చాను. — ఆయన మెల్లానూ నెగ్గడు, అందుకని వోటు వట్టిగు పొమ్మన్నాను — ఆయన మాంచిప్రతిభగలవాడు, అందు కనిఇచ్చాను — ఆయన పాపం శుద్ధ తెలివితక్కువఘటం, అందు కనే పోనీ ఏం శాశ్వతం, తెగ ముచ్చటపడుతున్నాడు, అదీ చూద్దాం, భాగ్యమా ఏమిటి, నేను మానేస్తే ఇతని మందలో చేర్తేదెవడూ అని ఇచ్చాను — నేను 'నావోటు ఏం జేసుగోనూ, నాకు పనికిరాదాయె' అని ఆలోచిస్తూ ఒఖ్ఖిణ్ణీ మంచం నేసు గుంటూంటే ఓఅభ్యర్థి వచ్చి సాయం చేసిపెట్టాడు. తక్షణం, అడక్కుండానే అతడికి నావోటు ఇచ్చేశాను — నాకు అభ్యర్థులందరూ మొహమాటీలే అవడం చేత మనికి ఈవోటుప్రాలుద్ధం ఎక్కడొచ్చిపడిందిరా క్షేమంగా కూర్చోంకుండానూ, పోనీ యీవోటుని సమత్వ సిద్ధాంత ప్రకారం అర్థించేవాళ్లందరికీ ముందే సమభాగాలుగా పంచ డానికి వీల్లేదాయిరి, అని వారంరోజులు తెముల్చుగోలేక బాధ పడి, ప్రతీవాడితోటీ వాడికే వోటిచ్చానని ప్రమాణ పూర్తిగా కోసేసి చివరకి కళ్ళుమూసుగుని వేసేసి పంపించాను — ఇల్లాంటి బాధ పడలేకే నేను కాగితం అక్కరకిరాకుండా

అంకెలు వేసేసి ఊడిరాకుండా జిగురెట్టి అంటించేసి ఎవరో వచ్చి ప్రశ్నం చెయ్యగా వారికే వేశానని ఇచ్చేశాను — నేను ఎవర్నీ ఎరగను, అంటూ నిముందే సంతకంచేసేసి, ఎవరేనా అడిగితే పారెయ్యమని నాస్నేహితు డొకడికి పంపేసి సుహాంగా నిద్దరోయాను. — ఈరీతిగా ఉంటాయి ఇవి చూస్తే వోటు ఒకరికి ఇవ్వడానికి ఏకారణం అయితే ఉందో అదే ఇవ్వకపోడానికికూడా కారణం అన్నమాట. అసలు వోటు ఇవ్వడాన్ని గురించి కారణం గమనించడమే తప్పు. వోటంటే ఇష్టంగదామరి! నాయిష్టం అనే స్థితివచ్చినప్పుడు కారణం చెప్పడంకంటె అడగడమే తప్పు. అందుకనే ఒక జ్ఞాని "వెయ్యివేనులు దానం చెయ్యడం తేలికగాని, తనకున్న ఒకవోటు సార్థకంగా ఇచ్చి ఫని జరిగేటట్టు చెయ్యడం చాల కష్టం" అన్నాడు. వ్యక్తియొక్క వోటు హృదయపూర్వకంగా జరగాలీ అంటే విద్యాధికులలోనే ఎక్కడలేని మారామ్ములా బయల్దేరుతాయిగదా, తక్కినవాళ్ళల్లో ఇష్టాల్ని బట్టి విజయా లుంటాయా అని కొందరు అనుమానిస్తారు. కాని, అక్కడే నాటకభాగం తక్కువ ఉంటుందని కొందరుఊహిస్తారు.

రేడియో-కబుర్లు

(1)

నాదప్రసరణానికి భూ—జల—వాయ్వాకాశాలు తోడవుతాయి. ముఖ్యంగా మానవులుండేది గాలిలోనేగనక వాయువు నాద వాహకంగా ఉంటుందనేమాట మానవులు గమనిస్తూండే విషయమే. పోనీ వాయువేగం వేరూ, వాయువులో నాద వేగం వేరూ అయినా, జనించిన ఒక నాదతరంగాన్ని వాయువు తన ప్రకంపనశక్తివల్ల మోసెయ్యగల దనేమాట రూఢి. అది అట్లా మోసెయ్యకల దేగాని, విశేషదూరం గడవకుండానే నాదంయొక్క పటుత్వం క్షీణించి త్వరలో ఆనాదమే అంతరించి పోతుంది. (నాదానికి అల్లా క్షీణించేలక్షణమేగనక లేకపోతే భూగోళం ఎల్లప్పుడూ గందరగోళంగా ఉండవలసొచ్చేది గనక మనం విచారపడనక్కర్లేదు!) ఒకవేళ, అల్లా అంతరించ కుండా నిలవగల సామర్థ్యం నాదానికి ప్రసాదించాం అనుకోండి. అనుకున్నా, భూమికి సగంచుట్టు తిరిగిరావడానికి నాదానికి ఒకపూటా అందుపైన నాలుగుగంటలూ కూడా ఇంకా చాలనే చాలవు. భూగోళంమీద ఉండే ఏయిద్దరి మనుష్యులకైనా మిక్కిలి— ఎక్కువదూరం (భూమియొక్క అర్ధపరిధి గనక) పద మూడువేలమైళ్ళు మించదు. అటువంటి యిద్దరిలో ఒకడు మాట్లాడితే రెండోవాడికి వినపడడం నాదబలానికి అతీతం గనక అసంభవంఅని మానవులు నమ్మేవారు. కాని మానవుల విజ్ఞా

నమూ, ఆలోచనా, కార్యాచరణా, జీవితావసరాలూ పెరిగిన కొద్దీ, ఎవరో ఒకజ్ఞాని మరోపన్లోఉండి ఒక విద్యుద్దీపప్రయోగంలో గావించిన ఊహానుమాన బీజంవల్ల 'రేడియో' అనే సంస్థ ఆవిర్భవించినమీదట, అసంభవం అని లోగడ అనుకున్న పని, సంభవంఅయినా పూటకాలంలోకుడా కాదనుకున్న పని, సెకనుయొక్క ఒక వీసభాగంలో జరిగిపోతూండడం విశేషనాగరికత లేనివాళ్లకి కూడా పరిపాటి అయినసంగతి. అనగా రేడియో వచ్చి, వాయుదేవుడు వేగవిషయంలో ఎంత పేరుపడ్డప్పటికీ ఆ "మంద" పవనం గార్ని నాదవాహక క్రియలోంచి కొన్నిసందర్భాల్లో తొలగించి, ఆపని తనుచేసి, దూరాన్ని జయించేసి, దూరశ్రవణం సుసాధ్యం చేసింది. ఇక ప్రేషకస్థానంలో నాదోచ్చారణ చెయ్యగానే ఉద్భవించే నాద తరంగం, దాన్ని అనుసరించి సూక్ష్మాతిసూక్ష్మాలతో శబ్ద గ్రాహిలో బయల్దేరే విద్యుత్తరంగం, దాన్నిబట్టి ఉండే ప్రవర్ధక తరంగం, అది పరివర్తనకోశంలో పడ్డ మీదట పుట్టే క్రమణిక తరంగం, తద్వారా ప్రకంపనతరంగం, సాధారణసాతత్యం లోంచి మహాసాతత్యంపొందిన ప్రవాహకతరంగం, దాన్నించి కాంతవిద్యుత్తరంగం, తత్ప్రసరణం, పై క్రియలన్నీ విలోమంగా నడవడానికి ఏర్పాట్లుచేసుగుని గ్రాహకాన్ని అదే స్మృతిలో మేళగించి వినంటూచున్న ప్రతీస్థలంలోనూ అసలునాదం యథా రీతిగా సిద్ధించి సెకనుయొక్క వీసభాగంకంటె తక్కువలో విన పడడం - అనేటటువంటి తికమకలు 'రేడియో' అనేది తన నిత్య

కృత్యంలో పడేపాట్లు' అన్నట్టు ప్రేషకస్థానంలో ఉండేనాదచోద కులు కూడా అటువంటిపాట్లు పడతారు. తక్కినవాళ్ళు ఫలితం వినడానికి చెవికోసుగుంటారుగాని, అటువంటివాటిని చెవినిపెట్టరు.

(11)

'రేడియో' లో విశేషాలు ఏమిటంటే వినపడేదూరం పొడుగునా కాస్తతిగేనా లేకపోడం ఒకటీనూ, నాదం భూమి అంతటా సెకనుయొక్క భాగంలోనే చుట్టబెట్టి వినిపించడ మూనూ! ఇతరగ్రహాలదగ్గిరికి భూమినాదం ఈయంత్రంవల్ల వినిపించదని చెబుతారు. వెళ్ళి తిరిగొచ్చినవాళ్ళు చెప్పేవరకూ అది ఒప్పుగున్నా తప్పులేదు. మనిషియొక్క దేశాభిమానం భూగోళాభిమానంగా మారడానికి అవకాశాలు రేడియోలో ఉన్నాయి పరభాషలు వినేటప్పుడు అవి కూతలులా ఉన్నాయనీ, పర గానాలు వినేటప్పుడు అవి ఒకటోరకం ఏడుపులులా ఉన్నాయనీ జనం అనవసరనిరసనం చెయ్యడంపోయి ఆ నానానాదాలు వాళ్ళ వాళ్ళకి శ్రావణయోగ్యంగాఉండే కవిత్వ గానాలుగావును అని సరిపుచ్చుకోగలగడమే గొప్పసహనశక్తి గనక అది రేడియోవల్ల అభివృద్ధి అవుతుందని చెప్పవచ్చు. భాషేకాక, గానమేకాక, ఇతర నాదలేశ సముదాయం కూడా హృదయాన్ని ఆకర్షించి అర్థదాయకం కూడా కావచ్చు నని రేడియోలో తెలుస్తుంది. చదవడంలోనూ వ్రాయడంలోనూ అవసరంఅయే శ్రమగాని, శ్రద్ధగాని, దీక్షగాని లేకుండానే –

ఆమాటకొస్తే అసలు చదవడం రాయడం తెలియవలసిన అవసరం లేకుండానే, ఏకకాలమందే అనేక మానవుల్ని జ్ఞానవంతుల్నిగా చెయ్యడానికి రేడియోకి సామర్థ్యం ఉంది. శారీరక మానసిక ఆత్మికసందర్భాల్లో మానవజాతికి అవసరం, అనుగుణం, అనుకూలమూ, ఆనందంగల ఏవిషయం అయినాసరే అరటిపండు ఒలిచినట్టు వినిపించగల ప్రజ్ఞ రేడియోదే, రేడియో నిమిత్తంఅయే సొమ్ముఖర్చు కాలవ్యయమూ గమనించి అందుకు తగ్గట్టుగా ఎంతమంది పామరజనం అజ్ఞాననిద్రలోంచి మేల్కొల్పబడ్డారు, వాళ్ళల్లో జ్ఞానపుమట్టం ఎన్ని అంగుళాలు పైకెగిరింది అనే లెక్కలు ఎప్పటికప్పుడు తేల్చడానికి వీలైన రకంవి కావు. అసలు పామరజనం రేడియో లాభం పూర్తిగా పొందగలరా అనేదే మీమాంస. ఎందులోనైనా సరే గొప్పవాడొచ్చిమాట ఆడినా, గానశాస్త్రి వచ్చి పట్టుపట్టినా, సోదచేసినా, జనం వినడానికి గ్రాహకపు పెట్టెలున్న చోట్లకే ఎగడతారు. రేడియోలో మాట్లాడింతరవాతగాని, పాడింతరవాతగాని గొప్పవాళ్ళైన వ్యక్తులుకూడా వెతికితే విధిగా దొరికితీరతారు. మధ్యరంగంవాళ్ళకి రేడియో వినడం మంచివ్యసనం. నస్యం, కాఫీ — పిల్చడపువ్యసనంలాగే, టాకీచూడడపు (తెలుగుదైతే వినడపు) వ్యసనంలాగే, వార్తాపత్రికలు చదవడపు (డబ్బుఖర్చుతనదికాకుండా ఉండేపరతుకి) వ్యసనంలాగే, ఈవ్యసనమూనూ! అందుకని ప్రేషకభవనంలో గంటలప్రకారం—కాదు! సెకనులప్రకారం—కొందరు

పనిచెయ్యాలి, అల్లానే లక్షలాదిజనం, ఇతరపని (అగ్నిహోత్రాలు చెయ్యడంవంటివిశేష్య) మానుకుని గ్రాహకయంత్రాల చుట్టూ మూగాలి. రేడియోవినడం నుంచినిషా అనికూడా కొందరుఅంటారు. కొన్ని ఇతరనిషాలలో పడిఉంటూండే సమయాల్లో ఎవడైనా తనదుఃఖాలు హాయిగా మరిచిపోగలగడమేకాకుండా తనఇష్టంలేకుండా తననే మరచిపోవాలి, కాని, ఇందులో అంతమట్టుకుగాదు ఎటొచ్చీ, విని విని విని ఏమివిన్నావు అని ఎవరేనా అడిగినప్పుడు, అన్నీ కొట్టుకుపోయాయి ఫలితం సున్న అనిగాని, ఓదాన్ని ఓదాంతో కొట్టెయ్యగా ఒఖటే ఫలితం, అది నేనే అనిగాని చెప్పకోడానికి చాలా అవకాశం ఉంది. జనానికి ఆదిలో శబ్దమే ప్రమాణం. మధ్యకాలంలో గ్రంథప్రమాణం కావలసొచ్చింది, కాని మళ్ళీ ఇప్పుడు శబ్దప్రమాణంలో పడేటట్టు కనిపిస్తారు. రేడియో అనేది పత్రికలపాలిట ఇటీవల పుట్టిన దుడుకుసవితి. అయినా "చేత" అనగల పత్రికలుకూడా "వాత" అనగల రేడియో దగ్గిర నోరెత్తలేవు కనబడి వినబడే నాటకలోకంయొక్క వినబడే సగం చెక్కనీ రేడియో స్వాధీనపరుచుకుంది. రాబోయే టెలివిజన్, ఆ తక్కిన కనబడేసగంచెక్కనీ దఖలుపరుచుకోబోతోంది. చెలరేగుతూన్నటాకీ యావత్తునాటకాన్నీ బొమ్మకట్టి మింగేసేయత్నంలో ఉండనేఉంది.

(111)

రేడియో వినిపిస్తూ పనిచెయిస్తే కూలివాళ్ళు ఎక్కువ పని

చెయ్యగలుగుతున్నారని తెలుస్తుంది.

రేడియోసెట్టు పీఠంమీదపెట్టి ఆవుల్ని పాలుపితికితే మామూలుకంటె ఎక్కువగా పాలిస్తున్నాయని కనిపెట్టారు. అట్లాకాక, మామూలులో తన్నేరకంవి ఇటువంటప్పుడు ముందుకుమ్మేసి ఆవెనక తన్నేసినా ఉభయత్రాకూడా రేడియో సెట్టుకి ప్రమాదం ఉండదనిరూఢిగా చెబుతున్నారు.

రేడియో శక్తి బలాన్నిబట్టి చెట్లని కోరినసైజులో పెంచుతున్నారు.

రేడియోవల్ల కుదర్చగల రోగాలకంటె వచ్చేరోగాలు చాలాతక్కువే అనేసంగతి పరిశోధనవల్ల తేల్చారు.

ఒకవ్యక్తి ఏదోయంత్రం కేసిచూస్తూ, కనిపించని జనశతాల్ని గురించి, వారిమెప్పువగ్గరాలు తనకు అందే చిక్కు లేకుండా, హృదయం విప్పి హృదయంగమంగా నాదంచెయ్యడం ఒక గొప్ప కళ అని ఒకమహావాదంలో ఒకపార్టీ దెబ్బలాడగా, అది కళ కాదు కేవల ద్రుతప్రకృతికమే అని ఇంకోపార్టీ ప్రతిఘటించారు.

జనంఎదట ప్రత్యక్షంగా నిలవబడి నెగ్గలేనివ్యక్తికూడా రేడియోలోంచి ఉపన్యాసవాచికంగాని గానంగాని చేసేటప్పుడు వినేజనం తమ ఇష్టాయిష్టాల్నిబట్టి గోలచేసినా, గొల్లుమన్నా, తనుమాత్రం మానక్కర్లేదు, సయించకపోతే జనమే మానుకోవాలి.

ఒకళ్లని వారి పక్కింటివాళ్లు తిట్టేటప్పుడు, ఈ కాలంలో ఆ ఒకళ్లు మళ్ళీ తిట్టనక్కర్లేదు. తమరి రేడియోసెట్టు విప్పి

ఆ క్షణంలో దొరికే పరదేశపు బ్యాండులాంటిది పెట్టేసి తప్పు గుంటేసరి, అవతలవాళ్ళతిట్లు రక్కున కట్టిపోతాయి.

ఒకవేళ పక్కింటివాళ్ళు కోపధారిబాపత్తై, వీళ్లు విరామం లేకుండా రేడియో వెయ్యడంవల్ల తమరు కోపంలో మరీ రెచ్చిపోయి, వీళ్లని సరసం చాలించండని కోరారా, వీళ్లు గంటకి రూపాయిలాంటి రేటు మాట్లాడుకుని, ఇచ్చిన డబ్బుని బట్టి ఎన్నిగంటలో లెఖ్ఖ వేయించి అంతసేపూ ఆపడానికి తెగించవచ్చు.

రేడియో నాటకాల్లో నటులు కాగితాలకేసి చూస్తూ నాటకాన్ని పెదవుల్తో గిరవటెయ్యడానికి వీలుంది. మామూలుగా జీవించే నటులు వచ్చినముక్కలు ఎల్లాచెప్పాలి అని బాధపడితే రేడియోనటులు ఏమి ముక్కలా చెప్పడం అని ఆడేటప్పుడే కళ్లతో తడుముకో వలసిన అవసరాలు కలగచ్చు.

రేడియోపక్షు కార్యక్రమం తెలుగులో అచ్చుకొట్టగా అది ఆంధ్రులికి అవసరంలేకపోయింది గనక, ఇతరభాషలవాళ్లకి మూడు నాలుగేసి రేడియోస్టేషన్లు పడ్డతరువాత, ఏకంగా మహాంధ్రా రేడియోస్టేషన్ పురమాయిస్తారు అని గ్రహించుకుని, అది తీరా కట్టొచ్చేసరికి, ఏ ఊళ్లోనూ లేక ఏ ఊరు సమీపంలోనూ అని యథాప్రకారం మళ్ళీ దెబ్బలాట రావచ్చును గనక, ఆపనిమీద ఇప్పట్నించీ ఆంధ్రులంతా నడుంకట్ట నిద్ర పోతారని వినపడుతుంది.

రేడియోపాలకులకి ఆ దగ్గిర్నించివెళ్ళే ఉత్తరాలసంఖ్యని

బట్టి రేడియోలో మాటకిగాని పాటకిగాని ఆహ్వానపున రాహ్వానాలు ఉండవచ్చునని అంటారు. ఒక్కొక్కపాటో మాటో అయింతరవాత, దాన్ని జనం ఎల్లాభరించినా, అది అద్భుతంగా ఉండేసినట్టు పైవారికి ఉత్తరాలు కురవాలిట, కురుస్తూంటాయి. అసలు అవి వేర్వేరుగాఉన్నా ఫరవాలేదు. ఉంటూండవు. వేర్వేరు ఊళ్ళనించివెళ్లినా మతేలబుఒకటే అవడం చిత్రం. ఒక్కొక్కప్పుడు ఆఉత్తరాలురాసేవాళ్ళు అందరూ ఒకేరీతిగా పొరపాటుపడతారో గ్రహపాటో, దిక్కుమాలికర్మం, ఆ అసలుగాయకుడుగాని "మాటకుడు" గాని వీళ్లకనియమించినప్రకారం వెళ్లి పాటగాని మాటగాని ఆడి ఉండకపోయినా, ఆ జరగని కార్యక్రమం అద్భుతంగా జరిగిపోగా తనురు వినేశాం అని ఉత్తరాలు దిమ్మరిస్తూంటారు. ఉత్తరాలవల్ల ఏం నిర్ణయం అవుతుందయ్యా అంటే లిఖితసాక్ష్యం గదా! శబ్దం చేసే రేడియోకి శబ్దసాక్ష్యం పనికిరాకపోడంలో ఆశ్చర్యంలేదు.

రేడియోస్టేషన్ పాలకులచర్య వాళ్ళపుణ్యాంచొప్పున మహానిరంకుశం! అనగా మరేంలేదు. వాళ్లే అనాలి, జనం వినాలి కుంయికుంయి మనకూడదు, అనలేరు. మొరలు వినిపించవ్, రచనలు పత్రికలకి పంపితే, వారికీ వారికీ ఏవేనా చేటీలురావచ్చు చూడండీ! అంచేత ఆరచనల్లో కొన్ని కొన్ని ఆవాక్యాల దగ్గిరికొచ్చేసరికి సిరా మంచిరకంది కాకపోడంవల్ల ఆవాక్యాలు కాగితానికి అంటుకోవు. కాని నిరంకుశత్వానికీ

కాలం వుంది "హెర్ హిట్లర్" ని మొట్టికాయవేసే పైవాడు "హిజ్ హిట్లరు" ఉండితీరతాడు – అని మా డాక్టర్ ప్రెసిడెంటు ఒకసారి "డిన్నర్" మధ్యలో సెలవిచ్చారు. అమెరికా లోని ఎలక్ట్రిక్ ఇంజనీరు - డాక్టరు నీక్ మోరే హాప్కిన్స్ అనే ఆయన ఒకచిన్నయంత్రం కనిపెట్టాడట అది త్వరలోనే అమ్మకానికి వస్తుందట. అది ప్రతీరేడియో సెట్టుకీ పెట్టవచ్చుట. దాన్లో ఎవరు మాట్లాడినా తక్షణం ఆమాట భేష్ అన్నా సరే ష్టాఫ్ అన్నా సరే రేడియో చోదకస్థానంలో వినిపిస్తుందిట. అప్పుడు అన్ని గ్రాహక రేడియోల వాళ్ళుకూడా తమ ఆనంద విచారాలు ఒకేసారి వెలిబుచ్చి రాస్తాయినా ప్రేషక రేడియో స్టేషన్లో పనిచెయ్యడంగాని, దానికి సమీపంలో ఉండడంగాని కొంచెం ఇబ్బందిగానే ఉండవచ్చుట కాని ఒక ముందిలాభం ఉంటుందన్నారు. రేడియో సెట్లు ఎంతమందికొన్నారో అంత మందిగనక మెచ్చడమో తిట్టడమో కాలిచ్చేసరికి, సెట్లు ఎన్ని అనే లెఖ్ఖ జనాభా లెఖ్ఖకంటె ఖంజాయింపుగానూ త్వరగానూ తెలిసిపోవచ్చుట!

రాత్రివేళ కొన్ని రేడియోసెట్లలోంచి వచ్చేమాటలు కంపు కొడుతున్నాయని అంటారుగాని, మనం ఈకాలంలో అల్లాంటి మాటలు నమ్మకూడదు.

వినేజనం తమకు తెలియంది గంటసేపు భరించగలరుగాని తెలిసేది పావుగంట భరించలేరు. సంగీతంలో మాటలకి అర్థాలు స్ఫురించకపోయినా తెలిసినట్టు అనుకోవాలి, రాగాలకి అర్థాలు

అడగకూడదు. ఇక, పదరచనలో మాటలకి అర్థాలు తెలియాలి, లేకపోతే ఉచ్చారణే అడ్డిపోతుంది. అర్థజోక్యంలేని రచనల్తో ఆనందం అనుక్షణం కలిగించవచ్చుగాని, తెలిసే మాటల్లో అనేకులకి ఒకడు చెయ్యగల మహోపదేశం ఈ రోజుల్లో రోజూ ఎక్కణ్ణించి వస్తుంది కొత్తదీ! అందుకని, రేడియోకవిత్వంవిలువ రేడియోగానం విలువలో దశాంశం కూడా ఉండదు.

జేబులోకి సరిపోయే రేడియోసెట్లు పాతిగేసిరూపాయలకి వస్తాయని చెప్పుగుంటూండడంవల్ల, సగం రేట్లు అయింతరవాత సినిమాకి వెళ్ళినట్టు, అప్పుడు మనంకూడా ఓ సెట్టు కొనుక్కోలేకపోతామా అని అస్మదాదులు లోపల లోపల కుట్రలు పన్నుతున్నారు.

జేబురేడియో అయింతరవాత చెవలరేడియో ఒయల్దేరుతుందని ఇంకా మరికొందరు చెవులు నిక్కపొడుచుగుని ఉన్నారు. వాళ్లు అనుకునేసెట్టు అయిదురూపాయిలే. చివరకి ఎల్లానూ వినవలసింది చెవేగనక ఆసెట్టు చెవికే తగిలించెయ్యొచ్చు, కుండనాలూ తమ్మెట్లూలాగ! ఒకచెవికే అయితే అసహ్యంగా ఉండవచ్చు గనక, రెండుచెవలకీ – ఒకటి స్వదేశవార్తలకీ రెండోది విదేశ కార్యక్రమాలకీ, అని పెట్టుకుంటే బాగుంటుందని చెబుతున్నారు. ఒకవేళ, వాటి బరువువల్ల చెవులు దీర్ఘంఅయినా ప్రస్తుతం పూర్ణకర్ణాభరణాలు ధరించేవాళ్ల చెవలకంటె ఎక్కువ దీర్ఘం కావసన్నె, అసలు దీర్ఘశ్రవత్వం క్రమేపీ వృద్ధశ్రవత్వంలో

పడి మిక్కిలి వైభవంగా ఉండబోతుందనిన్నీ కొందరు అభయం ఇస్తున్నారు.

ఒకవేళ, టెలివిజన్ కూడా ఈలోపులోనే ప్రచారంలోకి వస్తే తక్షణమే—అనగా ఇంటి టెలివిజన్ సెట్టూ, జేబు టెలివిజన్ సెట్టూ, కంటి టెలివిజన్ సెట్టూ, అంటూ కూచుని కాలంపాడు చేసి పారెయ్యకుండా, మొదట్లోనే కళ్ల సెట్టు ప్రచారంలోకి తెచ్చేస్తారని చాలా నమ్మకంగా అంటున్నారు. ఇదివరకే మామూలు కళ్లజోడు ధరిస్తూన్న వాళ్ల విషయంలో అర్ధ చంద్రాకారంలో అద్దాలు కేటాయించి, పై అద్దాలలోంచి చూసి నప్పుడు ప్రత్యక్షరూపాలూ అడుగు అద్దాలలోంచి చూస్తే, అవి టెలివిజన్ సెట్టువి గనక, పరోక్షరూపాలూ ఏకముహూర్తంలో కనిపించేటట్టు చేస్తారనిన్నీ, అప్పుడు ప్రత్యక్ష పరోక్షాలుగాని, లేకపోతే పోనీ సగుణనిర్గుణబ్రహ్మల్నిగాని ప్రతీ దుర్గుణబ్రహ్మ చూడవచ్చుననిన్నీ, పైన వాడిష్టంఅనిన్నీ, తెలుస్తుంది.

అయోమార్గ విమర్శ

ఒకనాడు ఒక రైల్వే సంధిలో రైలెక్కి కూచున్నాను. వెళుతున్నానో వస్తున్నానో! – బహుశా వస్తున్నాను గావును, అవునవును వస్తున్నాను ఇగో, ఆఁ! సాయంత్రం పొద్దుబాగా వాలిపోయింది. కిటికీకి చేరువగా ఒకమూల కూచున్నాను. కాస్త ఉపన్యాసమున్నా చేసినా, ఎప్పటికప్పుడు మారిపోతూన్నట్టు గోచరించే పొలాలూ గిట్రా చూసినా ఇదైనా, సౌస్యం కేం ందాసిస్తూ ఆలోచించుకున్నా నిద్దరోయినా, కిటికీదగ్గిరనా ఉంటేనే న్యాయం అని, ప్రతీవాళ్ళకీ ఏమోగాని, నాకు అనిపిస్తుంది. ఎక్కడిది కక్కడికే! ఆ ఉన్న దిక్కుమాలి చెరలో ఆ కిటికీదగ్గిర జానెడు స్థలం దొరకడం కొంచెం స్వాతంత్ర్యం. ఆవేళ ఖాళీగానూ ఉంది. అన్నట్టు అప్పుడు ఇప్పటంత రైలు రద్దీ లేదు, అక్సిడెంటూ లేవు, వేళ్ళాడ్డ లూ లేవుగా! పెట్టెలో జనం హాసిహాసిగా ఉన్నారు గాని, నన్నెరుగున్నవాళ్ళెవరూ మాత్రం లేరు. అయినాసరే, నా వార్తాపత్రిక నేను పైకి తియ్యలేదు. తీక్ష్ణ క్షోభ ఏమిటంటే, మున్నెరగని ఆంధ్ర ధనికులు కూడా పేపరు 'ఒక్కమాటు' కోరి దానంట్ట చదువుతారే కాని మానసిక క్షుద్బాధ పరాయివాడి ఖర్చుమీద తీర్చుకోడం అధమాధమం అనేసంగతి ఆలోచన చెయ్యరు. మరి పుస్తకాలు పైకితీసినా అంతే! తెలుగువైతే, తెలుక్కి దిక్కులేదు గనక, అడక్కుండానే తీసుకోడానికికూడా ఇతరులకి

హాకుండిట. ఇంగ్లీషువైతే, - ఇతరులు అడిగి మర్యాదగా బలవంతపెట్టి గడుసుగా చదువుకుని తమరుదిగి వెళ్ళిపోయే దాకా మాత్రం అట్టే పెట్టుకుని, వందనాలతో వాపసుచేస్తారు. అందుకని, వింతభాషలో పుస్తకం చూస్తూండడం తెలుగు రైల్లో కర్తవ్యం. సరి, రైల్లో చదువుకోసం అంటూ భాష లెక్కడ నేర్చుస్తాం గనక! ఆ మామూలు పుస్తకాలకే అట్టలు వేసి మాశెట్టుగుని ఎంగ్లానో తంటాలుపడతాం. ఏమైతేం, రైల్లో పుస్తకాలు విస్తారంగానే చూడచ్చు, చూస్తూంటాను. సరి, ఆరోజు, ఒక ఉద్దూ గణితం గావును పైకి తీసి, సంచీ కట్టులోంచి ఓకిల్లి కట్టి వేసేసుగుని, పుస్తకం విప్పి చూస్తూ కూచుంటిని గదా, అవతలకాను ఎదరకిటికీ దగ్గిర నే నెప్పుడూ ఎరగని ఇద్దరు వ్యక్తులు నాపుస్తకం పైఅంచుమీంచి నాకు గోచరించారు. ఒకఅతను పేనుమీసంతో సళాకుగా ఉంటే రెండో అతడు కుదిమట్టంగా ఒఖ్ఖరవ్వ పిప్పళ్ళబస్తాలా ఊరుకోడమే కాక ముక్కుక్రింద నక్కుల్లాంటి పరకమీసం కూడా పెట్టించాడు. మొదటి అతడి జుట్టు, కోతకొచ్చి వాలిపోయిపడుకున్న పైరులా ఉంటే, రెండో అబ్బిది ఖరాగా ఉంగరాలే. మొదటి ఆసామీ దగ్గిర కొరడాఉంది, రెండో ఘటందగ్గిర మెలికిలు తిరిగిన కొంకి బెత్తం ఉంది. ఇద్దరూకుడా ధూమపానం చేస్తున్నారు. వాయువు నోటితో గ్రహించి యథాశక్తిగా కుంభించి ముక్కుతో వొదిలేస్తూ వేదోక్తంగా వాళ్ళు చేసిఉంటే వాళ్ళరోగాలు హరించి వాళ్ళ క్షుద్బాధకుడా తగ్గిపోవలిసిందే

గాని, ఆచరణ యావత్తూ అక్షరాలా యథావిధిగా ఉన్నా, అప్రత్యక్షవాయువు బదులువాస్తవిక ధూమం వాళ్ళు స్వీక రించడంవల్ల ఫలితాలగురించి నాకు సందేహం తోచింది. చచ్చ, నేనెవణ్ణి వాళ్ళఆనందం కాదనడానికీ, విమర్శించడానికీ అను కుని నేను యథార్థంగా పుస్తకంచదువుకోడం ప్రారంభిద్దాం అని యత్నించేసరికి సఖాకుఅబ్బాయి నాకేసి చూస్తూ పిప్పళ్ళబస్తాని మోచేత్తో మెల్లిగా రెండుమూడుసార్లు అద మడం మొదలెట్టాడు. ఇదేదో గ్రంధంలా ఉందనుకుని, నేను కిటికీ కేసి తిరిగి ముఖం పక్కకి పెట్టుగుని వాళ్ళు వ్యవహరించు కునేటందుకు లైన్ క్లియర్ ఇచ్చేశాను. అసగా వాళ్ళసంగతి కనిపెట్టడానికి ఫైలైనంత లైన్ క్లియర్! వాళ్ళు చేసుగున్న సంజ్ఞల్ని బట్టి తమరనుకున్న మనిషి నేనే అయినట్టు వాళ్ళు ఖాయపరుచుగున్నారని నాకు అనిపించింది. వాళ్లు తమరి మన స్సులో ఎవర్నో అనుకుని నన్ను చూచి పొరబడుతున్నా రని కూడా నాకు వెంటనే బోధపడింది. వాళ్ళచేతుల్లో కర్ర లున్నాయి. ఉంటేం, రైలుగదా. కానీ, మనమూ వాళ్ళకి ఆశాభంగం కలక్కుండా వాళ్ళకోరిక ప్రకారమే నటిద్దాం, ఒక వేళ కర్మవశం చేత వాళ్ళు కర్రలు తిరగేసి వాదతమకంలో మన్ని రుంజావాయించినట్టువాయించే ముహూర్తం రాగానే నిజం చెప్పేద్దాం, అని నే ననుకున్నాను. నాకు బోధపడేటట్టు వాళ్ళిద్దరూ ముందు ఈరీతిగా ఉపోద్ఘాతం ప్రారంభించారు:

స — అల్లా పదరా, మొహం ఈడిచి కనుక్కుందాం.

బ — ఉండరా, నిమ్మణం.

స — నిమ్మణం ఏమిట్రా, చీరేస్తాను. భయమా? ఏం జేస్తాడు?

బ — దొరికాడు, ఇప్పుడేం జెయ్యగలడులే! అయినా సరే నిదానించు.

స — నేన్నిదానించన్రా! మూంటగాపడి, ఛాన్సూ వొదులుకుని నువ్వు కూచో!

బ — అబ్బ! ఏమనిరా అడగడం?

స — సరే, శాస్త్రం చెప్పినట్టుంది.

బ — మనకి శాస్త్రం రాదుగా, మరిది కళ్ళగా!

స — అదే, మాకళగురించి ఎందుకు విమర్శించావంటాను. నిరుత్తరుడై ఊరుకోకుండ దంటాను.

బ — కళ గనక నే విమర్శించా నంటే!

స — నీతాఖతేమిటి, నువ్వెవడవ్ అని అడుగుదాం.

బ — కళాసృష్టికిలాగే కళావిమర్శకి కూడా తాఖతంటూ లదు, ప్రతీవాడూ పనికొస్తాడంటే!

స — సరిసరి. నువ్విప్పుడే వైరిదగ్గిర వకాల్తీ పుచ్చుగున్నావా ఏమిటి!

బ — కాదురా! విమర్శకుడికి హక్కులున్నాయి గనక, ఆహక్కులన్నీ సాధించుగున్నానని ఆయనంటే!

స — విమర్శకుడికి హక్కులుంటా యన్నమాట నిజమేకాని నువ్వు విమర్శకుడ వని నీతో ఎవరు చెప్పారని మనం అంటే!

బ — మంచిరోజు చూచి నేనే అనుకున్నానని అయనంటే।

స — అయినా సరే చెడ్డరోజొచ్చింది, జవాబు చెప్పాలని మనం అంటే! తీరిపోదూ? నువ్విక్కడే కూచో మీనమేషాలు లెఖ్ఖెడుతూ!

అంటూ స్వాతు నాపక్కని వచ్చి కూచున్నాడు. బస్తా అబ్బాయికూడా అనుబంధం చేత స్వాతంత్ర్యం తెచ్చుకుని వచ్చి నే కూచున్న బానలోనే ఎదుటి చెక్కమీద అధిష్ఠించాడు

స — (నాతో) ఎందుకయ్యా, మీకు మామీద ఈర్ష్య! అని (కొరడా గుప్పిడిలోంచి కమ్మచ్చు లాగాడు)

నాకిల్లివసంతం నామీదగాని, వాళ్ళమీదగాని పడకుండా నేను నోరు పైకెత్తి, 'లేదు' అండానికి యత్నించి బ్రహ్మాండం మీద 'లేదు' అనేటట్లుగా దాన్ని ఉచ్చరించి, నాహృదయంలో ఈర్ష్య ఎంత మాత్రమూ లేదని ఇంకా స్పష్టంచెయ్యడానికి చెయ్యితిప్పి, మీరిద్దరూ ఎవరు అని అడగడం న్యాయ్యం అయ్యే లాగు ఒకరితరువాత ఒకర్ని చూపిస్తూ, కుడిగుప్పిడి ఊగించాను.

స — (బస్తాతో) చూడరోయ్! వీడి ఫార్సు. మన్ని ఎరగనే ఎరగట్ట.

బ — ఎరక్కపోడం ఏం రోగంరా, నిక్షేపంలా ఎరుగును.

స — మామీద అనృతాలు రాయడానికి నీకు మేం చేసిన ద్రోహం ఏమిటయ్యా?

నే — (మూతి పైకిపెట్టి) నేను, గొప్పవాణ్ణి, నాకు పొక్కుం'డి'.

స — అయినా సరే మామీద నీఅభిప్రాయం కావాలని దేశం ఎప్పు డేడిసిందో?

నే — (పైకేచూస్తూ) నీళ్ళ? (అనేమాటలుమాత్రం పలకగలిగి, 'కావాలని మట్టుకు దేశం ఎప్పు డేడిసింది?' అని అర్థం అయ్యేట్టు సంజ్ఞచేశాను)

స — నాకళ నీకు ఒక్కడికీ బాగుండకపోతే ఏం కొంపమునిగింది? పక్కనవాళ్లకి బాగుండకూడదంటూ శాసిస్తావా? ఇష్టంగా భోంచేస్తూన్నవాణ్ణి దగ్గిరికెళ్లి పదార్థం ఏడిసినట్టుందంటూ కక్కుగోడం ఎందుకూ తినని వాడూ, లేచిపోకా?

పల్చపల్చగా ఉన్నజనంఅంతా మేం కూచున్న భాగంలోకి వచ్చి నవ్వుతున్నారు. వళ్లిద్దరూ నన్ను రకాయిస్తూంటే నేను కళ్లతో పాటు నీళ్లు నములుతున్నానని పక్కనవాళ్లు అభిప్రాయపడుతూన్నట్టు నాకు గోచరించింది నేను తగ్గసమాధానాలుచెప్పి వాళ్లని తెగ్గాల్చాలని నిశ్చయించుకుని, గర్జించి సకిలించి కిల్లీ యూస్తూ ఉమ్మేశాను. దక్కూమూలి ఈదురుగాలిమూలాన్ని నా ముహాంనిండా చినుకులు పడ్డాయేమో, కళ్లుకూడా కలికం వేసినప్పటికిమల్లే భగ్గుమన్నాయి నాకు నిజంగా మనిషికొచ్చినంత కోపం వచ్చేసింది అగ్గైపోతూ, నేను రీవిగాకూచుని, సళాకతో-

నే — ఏమిటండీ మీరు నన్నడిగేది?

స — మాకళమీద అసంపూర్ణంగా, అసందర్భంగా, అర్థకుసిగా, అధ్వాన్నంగా, అర్థంచేసుకోకుండా మీరు ఎందుకు రాశారని.

నే — నేనేమీ రాయలేదే!

స — ఒరితెగి రాసి అబద్ధాలుకూడా ఎందుకయ్యా! నాజూకుగా విషం కక్కుతున్నావనీ, సూక్ష్మశ్రమతో సూక్ష్మకాలంలో పేరులాగాలని యత్నించావనీ అనరాదూ తీరిపోతుంది!

బ — పోనీ చేతగానితనంవల్ల అని ఒప్పగోకూడదూ!

స — జనాదరణకి ఏది లక్ష్యమో దాన్ని ఛీఛీ అనేస్తే తద్వారా జనదృష్టిలో పడచ్చుననిగావును తమరిసంకల్పం!

నే — కాదు, నాసంకల్పం వేరు

స — వేరుకాదు. జనదృష్టిలో పడడానికి కాకపోతే నీ ప్రకటన లెందుకూ?

నే — నాసరదా ఉంచుకట్టలేక.

స — మంచి సంగతే. సరదాలు ఉళ్లోనామరి!

ఏదో స్టేషను రావడంవల్ల రైలాగింది. నేను ఒకసోడా పుచ్చుగుని, కిళ్లీ కట్టు గోడానికి యత్నిస్తూ, వాళ్లు దిగవలసింది ఆస్టేషనేమో అని కనుక్కున్నాను. నన్ను గోదావరివంటిచోట దింపండీ తమరు దిగరన్నాడు బస్తాలబ్బాయి. బాగా అన్నాడని మెచ్చుగుందాం పోనీ అంటే, నామీదే అన్నాడాయిరి! వాళ్లునన్ను వొదిలేలాగ కనపడలేదు. ఏమిరాదారీ అని నేను చూస్తూండగా, కొందరితోపాటు, సూటువేసుగున్న ఓ టోపీ ఆయన మాపెట్టెలోకి వచ్చి మాకు ఎదర అవతలకానులో కూచున్నాడు. నా ప్రతికక్షులు ఆయన్ని ఎరుగున్నట్టు దాఖలాగా ముఖాలు విప్పారు. ఆయన 'ఇదుగో, ఇంటికేనా!'

అన్నాడు. సళాకు అవునన్నాను. వాళ్లు కుశలప్రశ్నలుకానిచ్చు గుంటున్నారు నేను కిళ్లీ కసబిసా కోపంగా నమిలి పారేసి, వాళ్లకళ ఏమైఉంటుందా అని బుర్రచించుగుని వాళ్ల మొహాలమీది కళనిబట్టి వాళ్లది టాకీకళగాని, గ్రామఫోను కళగాని అయివుంటుందేమో (అప్పట్లో రేడియోకళ లేదు గనక గావును) అనుకున్నాను. అల్లాయితే వీళ్లు నామీద తప్పకుండా పొరపాటుగల్లే విరుచుగుపడ్తా రనుకున్నాను ఒక వేళ నటులేమో అంటే వాళ్లు నన్నుగాని, నేను వాళ్లనిగాని గుర్తించుగోలేని అవస్థరాదని నాకుతెలుసు. గానమో, కవనమో వాళ్లకళ అనుకోడానికి నాకు ఆస్కారం కనిపించలేదు ఈ కాస్సేపట్లోనూ ఆటోపీ ఆయనకికూడా వాళ్లు తమ ప్రస్తుతపు పని బోధపఱిచి ఆయన్నికూడా తమతో కలుపుగుని ముమ్మరంగా తయారయారు. ఇక్కడికిముగ్గుర్నీ కూర్చొవుట్రా ప్రభో అనిపించి, నేను వాళ్లు అనుకునేవాణ్ని కాను అని చెప్పేసి బయటపడదా మనుకున్నాను కాని, వాళ్లు సమ్మెకంగా కూడబలుక్కున్నట్టు, ఒకడు ఆగేసరికి రెండోవాడు, వాడు మానేసరికి మూడోవాడు, వాడుతగ్గేసరికి మళ్లీ మొదటివాడు ఇల్లాగా ఉప్పు అందిపుచ్చుగుంటూ చక్రక్రమంలో తెంపులేని ధోరణిలో పడిపోయి నన్ను దుయ్యబట్టుగుని, నోటికొచ్చినట్టు తడువుకోకుండా మాటలూ, చేతికొచ్చినట్టు స్వేచ్ఛగా ఆయుధాలూ, (మొదటివాడు కొరడా, రెండోవాడు కొంకిబెత్తమూ, మూడోవాడు గొడుగు టోపీ)

ప్రయోగిస్తూ వ్యవహరించి, నాకు ఊపిరిసలపకుండా, మెడ నిలవకుండా చేసేశారు వాళ్ళమాటల్లోని ప్రకారంమాత్రం వాదిలి వృత్తాంతం పోగుచేస్తే, ఇల్లాఉంది

స — చాటుకున్న చెప్పండీ! మీ ఉద్దేశంఏమిటి? విమర్శించడం అంటే అభిమానంకొద్దీ పిలుచేసుకుని ఎందిలాపొగడడం, లేకపోతే అసూయకొద్దీ కసాయిలా నరకడమా? దూదినిలా ఏకడమూ, సంచినిలాగా దడమూ, శవాన్నిలా పాతెయ్యడమా? కళాకర్త మెచ్చుమూపడమా? దోషాలగురించి తంటసం పట్టించడమా? పాతసూత్ర శాస్త్రప్రమాణాలతో కళాజీవాన్ని కొలవడమా? పాతఅర్థమూ కొత్తఅర్థమూ ఏదీ తేలకుండాఉండే పారిభాషికపదాలు ప్రయోగించి మాట్లాడడమా? ఒకేఉదాహారణతో సూత్రించడమా? 'మంచి' 'చక్కని' 'అందమైన' 'సుందరమైన' 'బాగాఉండే' 'ఉచిత' వంటిపదాలు బతికున్న వాళ్లందరికీకూడా మీఒక్కరికే ఎంతఅర్థం ఇస్తాయో అంతే అర్థం ఇస్తాయనుకుని భ్రమించి వాడెయ్యడమా? ఇల్లాయితే బాగుండేది, అల్లాయితే రసందుగా ఉండేది, జాకీదిగితే ఇటునెగ్గి ఉండేది, పాడిఆడిఉంటేబేస్తునెగ్గేది అన్నట్టు జరిగినయథార్థం జరిగినరీతిగా జరిగిఉండకూడదని వాపోవడమా? ముగపెళ్లివానితనం అభినయించడమా?

బ — అందుకనే, నేనడిగితే, కళావిమర్శ వ్యర్థం. కళకీ ఆదరించేవాళ్లకీ మధ్య ఇరుక్కోవడం బత్తెంలేని వరకం. మధ్య నుండి యథార్థం చెప్పచ్చంటారా? మాటవరసికి ఉన్నది

ఉన్నట్టూ, ఉన్నదిలేనట్టూ, లేనిదిఉన్నట్టూ, లేనిదిలేనట్టూ 'చెకుముకిశాస్త్రి' చెప్పినట్టూ! ఉన్నకళని ఉన్నట్టుమీరు చెప్పలేరు అదేచెప్పాలిగాని మీరుచెప్పబూనడం హాస్యాస్పదం, చెప్పడం అసంభవం. కళాశరీరాన్ని ముక్కలకిందకోసి మరో రూపంలో అజ్ఞానులకి వడ్డించి ఎల్లాఉంటనడం ఘోరనేరం. ఉన్నది లేనట్టు చెప్పడం స్వామిద్రోహమూ, మాత్సర్యమూ గనక అది కళాభిరాగులకి తెలిసిపోయే దౌర్జన్యం. లేనిది ఉన్నట్టు బ్రహ్మాండంగా చెబితే, విమర్శ ఏకమొత్తంగా కుక్క ముట్టుగుపోతుంది లేనిదిలేనట్టు చెప్పడం మొదలెడితే ఆయుర్దాయాలు చాలవు ఉండేసింది చెప్పడానికి విమర్శ కేవల చరిత్రకాదు, ఉండబోయేది చెప్పడానికి కేవలజ్యోతిషం కాదు ఉండవలిసింది చెప్పడానికి కేవలశాసనం కాదు, ఉండ తగ్గది చెప్పడానికి కేవలనీతిపాఠం కాదు, నాయి [illegible] డానికి ఇంట్లోముచ్చటకాదు

టో — ఉండాలి ఉండాలి. విమర్శ అంతగా అనవసరంఅని నేను నమ్మను. దానిఉదయం కళారంగం పూర్తిఅయినతరవాత! కళకి భావన ఎల్లాగో విమర్శకి విచక్షణ అల్లాగ! కళ బాల్య సూచకం, విమర్శ వృద్ధత్వచిహ్నం. కళ జనకం అయితే విమర్శ జన్యం. దీర్ఘమననమూ, కళాకర్త హృదయావగాహన గురించి నిరంతరాలోచనా, నిదానం, సుముఖత్వం, హృదయవైశాల్యం, అహంకారరాహిత్యం, కళలోఉండగల ప్రత్యేకమహాత్మ్యాన్ని కనిపెట్టడానికి ఓపికా, మన్నించడానికి వినయమూ, పాటించ

డానికి కుతూహలమూ, చెప్పడానికి తాఖతూ, తొడగడానికి భాషాగల వ్యక్తిచేసే కళావిమర్శ కూడదనే మానవులుండరను కుంటాను. అటువంటిది వీరివల్ల కొంతమాత్రాన్ని ఆపనే కూడదని చెప్పిపారెయ్యడం సమంజసంకాదు.

ఈ సమయంలో నాకు మరి కోపం ఆగక, తారస్థాయిలో మనమూ అందుకుందాం అని లేచాను ఇంతలో నైలాగితే కూచోపడ్డాను. తక్షణం మళ్ళీ లేచి 'ఏక్ సోడా' అని కేకేసి "ఉండండి, మీమాటేమో గాని నాకు దాహం వేస్తోంది" అని పెట్టి గుమ్మందగ్గరికి పరిగెత్తి సోడా కొట్టించి పుచ్చుకుని డబ్బులిచ్చేసి గబగబా వచ్చి కూచోడంలో మొహం చాలా జోరుగా పెట్టేశాను.

నే — అయ్యా! ఒకటిరెండు మూగలారా! ఏమిటి మీ నిర్బంధం? నన్నేం జెయ్యమని తమసెలవు? ఏమరి దస్త్రాలు కట్టేసినట్టేనా? ఏం జెయ్యమన్నారు?

స — ఇంకా చెయ్యమని కాదు వెనక తమరు చేసిన దాన్ని గురించే! మామీద కక్ష్య మీలోపలెందుకు పుట్టి పెరిగిందీ అని.

నే — నాలో కక్ష్య చిన్నమెత్తైనా లేదు. నే సత్యం చెప్పేస్తున్నాను. నేను మీమీంద ఏమీ రాయలేదు. మీరు నన్ను చూసి ఎవరో అనుకుంటున్నారు.

స — అదిగో మళ్ళీ! నాలికా తాటిపట్టెయ్యా? మీపేరు ఫలానా కాదూ?

నే — అవును.

స — అయితేమరి ఇహా నేం? మేంపొరపాటు ఎక్కడపడ్డామూ? సమాధానం చెప్పండి, లేకపోతే క్షమాపణేనా కోరుకోండి.

ప్రస్తుతవిషయం ఏదీ నాకు స్ఫురించలేదు వాళ్ళ పేర్లు వినగానే, వాటికి నాకు అసహ్యం వేసింది. నే ప్రకటించిన ఉద్దేశ్యాలు ఏదో స్వలాభానికి అభ్యయించుచున్న వ్యక్తులేమో వీళ్ళు అనుకున్నాను అయినా, వాళ్ళ అజ్ఞానానికి క్షమాపణ కోరుకోడానికి నామనస్సొప్పక నేను నచ్చచెప్పలేక ఇల్లా అన్నాను

నే — నేను తప్పుచెయ్యలేదుగనక క్షమాపణ కోరుకోను. కావాలంటే, వినండి విమర్శ నాయిష్టం. మీయిష్టం మీదైతే నాయిష్టం నాది. నాపని నాకు జన్మహక్కు! మీరు ఉన్న వే మూడువేసవాళ్ళయితే, నేను పదికూడా చూడగలను. కళకి చీడపడితే నేను చూస్తూ ఊరుకోలేను. అభిరుచులు పాడవుతూంటే నేను భరించలేను నేను ముళ్ళపొంకి ఛేదిస్తాను, కుళ్ళు చెత్త కడిగేస్తాను, 'అంగవ్రాతములో చికిత్సకుడు దాదుష్టాంగంబు ఖండించి' — జాగ్రత్త — నాదృష్టిలో కళాకర్త మొదటి ముద్దాయీ, వాడికళ రెండో ముద్దాయీకాగా, వాదీ, వాది ప్లీడరూ, ప్రతివాదీ, ప్రతివాదిప్లీడరూ, సాక్షులూ, ఉత్తర సాక్షులూ, దక్షిణసాక్షుల్లూ, పంచాయతీ, జడ్జీ — ఇవన్నీ నేనే, లక్ష్మణకవే అవతలకథలో లక్ష్మణుడూ, రాముడూ, ఆంజనేయులూ అవుతూన్నట్టు! ఘోరకృత్యులు చేసిన కళాకర్తని నేను ఉరితీసిపారేసి ఆంధ్రజనానికి వాడివల్లరాగల అపాయం తొలగిస్తాను. నన్నాశ్రయించడాన్ని బట్టి నేను కళాకర్తల్ని పైకితీసుకు

రాగల్ను. అవసరాన్ని బట్టి నేను తప్పుల్ని గొప్ప చెయ్యగల్ను, లేకపోతే ఒప్పుల్ని కప్పెట్టగల్ను. కళాకర్తలంతా తరవాత తరవాత వారసత్వంగురించి తన్నుకుచావకుండా ప్రతీవాడికి తలోజాగా కేటాయించి వాళ్ళకి చీటీలుకట్టేసి ఉచితస్థలాల్లోకి వాళ్ళని జేరేసి, నా అనుజ్ఞ లేకుండా వాళ్ళు పైకి ఎగరడానికిగాని కిందికిపడడానికిగాని వీళ్ళు తగ్గిపోయేట్టు వాళ్ళని మేకుబందీ చేసి పారేస్తాను. ఎక్కడైనా బావగాని వంగతోటదగ్గిర కాదన్నట్టు కళాకర్త నాకు ఎంతదగ్గిరచుట్టం అయినా సరే, ఎంత ఎరుగున్న వాడైనా సరే కళలో పస లేనప్పుడు నిర్మొహమాటంగా వాణ్ణి తెగ విమర్శించి విమర్శించి వొదిలిపెడతానుగాని ఊరుకోను. అందుకని గుంజాలేనివాళ్ళకి నేనంటే రార్! నాకు సన్మానం జరిగినప్పుడు 'సుకృతిసురాం' అనే బిరుదం నాకిస్తే నేను అభ్యంతరం చెప్పనని చాలామంది అనుకోడమూ, ఊహించుకోడమూ నాకు తెలుసు. నా తాఖతుగురించి మీరు దుఃఖించకండి. నాఅంత జ్ఞాని విమర్శపాటి చెయ్యడా? అందులోనూ కళావిమర్శ చెయ్యడానికి ఆకళ రానక్ఖర్లేదు అనికాదు నేనసేది, ఆ కళ వచ్చిఉండకూడదు అనికూడా నొక్కుతాను. అప్పుడుగాని ఆ కళయొక్క అసలు నిగ్గు తేలదంటాను. పారం విమర్శించడానికి పారం చెప్పని ఇనస్పెక్టరే తగునని నా అభిప్రాయం. తెలుగుగానవిమర్శకి హైందవేతరుడు చాలు, తెలుగుచిత్రవిమర్శకి ఆంగ్లయ్య ఉండాలి, తెలుగుకవితా విమర్శకి అరవయ్యరు నిరాక్షేపణంగా ఉండచ్చు, సరి తెలుగు నాటకప్రదర్శనవిమర్శకి స్పృహలేనివాడు మరీరక్కున సరి

పోతాము. సత్తా లేకపోతే మీరు కళ మానుకుని మరోపని చూసుకోండి మీరు చవటకళ సృష్టిచేసినన్నాళ్ళు నేను తీవ్ర విమర్శ మానను. ఎక్కేగుమ్మమూ దిగేగుమ్మమూ మోస్తారె మీరు ఎవరిదగ్గరికి ఎన్నిసార్లు వెళ్ళి ఎంతపడుచుగున్నా నా వాతలు నేపెట్టితీరతాను. మరి నేగస్టేషను వచ్చేస్తోంది. జ్ఞాపకం పెట్టుగోండి

స — చాల్లేవయ్యా! ఆకారమా నీ కాధారం? నామాలా నీకు ముఖ్యం? నీవాలా నీకు శరణ్యం? రూపాలా నీకు జీవం? ఆత్మప్రశంసణా నీ అంతర్వ్యాప్తి? వ్యక్తిదూషణా నీపరమావధి? సంకుచితత్వమా నీజ్ఞానం? నీచసాపత్యాలు తెచ్చావు నువ్వు ఒకడి ఔన్నత్యం స్థాపించడం! నీమనస్సులో ఉందని నువ్వు అనుకునేదా నీకు ప్రపంచంలో సందర్శించవలిసి కళ? నువ్వు కళాచార్యుడివా అల్పులకి కళోపదేశం అడక్కుండా చెయ్యడానికి!

బ — అయ్యా! కళాప్రారంభకుణ్ణి విమర్శించడం పిచ్చిక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించడం. కళావర్తకుణ్ణి విమర్శించడం చెవిటివాడికి శంకూదడం. కళారాధకుణ్ణి విమర్శించడం కమ్మరివీధిని సూదులమ్మడం. కళాజీవిని విమర్శించడం పొట్టమీద కొట్టడం. స్థిరపడ్డ కళాకర్తని విమర్శించడం ఏటికి ఎదురీదడం. కటూన్న కళాకర్తని విమర్శించడం చెవులోని జోరీగఅవడం. అల్పుడైన కళాకర్తని గొప్పగా విమర్శించడం వాడితోపాటు అధోలోకానికి టిక్కట్టు కొనుక్కోడం. ఊరుకుంటే చాలా సంగతులు సవ్యంగా పరిష్కారం కాగలవ్. ఉత్తమకళాకర్తకి విమర్శ మోకాలి బంటి. అధమకళాకర్తని

అనామకంగా విడిచి పెట్టడం ఉభయతారకం.

టో — అబ్బ! నువ్వు విమర్శఅంటే చెడుఅర్థమే లాగుతున్నావయ్యా! అదేం ధర్మం! విజ్ఞానాన్నిబట్టి అన్నిటిలోనూ మాత్సర్యం తగ్గించుకోవాలి. విమర్శ అంటే, వెనకటి మల్లేనే నెత్తిమీద మొట్టికాయ కాదు, మొహంమీద చెప్పు కాదు, కంఠానికి ఉరి కాదు, గొంతులో పుండు కాదు, వీపుమీద చరుపుకాదు. "బాహ్యస్థితిగతులవల్ల తన చిత్తవృత్తిలో కలిగిన పరివర్తనలు అన్యహృదయాలకి కలిగించాలనే సదుద్దేశంతో కళాకర్త చేసేప్రకటనని వ్యాసంగం చేసుకోడమే" విమర్శ. కళాకర్తయొక్క భావనాశక్తికీ, విచక్షణకీ సమత సమర్థించడం విమర్శ అంతర బాహ్యచరిత్రల్ని పరశీలించి, ఏదైనా కృతిజనించడానికి దేశకాలపాత్ర సందర్భాలు ఎట్లు పరిపక్వం అయినాయో, సు॥ ఆకర్తే ఆకృతి రచించడానికి పరిస్థితులు ఎల్లా అనుకూలించాయో కనిపెట్టడం విమర్శ. అనేకకృతులు రచించడపు పనిలో కళాకర్త పడిఉండే టప్పుడు వాటిని విడివిడిగా దేనిమట్టుకి దానిని సమగ్రంగా ఆస్వాదించడపురీతి చెప్పడానికి ఒక్కొక్క కర్తకి వ్యవధీ, ఒక్కొక్క కర్తకి నేర్పూ, ఒక్కొక్క కర్తకి ధైర్యమూ, ఒక్కొక్క కర్తకి నిర్మొహమాటమూ చాలవుగనక అటువంటి పని చెయ్యగలగడానికి విమర్శ అవసరం అంటాను. కళని విమర్శించే వాడు కర్తయొక్క నిజమైన అవస్థ గ్రహించడానికి కర్తవంటి వాడై, తరువాత ఎంతో క్షోభ పడ్డమీదట కర్తయొక్క హృదయస్థితి వహించగలిగితే, అక్కడికి అతడికి ఇల్లలకడం

అయి, స్వంతపని యీూపత్తూ మారి ముంగుంటుంది. ఒక సార్థకకళలోని ప్రతిభ కర్తేవచ్చి చూపించేంటే మరొకరొచ్చి ప్రకటించినప్పుడు కూడా ప్రజల్లో కీర్తిస్తే, కళారాధనా హెచ్చుతాయేగాని తగ్గవు. నిశ్చయమైన తేజస్సుగల కళ తన చుట్టూగల అనేక జనాజ్ఞాన మేఘాలవల్ల మాటుమణిగి పోయినప్పుడు వాటిని పటాపంచలుచేసి ఆ కళయొక్క తేజోరాభను ప్రపంచానికి కలగచేసే ప్రభంజనం విమర్శ. కర్తయొక్క హృదయ విహారాన్ని కర్తకంటేకూడా ఎక్కువ వివరాలతో కూడా గుర్తించగలిగాడా ఇతరూ అనిపించగలవాడు అన్నదే విమర్శ. క్రౌర్యంలేని స్వాతంత్ర్యమూ, మెట్ట వేదాంతం లేని జ్ఞానమూ, ముట్టకాయలు వెయ్యేపు సరదాలేని ఇంగిత జ్ఞానమూ, పరాత్కోసం లేని పాండిత్యమూ, చాటుచాటు శౌర్యంలేని త్రికరణశుద్ధి, స్వాతిశయం లేని దర్జా, కాకిచూపు లేని దృష్టి, మేష్టరీతనం లేని అధికారమూ, కుచోద్యంలేని హృదయమూ విమర్శకుడు కనపరుస్తాడు. సత్యస్పృష్టిని పోల్చుకోగలిగి, సత్యవిషయాల్ని స్వీకరించగలిగి గూహింకాని హృద్యభాషలో కళ దొరికేచోట్లు ఇవిగోఅని చెప్పడమేకాక, చెప్పగానే జనానికి విశ్వాసంకూడా కలిగించగలిగి నెగ్గినవాడు చెప్పిందే విమర్శ.

ఇప్పటికి నాప్రయాణం చాలావరకు అయిపోయింది. మరి తరవాత స్టేషన్లో నేను దిగిపోడమే. నాకు ధైర్యంవచ్చింది. టోపీ ఆయన ఏదో శ్రమపడి ఏకరువుపెట్టాడుగాని, అదంతా నాకూ తెలుసు. అదంతా పుస్తకాల్లోదే, ఎటొచ్చీ ఏదిఎక్కడిదో అతడు

చెప్పలేదు, శెలంఇస్తే నేను చెప్పేస్తాను. చివరముక్కలు నేనే అనేసి ఆ రైల్వే సారస్వతగోష్ఠి ముగించెయ్యాలని నాకు అనిపించింది.

నే — (టోపీ ఆయనతో) స్వామీ, తమ పేరు?

టో — దాసు.

నే — నమస్కారం. మీతో నేను ఏకీభవించను. దేశాభిరుచి పాడైపోయింది. కొన్నికొన్ని మంచికృతులున్నా నేలాకోళపు రకం ఎక్కువైనాయి. వాటికి గౌరవం రాకుండా చెయ్యడం పని నామీద, నాభుజస్కంధాలమీద పడ్డది. ఒక్కొక్క కృతిలో లక్షదోషాలున్నా, మరి ఏమీ లేకపోవడమున్నా. పాడుకృతులకి తెగప్రచారం. వాటిల్లో నియమాలు బొత్తిగా లేకపోడం. అయినాసరే, జనం అల్లాంటి అధమకళల్ని పాటించి గౌరవించడం నాకు పరమాసహ్యం వేసి, జనంయెడల జాలికొద్దీ ఈపాడుపనికి దిగాను. కలేజాఉండీ మొగతనం ఉంటే సమాధానం చెప్పండి.

టో - మీరుచెప్పారుగా! మేమూ నిమిషంలో చెప్పచ్చు గాని, ఒక్కొక్క సమాధానంవల్ల అల్పవిమర్శకి అనవసరపు గొప్పతనం వస్తుందేమో అనేభయంవల్ల మాట్లాడక ఊరుకోడం జరుగుతూంటుంది.

ఇంతలో మావూరు స్టేషన్ తాలూకు 'కులీ, కులీ, కులీ!' వినబడింది. రైలాగింది. నేనుదిగేసి దాసుగారితో,

నే — సెలవండి. తమకి సోడాకావాలా?

టో — చిత్తం. అక్కర్లేదు.

నే — (కడమ ఇద్దరితో) మీరు సోడాపుచ్చుకుంటారండీ?

స — ఎంతమాత్రంవద్దు. మీా సమాధానరసంతో మాకు కోరూరి తృష్ణ పోయింది.

నే — (వాళ్లకి నమస్కరించి) అయ్యా! మళ్లీమనం ఎప్పుడు కలుస్తామో! కొంచెం నిదానించిచెబుతారా, ఒక సంగతి అడుగుతాను.

స — అడగండి.

నే — మీామీాద నే రాసింది మీారెక్కడ చూశారూ?

స — మద్రాసు ఫలానా పత్రిక ఫలానా సంచికలో!

నే — ఉందా ఇక్కడ ?

స — లేదండీ !

నే — నేను ఏరచనా పంపించలేదండీ, ఎల్లా అచ్చుడిందోగాని అచ్చుపడ్డరచనా ? మీారు టాకీవారా ?

స — అవునండీ. మాపేర్లతో ఉంటేనే ! స్పష్టంగా మీా ఇంటిపేరు ఉంటేనే!

నే — నాపేరుందా?

స — లేనట్టుందండోయ్ ! (బస్తాతో) ఏరా ?

బ — లేదు.

నే — పేరులేకుండా ఫక్తుఇంటిపేరా ! అల్లాచెప్పండి మరీ! ఆవ్యక్తి మరొకరు అయిఉండాలి.

స — మీాకు దగ్గిరవాడా ?

నే — ఏమో ! ఏ తూర్పు — పడమర సంబంధమో !

స — నిజంగానేనాండీ ?

నే — నిశ్చయంగా.

బ — అల్లాయితే మీారుమమ్మల్ని క్షమించాలి. ఇందాక

ణ్ణొంచీ జరిగిందానికంతకీ బొడ్డుతున్నాంలూ! మరి మమ్మల్ని విమర్శించింది మీరే అయినట్టు సమాధానం మొదలెట్టారే!

నే — ఎంజెయ్యనూ! మీరంతా అటకాయించేసరికి చేతా వాతా అయినంతమట్టుకి తంటాలుపడ్డాను. కాని, ఆ ప్రమాదంవల్లనై తేం మీపరిచయభాగ్యం నాకుకలిగింది. కృతజ్ఞణ్ణి. ముఖ్యంగా దాసుగారికి.

బ — అయితే, ఆయనెవరో అల్లా ఇంటిపే ర్పెట్టుగోడం ఎందుకండీ!

నే — ఇందుకే! లాభం ఏమన్నా ఉంటే జమకట్టుగోడానికిన్నీ, నష్టంవస్తే ఖుస్సురాసెయ్యడానికిన్నీ ఏమో! లేకి, అహంకారం చంపుగున్నా మమకారంవదల్లేక గావును

బ — ఐతే చిక్కేనండీ. చాలా రచనలున్నాయే అల్లాంటివి! వాటిల్లో అభిప్రాయాలన్నీ మీ నిశ్చితాభిప్రాయా లనుకుంటున్నాం!

నే — మరి అనుకోకండి. అటువంటి విమర్శనాశక్తి నాకు లేదు. మరి రైలుకదుల్తుంది. సరే, ఈ యినపదారివిమర్శ చాలు గానండి, ఇప్పుడిక హృదయాలు కుదటబడ్డాయిగనక సోడా పుచ్చుగోరూ?

ముగ్గురూ — అవశ్యం.

అనగా, వాళ్లకి సోడాలిప్పించి కిల్లీలుకూడా ఇప్పించి నేను నమస్కరిస్తూండగా రైలు కదిలిపోయింది.

సంపూర్ణం